
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అమరావతి
విజయవాడ
20
★★★★★
సోమవారం 28 ఆగస్టు 2017



- ఊరేగింపుగా నదులు, కాల్వలకు గణనాథుడు
- కృష్ణానదిలో తొలిరోజు గణేశ నిమజ్జనం

20



హెల్మెట్... పెట్టాల్సిందే..!



- సెప్టెంబరు 1 నుంచి అమలుకు సర్వసన్నద్ధం
- ప్రభుత్వ ఉద్యోగులకూ తప్పనిసరి
- విద్యార్థుల బాధ్యత కళాశాలదే
- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్

-వివరాలు 8లో...

వాస్తు బ్రేక్

- దుర్గగుడిలో వాస్తు విరుద్ధంగా జరుగుతున్న పనులకు ట్రస్టు బోర్డు బ్రేక్
- దేవస్థానం మాజీ ఆగమ పండితుడు వెంకటేశ్వర సోమయాజులతో సమావేశం
- 30న జరగాల్సిన ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

దుర్గగుడిలో వాస్తువిరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులకు ట్రస్ట్‌బోర్డు రెడ్‌సిగ్నల్ చూపించింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తు సమ్మతంగా ప్రస్తుత నిర్మాణాలను వేరొక చోట చేపట్టేందుకు అభ్యంతరం లేదని కూడా ట్రస్ట్‌బోర్డు స్పష్టం చేస్తున్నది. ఇదే సమయంలో భక్తులకు అవసరమయ్యే పనులు మినహా, అనవసర వ్యయం అయ్యే మిగిలిన నిర్మాణాలు చేపట్టరాదని కూడా బోర్డు తేల్చి చెప్పింది. ఇందులో భాగంగా ఆదివారం దేవస్థాన మాజీ ఆగమ సలహాదారు వెంకటేశ్వర సోమయాజులును ఆలయానికి తీసుకువచ్చి, ప్రస్తుత పనులను చూపించి, సభ్యులు ఆయనతో చర్చించారు.

6





మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు. పక్కన గవర్నర్‌నరసింహన్, మంత్రి కామినేని తదితరులు

సమాజం కోసం జీవించండి

- ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తేనే అభ్యున్నతి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'మీ కోసం జీవించవద్దు... సమాజం కోసం జీవించండి'... అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు యువతకు పిలుపునిచ్చారు. 'ప్రతి వ్యక్తీ సమాజ హితం కోసం పనిచేయాలి... సమాజ సేవ చేయటం ద్వారా వచ్చే ఆనందం నిరుపమానం. ఒక్కసారి దానిని ఆస్వాదిస్తే సేవలో ఉన్న మాధుర్యమేమిటో మీకూ తెలుస్తుంది' అన్నారు. ఆదివారం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

9

బెటర్ బెర్త్ ఎక్కడో?

- సీఐల్లో బదిలీల ఫీవర్
- ఖాళీగా మూడు పోలీస్ స్టేషన్లు
- మంచి స్థానాల కోసం అన్వేషణ

3

సీపీఎస్ రద్దు కోసం..

● ఉద్యోగ పర్వం

ప్రభుత్వ ఉద్యోగుల గర్జన

● బెజవాడలో 'మిలియన్ మార్చ్'
● సెప్టెంబర్ 1న లక్షలాది మంది ఉద్యోగులతో కిక్కిరిసిపోనున్న బెజవాడ
● తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి మహార్యాలీ
● బిషప్ అజరయ్య స్కూల్‌లో భారీ బహిరంగ సభ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమల్లోకి తీసుకు రావటంపై ప్రభుత్వ ఉద్యోగులు అమీ తుమీ తేల్చుకోవటానికి సిద్ధమయ్యారు. బెజవాడ వేదికగా లక్షలాది మందితో గర్జించటానికి 'మిలియన్ మార్చ్'కు ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌లో అన్ని ప్రభుత్వ సంఘాల ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా పాలు పంచుకుంటున్నాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తప్పనిసరి చేసిన సీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపు చేస్తూ ఉన్నతాధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయంపై ప్రభుత్వ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఉద్యోగుల సమిష్టి ఆందోళనలతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రయోజనం కల్పించే దిశగా ఫ్యామిలీ పెన్షన్, డెత్ గ్రాట్యుటీలకు సంబంధించిన జీవోలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సీపీఎస్ వ్యవస్థ రద్దునే కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ విషయంలో సంఘటిత చైతన్యాన్ని చాటడానికి భవిష్యత్తులో నిర్వహించబోయే మహోద్యమం గురించి కార్యాచరణ రూపొందించుకోవటానికి ఈ మిలియన్ మార్చ్‌కు శ్రీకారం చుడుతున్నారు.

● **ఏమిటీ సీపీఎస్ ?**
సీపీఎస్ అంటే... కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) స్థానంలో ఈ సరికొత్త విధానాన్ని తీసుకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన నూతన విధానం ఇది. దీని ప్రకారం 2004 సంవత్సరం తర్వాత వచ్చిన ఉద్యోగులంతా సీపీఎస్ పరిధిలోకి వస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసమే ఈ విధానం తీసుకున్నప్పటికీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని తమ ఇష్టానుసారం అనుసరించవచ్చునని సూచించటం జరిగింది. దీనిని అమలు చేయాలన్నా, చేయకూడదనుకున్నా పూర్తి విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను తప్పనిసరి చేయలేదు.

● **ఉన్నతాధికారుల అనాలోచిత చర్యతో అమల్లోకి :**
రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల అనాలోచిత దుందుడుకు చర్యల ఫలితంగా... ఇక్కడి ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్ విధానంలోకి వచ్చారు. ఒక్క ఉదుటున జీవో నెంబర్ 653, 654, 655లను జారీ చేసి, సీపీఎస్ వ్యవస్థను అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ విధానాన్ని అమలు చేసే ముందు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల అభిప్రాయం ఏమిటన్నది కూడా తీసుకోకుండా ఏకపక్షంగా అమల్లోకి తీసుకు వచ్చారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్నారు.

● **పాత విధానం ఇలా ..**
గతంలో ఉన్న విధానాన్ని చూస్తే... ఉద్యోగులు భవిష్యనిధి కోసం తమ వంతు ప్రతినెలా దాచుకునేవారు. దీనికి ప్రభుత్వం కొంత మ్యాచింగ్ కలిపి జమ చేస్తుంది. పదవీ విరమణ తర్వాత వడ్డీతో సహా మొత్తం దాచుకున్న సొమ్మును పొందేవారు. కేడర్‌ను బట్టి నిర్ణీత గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు పొందేవారు.

● **కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం ఇలా :**
సీపీఎస్ నూతన విధానంలో పాత విధానం ఉండదు. కేడర్‌ను బట్టి ఉద్యోగి బేసిక్‌లో డీఏ 10 శాతం ఎంత మొత్తం అయితే అంత మొత్తం ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వేసి ఆ మొత్తాన్ని శాశ్వత పదవీవిరమణ (ప్రాన్) ఖాతాలో జమ చేస్తుంది. ఇలా ఈ ఖాతాలో ఉన్న సొమ్మును ఎన్ఎస్‌బీఎల్ అనే ప్రైవేటు సంస్థ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఈ సంస్థకు చెందిన ఫండ్ మేనేజర్లు రకరకాల సంస్థలలో పెట్టుబడులు పెడతారు. మన రాష్ట్రానికి వచ్చేసరికి ఎల్ఐసీ, యూటీఐ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలలో పెట్టుబడులు పెడతారు.

● **'సీపీఎస్' పై ఎందుకింత రాద్ధాంతం ?**
కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలో గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు వంటివి ఉద్యోగులు పొందే పరిస్థితి లేదు. అనేక ఇబ్బందుల గురించి ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తావిస్తూ పెదవి విరుస్తున్నారు. ఉద్యోగి చనిపోతే దహన సంస్కారాలకు రూ.15 వేలు తప్పితే ఈ విధానం ద్వారా పొందే అదనపు ప్రయోజనాలు లేవు. పదవీ విరమణ చెందిన ఉద్యోగికి తాను దాచుకున్న సొమ్ములో పూర్తిగా తీసుకోవటానికి వీలు లేదు. ఉద్యోగి సొమ్మును 60 - 40 గా విభజిస్తారు. ఉద్యోగి వాటా 60 శాతంలో 30 శాతం ట్యాక్స్ మినహాయింపులుపోను మిగిలిన సొమ్మును అందిస్తారు. అంటే ఒక ఉద్యోగి రూ.30 లక్షలు దాచుకుంటే అందులో 30 శాతం రూ.9 లక్షలు పోగా రూ.21 లక్షలు మాత్రమే ఇస్తారు. ఇక పోతే మిగిలిన 40 శాతం ఉద్యోగుల పొదుపును మళ్ళీ యాన్యుటీలలో (షేర్ మార్కెట్) పెట్టుబడులు పెడతారు. వీటిపై వచ్చే వడ్డీని 12 నెలల దామాషాలో విభజించి ఏ ఏడాది కాఏడాది పింఛను ఇస్తారు. సీపీఎస్ విధానంలో భాగంగా ఉద్యోగుల దాచుకున్న సొమ్మును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల మార్కెట్ హెచ్చు తగ్గులకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. మార్కెట్ పడిపోతే ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు కూడా తగ్గిపోతాయి. చనిపోయిన ఉద్యోగులు పింఛను అందుకోవాలన్నా కష్ట సాధ్యంగా ఉంటుంది.

● **పోరాటాలతో... డెత్‌గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధన**
ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమై విజయవాడ నుంచి ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉధృత స్థాయిలో ఆందోళనలు చేయటంతో ప్రభుత్వం స్పందించింది. హర్యానా తర్వాత మన రాష్ట్రం రెండవదిగా డెత్ గ్రాట్యుటీని ప్రవేశపెట్టింది. ఫ్యామిలీ పెన్షన్‌ను మొదటి సారిగా మన రాష్ట్రమే అమలు చేసింది. చనిపోయిన ఉద్యోగులు డెత్ గ్రాట్యుటీతో పాటు, ఫ్యామిలీ పెన్షన్ లను పొందే సౌకర్యం ఉంది

సీపీఎస్ పూర్తిగా రద్దు చేసేందుకు మహోద్యమం



కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలోని ఇబ్బందులను గుర్తించిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమయ్యారు. ఇటీవల ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులు పదవీ విరమణ చెందితే ఒకరికి రూ. 534, మరొకరికి రూ. 232ల చొప్పున పింఛను వస్తోంది. ఇటీవల ఓ ఎస్ఐ, అతని భార్య ప్రమాదంలో చనిపోతే వారి పిల్లలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. రేపు మాకేమైనా అయితే మా పిల్లల పరిస్థితి ఏమిటన్న భయం ప్రతి ప్రభుత్వ ఉద్యోగిని వేధిస్తోంది. అందుకే సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ మిలియన్ మార్చ్‌కు శ్రీకారం చుట్టాం. ఏపీ అమరావతి జేఏసీ, ఏపీ ఎన్‌జీఓ వంటి సంఘాలు కూడా మా ఆందోళనలకు మద్దతుగా నిలుస్తూ పోరాటంలో పాలు పంచుకుంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పోరు బాట పట్టిన ఫలితంగానే రా ష్ట్ర ప్రభుత్వం నుంచి డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్‌లను పొందటం జరిగింది. ఫ్యామిలీ పెన్షన్‌లో కూడా ఒక మెలిక ఉంది. ప్రాన్ ఖాతాలో ఎంప్లాయీ దాచుకున్న మొత్తం సొమ్మును కూడా ప్రభుత్వం తీసుకుంటోంది. దీనిని మేం వ్యతిరేకిస్తున్నాం. మేం ఒక్కటే చెబుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రాన్ అక్కౌంట్లలో ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ. 1500 కోట్లతో పాటు , ఉద్యోగుల పొదుపు రూ. 1500 కోట్లు రూ. 3000 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుని పాత విధానాన్నే కొనసాగించాలని వేడుకుంటున్నాము. సీపీఎస్ ను పూర్తిగా రద్దు చేసేందుకు మేం ఆందోళన బాట పట్టాము. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేం ఎక్కడా పోరాడటం లేదు. శాంతియుతంగా, వినయంగా మా సంఘటిత కాంక్షను ప్రభుత్వానికి తెలియచెప్పటం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

సీఎం దాసు, ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు

ఆర్పీఎఫ్‌లో 19,952 ఉద్యోగాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో 19,952 ఉద్యోగాలను భర్తీ చేయడానికి రైల్వేశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది అక్టోబర్ 14 వతేదీలోపల దరఖాస్తులను పంపంచాల్సి ఉంటుంది. రూ.5,200 నుంచి 20,200 వరకు వేతనం గల ఉద్యోగాలు ఉన్నాయి. వేతనంతోపాటు రూ.2000 గ్రేడ్ పే కూడా ఇవ్వనున్నారు. ఈ ఉద్యోగాలు పొందేందుకు అభ్యర్థులకు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో వయస్సు ఉండాలి. జనరల్ కోటాలో 8901, ఎస్సీ కోటాలో 3317, ఎస్టీ కోటాలో 3363, ఓబీసీ కోటాలో 4371 ఉద్యోగాలు ఉన్నాయి. రాత పరీక్ష, మెడికల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్‌లలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఇండియన్‌రైల్వే.జీవోవి, ఐఎన్ వెబ్‌సైట్‌ను చూడొచ్చు

హెచ్ఓడీలకు బస్సు పాసులు

గుంటూరు, విజయవాడల్లో నివాసం ఉంటూ వెలగపూడిలోని సచివాలయంలో ఉద్యోగం చేసే హెచ్ఓడీలకు, ప్రయాణసదుపాయం లేని గెజిటెడ్ అధికారులకు కూడా రాయితీబస్సు పాస్‌లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు కొందరికి మాత్రమే రాయితీతో కూడిన బస్సు పాసులు ఇస్తూ వస్తున్నారు. ఇది కూడా సీఆర్‌డీఏ పరిధిలో ప్రయాణించేందుకు మాత్రమే వీలుండేది. అయితే అధికారిక పనులపై జిల్లా బస్సులలో ప్రయాణించాలంటే ఉద్యోగులు తమ డబ్బులు చెల్లించి ప్రయాణించవలసి వస్తోంది. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాయి. ప్రభుత్వం బస్సుపాసులు అంగీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికే ప్రయాణ సదుపాయం ఉన్న గెజిటెడ్ ఉద్యోగులకు మినహా మిగిలిన గెజిటెడ్ ఉద్యోగులకు, హెచ్ఓడీలకు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, నాలుగోతరగతి ఉద్యోగులు అందరికీ బస్సు పాసులు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. మొత్తం రూ.1350 విలువగల బస్సు పాసులో ప్రభుత్వం రూ.900 భరిస్తుంది. పాసు తీసుకునే ఉద్యోగులు రూ.450 చెల్లించాల్సి ఉంటుంది. దీనిత గుంటూరు, విజయవాడలలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు.

బెటర్ బెర్త్ ఎక్కడో?

● సీఐల్లో బదిలీల ఫీవర్ ● ఖాళీగా మూడు పోలీస్ స్టేషన్లు ● మంచి స్థానాల కోసం అన్వేషణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇటీవల ఒక కార్పొరేటర్ నగరానికి నడిబొడ్డున ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఒక కేసు విషయాన్ని మాట్లాడుతూ 'అవును మీకు బదిలీ ఉందంట కదా... ఎక్కడికి వెళ్తున్నారు..?' అని ప్రశ్నించాడు. మూడు రోజుల క్రితం రాత్రి పూట గస్తీ తిరుగుతున్న మరో సీఐకీ ఇదే అనుభవం ఎదురైంది. కమిషనరేట్‌కు వెళ్లినా, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా చర్చంతా బదిలీలపైనే. పోలీసుల్లో ఏ నలుగురు కలిసినా సీఐల బదిలీలపైనే మాటలు. ప్రస్తుతం సీఐల బదిలీలు పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బదిలీలు జరగడం ఖాయమని చెబుతున్నప్పటికీ, దానికి ముహూర్తం ఎప్పుడన్నది అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలు, ట్రాఫిక్, మహిళా ఠాణా కలిపి మొత్తం 25 వరకు ఉన్నాయి. వీటిలో గన్నవరం, పటమట, అజిత్‌సింగ్ పోలీస్ స్టేషన్లకు సీఐలు లేరు. ఈ మూడు ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్నాయి. మిగిలిన 22 స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లకు దాదాపుగా రెండున్నరేళ్ల కాలం పూర్తయింది. ఇప్పుడు వీరందరినీ ప్రస్తుత స్థానాల నుంచి బదిలీ చేయడంతోపాటు ఖాళీగా ఠాణాలకు కొత్త వారిని నియమించాల్సి ఉంది. కొద్ది నెలల క్రితమే ఈ బదిలీలు జరుగుతాయన్న ప్రచారం జోరుగా సాగింది. కొన్ని కారణాల వల్ల ఈ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. ఒకవిధంగా బదిలీల అంశం సీఐలను ఊరిస్తోంది. తమకు స్థానచలనం ఖాయమనుకున్న ఇన్‌స్పెక్టర్లు మంచి బెర్త్‌ల కోసం వెతుక్కుంటున్నారు. రాజకీయ నేతల ఒత్తిడి, కేసుల సంఖ్య తక్కుగా ఉన్న ఠాణాలే ఉత్తమమనుకుంటున్నారు. అలాంటి స్టేషన్లను వెతుక్కునే పనిలో సీఐలు ఉన్నారు. మరోవైపు కొంతమంది సీఐల్లో బదిలీల ఫీవర్ బలంగా ఉంది. ఉన్న స్థానాల నుంచి వెళ్లిపోవడం ఖాయమనుకున్న వారు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫైళ్లను మాత్రమే చూస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వెళ్లిపోయే ముందు లేనిపోని భారాన్ని మోయడం ఎందుకు అన్న భావన కొందరిలో నాటుకుపోయింది.



ఆ ఠాణాలంటే వణుకు

లూప్ లైన్ కంటే, స్టేషన్ల పోస్టింగ్‌లకే ఎక్కువ ఆసక్తి చూపే ఇన్‌స్పెక్టర్లు మూడు స్టేషన్లంటే మాత్రం భయపడుతున్నారు. అజిత్‌సింగ్ నగర్, పటమట, గన్నవరం స్టేషన్ల వైపు కన్నెత్తి చూడడానికి వారు ఇష్టపడటం లేదు. ఈ మూడు స్టేషన్లలో కర్చీఫ్‌లు వేసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో వరుసగా ఇద్దరు సీఐలపై వేటు పడింది. పోస్టింగ్‌లు తీసుకున్న సీఐలు ఏడాది పూర్తవ్వకుండానే వెళ్లిపోతున్నారు. ఈ ఠాణాకు ఉన్న వాస్తు దోషమే కారణమని సిబ్బంది భావిస్తున్నారు. గన్నవరం విషయంలోనూ ఇదే భావన ఉంది. హెడ్‌కానిస్టేబుల్ సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న తర్వాత అప్పటి సీఐ ఆలీని అధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత నుంచి ఈ ఠాణాకు సీఐ లేరు. ఇక్కడ చార్జ్ తీసుకోవడానికి ఇష్టపడడం లేదు. ఒకవేళ తీసుకున్నా దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోతున్నారు. పటమట ఇన్‌స్పెక్టర్ కెనడీపై పడిన వేటు ప్రభావం ఇతర సీఐల్లో వణుకు పుట్టిస్తోంది.

దాడికి పాల్పడ్డ తొమ్మిది మందిపై కేసు

చిట్టినగర్: దాడి కేసులో తొమ్మిది మంది నిందితులను కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చిట్టినగర్ మహలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం ఎదురు సందులో నివసిస్తున్న జామ సాయిబాబు సమీపంలోనే టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 25న ఇంటికి వెళుతుండగా స్కూటీపై కె.శివ వేగంగా వచ్చి సాయిబాబు బైక్ ఎదుట తిప్పడటంతో సాయిబాబు, అతని వెనుక కూర్చొన్న తమ్ముడు నాగరాజు ఇద్దరు కిందపడ్డారు. ఈ సందర్భంలో ఇరు వర్గాలు గొడపడ్డారు. అనంతరం సాయిబాబుపై కె.శివ అతని బంధువైన రౌడీషీ టర్ బంకా శివ, అతని స్నేహితులు కె.మహేష్, దాసరి రాము, ఎస్.బాలరాజు, వి.శంకర్, ఎస్.రాఘవరావు, ప్రభు, ఝాన్సీలక్ష్మిలు తమపై దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దరాప్తు చేసిన పోలీసులు తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేశారు.

బాలికను అపహరించిన యువకుడి అరెస్టు

చిట్టినగర్: బాలికకు మాయమాటలు చెప్పి అపహరించిన యువకుడిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఫ్రైజర్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక (17)కు అదే ప్రాంతానికి చెందిన జడ్డి అనిల్ మాయమాటలు చెప్పి ఈ నెల 25న తీసుకెళ్లాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడు అనిల్‌ను అరెస్టు చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చిట్టినగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఖాళీ స్థలంలోని ఓ రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం జక్కంపూడి హౌసింగ్ కాలనీలోని 238 బ్లాక్‌లో నివసిస్తున్న వై.రమేష్ పెద్ద కుమారుడు భరత్ (21) ఫర్నిచర్ పని చేస్తుంటాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై సక్రమంగా ఇంటి వచ్చేవాడు కాదు. మానసికంగా బాధపడుతుండేవాడు. పాయకాపురం ఎల్‌బీఎస్ కాలనీ సమీపంలోని కట్ట ఖాళీ స్థలాల్లోని రేకుల షెడ్డులో భరత్ ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మద్యం మత్తులో ఉరేసుకొని మృతి చెందాడా? లేక ఎవరైనా చంపి ఉరివేసి ఉంటారా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన గ్రానైట్ లారీలను తనిఖీ చేస్తున్న అధికారులు

అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న మూడు లారీలు పట్టివేత

మైలవరం: అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్‌ను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న మూడు లారీలను విజిలెన్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ నబీ కథనం ప్రకారం ప్రకాశం జిల్లా నుంచి మూడు లారీల్లో గ్రానైట్‌ను మైలవరం మండలం మొర్సుమిల్లి మీదుగా పుణేకు తరలిస్తున్నారు. అనుమానం వచ్చి లారీలను నిలుపగా అందులో సరకకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేవు. దీంతో ఆ మూడు లారీలను మైలవరం పోలీస్ స్టేషన్‌కు తర లించారు. లారీల యజమానులు ఎవరో తెలియాల్సి ఉంది. ఈ దాడుల్లో మైనింగ్ ఏజీ బాలాజీనాయక్, ఏడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్: యువతి అదృశ్యమైనట్లు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చింతలపూడికి చెందిన ఎం.సుమ ఓ కాపీ షాపులో పనిచేస్తూ పంజా సెంటర్‌లో నివసిస్తోంది. ఇటీవలే తనకు తోడుగా ఉండేందుకు చెల్లెలు ఉమా వచ్చింది. 25వ తేదీన సుమ డ్యూటీకి వెళ్లగా చెల్లెలు ఉమా ఉదయం 11 గంటలకు ఇంటి తాళాలు పక్కింటి వాళ్లకు ఇచ్చి వెళ్లింది. రాత్రయినా చెల్లెలు ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బ్యాంకు ఖాతా నుంచి రూ.72 వేలు తస్కరణ

కానూరు (పెనమలూరు): క్రెడిట్ కార్డు సమాచారాన్ని ఫోన్‌లో సేకరించిన గుర్తు తెలియని వ్యక్తి తన ఖాతా నుంచి రూ.72 వేలు తస్కరించినట్లు బాధి తుడు పోలీసులను ఆశ్రయించాడు. కానూరు తులసీ నగర్‌కు చెందిన పి.వేణుగోపాల్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి ఏటీఎం పిన్ నంబర్ తెలుసుకున్నాడు. అనంతరం ఖాతాలో రూ.72 వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు ఎస్సెమ్మెస్ వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5 వేల కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

ఇబ్రహీంపట్నం: కల్తీ నెయ్యి అక్రమ రవాణాపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. జాతీయ రహదారిపై విజయవాడ వైపు నుంచి జగ్గయ్యపేట వైపు వెళుతున్న వాహనాన్ని రింగ్ సెంటర్ చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేశారు. ఐషర్ వాహనంలో డబ్బాల్లో ఐదు వేల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఫుడ్ కంట్రోల్ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైన్స్ షాపు సిబ్బందిపై కేసు

విద్యాధరపురం: భవానీపురం కాంబ్వే రోడ్డులోని స్వాతి వైన్స్ సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న ఈ షాపును తొలగించాలని గడచిన కొన్ని రోజులుగా మద్యం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆదివారం నిరసన దీక్ష చేస్తున్న మహిళలతో షాపులోని సిబ్బంది వివాదానికి దిగారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ గొడవ చేస్తున్నారని వారితో వాదనకు దిగారు. రెండు వర్గాల మధ్యా వాగ్వాదాలు జరిగాయి. దీనిపై వన్‌టౌన్ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు షాపులోని ముగ్గురు సిబ్బందిపై కేసు నమోదు చేశారు.

ఎంబీఏ విద్యార్థినిని అపహరించిన యువకుడిపై కేసు

పోరంకి (పెనమలూరు): యువతికి మాయమాటలు చెప్పి అపహరించిన యువకుడిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాస నగర్‌కు చెందిన యువతి కానూరులోని కళాశా లలో ఎంబీఏ చదువుతోంది. గంగూరులో చదివే సమయంలో పరిచయమైన రవికుమార్ ప్రేమ వ్యవహారం కొనసాగించాడు. ఈ నెల 24న యువతికి మాయమాటలు చెప్పి అపహరించాడు. దీంతో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలగణేష్ లడ్డు రూ.5,500

జి.కొండూరు: మండల కేంద్రమైన జి.కొండూరులో పీఏసీఎస్ ఎదుట బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి పూజలు అందుకున్న గణనా దుడుని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా స్వామివారి లడ్డును కాసాని వీరాస్వామి రూ.5500లకు పాడారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో కాసాని రాంబాబు, బుడిపూటి పుల్లారావులు ఉన్నారు.

సినిమాలు

(మైలవరం)

సంఘమిత్ర: అర్జున్‌రెడ్డి

నారాయణ : వివేకం



బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ దాసరి కమల

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జి.కొండూరు: మండల పరిధిలోని కట్టుబడిపాలెంలో పారిశుధ్య మెరుగుదల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెల రోజుల నుంచి గ్రామంలోని ప్రధాన డ్రైయినేజీల్లో మురుగును కూలీలతో తొలగించారు. కూలీలు తీయలేని చోట యంత్రాలతో తొలగించారు. డ్రైయినేజీల్లో వచ్చిన పూడిక మట్టిని ట్రాక్టర్లతో బయటకు తరలించారు. దోమల, గడ్డి మందును పిచికారీ చేయించారు. డ్రైయినేజీల వెంట బ్లీచింగ్ చల్లించారు. ఈపనుల్ని సర్పంచ్ దాసరి కమల, కార్యదర్శి విజయ్‌కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న సుందరకుమార్

పేదలకు నిత్యావసరాల పంపిణీ

జి.కొండూరు : మండల పరిధిలోని కందులపాడులో కృపా గుడారం చర్చిలో ఆదివారం కంఫర్ట్ అండ్ మెర్సీ ఇండియా చారిటబుల్ ట్రస్టు వారు 30 మంది పేద వృద్ధురాళ్లకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఈసందర్భంగా ట్రస్టు ఛైర్మన్ పాకలపాటి సుందరకుమార్ మాట్లాడుతూ పేద వితంతు, వృద్ధ మహిళలకు ప్రతి నెలా తమ వంతు సాయంగా ఐదు కేజీల బియ్యం, ఒక నూనె ప్యాకెట్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఇంకా ముందు, ముందు తమ ట్రస్టు తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి విజయభాను తదితరులున్నారు.

పోలవరం కాలువలో మృతదేహం

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): పోలవరం కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బయటపడ్డ సంఘటన ఆదివారం వెలుగుచూసింది. ఈలప్రోలు వంతెన సమీపంలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహంను నీటిపై తెలియాడుతూ కనిపించింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

జక్కంపూడి - పైడూరుపాడు రోడ్డు అభివృద్ధి

జక్కంపూడి (విజయవాడ రూరల్) : రూరల్ మండలం జక్కంపూడి నుంచి పైడూరుపాడు పంచాయతీరాజ్ రోడ్డును రూ.14 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. విజయవాడ - విస్సన్నపేట ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి జక్కంపూడి - పైడూరుపాడు రోడ్డు అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఇందులో రూరల్ ఎంపీపీ వడ్లమూడి జగన్మోహనరావు మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.4.20 లక్షలు (30 శాతం) మంజూరు చేశారు. ఈ రోడ్డు జక్కంపూడిలో రెండు కొండల మధ్య నుంచి వెళుతుంది. జన్మభూమి కార్యక్రమంలో శ్రమదానంతో ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. జక్కంపూడి, షాబాద గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి కావటంతో ఐదున్నర మీటర్ల వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు గంధం సుబ్బారావు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు.

జోరుగా నిల్వ మాంసం విక్రయాలు

● నామమాత్రం చర్యలతో అమ్మకాలు

● ఆదివారం దొరికిన మరో వ్యాపారి

జి.కొండూరు: మండల కేంద్రమైన జి.కొండూరులో గత కొంత కాలంగా కొందరు అక్రమ వ్యాపారులు నిల్వ మాంసం విక్రయాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాలటమాడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈతతంగం ఇటీవలే బయటపడుతుండటంతో మాంసాహార ప్రియులు నోళ్ల వెల్లబెడుతున్నారు. ఇటీవలే వ్యాపారులు పోటీలు పడి కిలో వేటమాంసం ధరను రూ.400లు చేసి నాణ్యత లేని, నిల్వ మాంసాన్ని జనాలకు అంటగడుతున్నారు.ఇక్కడి మాంసానికి మంచి గిరాకీ ఉండటంతో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆదివారం షేక్ సొంబయ్య అనే వ్యాపారి నిల్వ మాంసాన్ని అమ్ముతుండగా వీఆర్వో నాగులు, పంచాయతీ సిబ్బంది పట్టుకున్నారు. నిల్వ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుంచి ఆమాంసాన్ని పంచాయతీ రిక్షాలో వేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి వీఆర్వో నాగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు లేకుండా చేసుకునేందుకు అక్రమ వ్యాపారులు రాజకీయ నాయకులను ఆశ్రయించారు. కొందరు చైతన్య వంతమైన ప్రజలు విషయాన్ని పబ్లిక్ సైట్ల ద్వారా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతంకు, మంత్రి ఉమాదృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈవిషయంపై కలెక్టర్‌తో పాటు మంత్రి సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో స్థానిక నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పోలీసులు కేసు నమోదు చేయక తప్పలేదు.

ముందు దొరికిన వ్యక్తిపై చర్యలు శూన్యం

ఇదిలా ఉంటే పక్షం రోజుల క్రితం జి.కొండూరులో ఊరి చివర ఒక ఇంట్లో ఒక వ్యాపారి నిల్వ మాంసం విక్రయాలు చేస్తూ దొరికిపోయాడు. ఆసమయంలో దాడికి చేసిన అధికారులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆరోజే అతనిపై కఠిన చర్యలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు.



దాడిలో పట్టుబడ్డ నిల్వ మాంసం

చర్యలు తీసుకుంటాం

నిల్వ మాంసం అమ్మే వ్యక్తులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నిల్వ మాంసం అమ్మే వారిపై అపరాధ రుసుంతో పాటు కేసులు పెడతాం. అక్రమాలకు పాల్పడే వారికి నోటీసులు ఇస్తాం. ప్రజారోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదని జి.కొండూరు పంచాయతీ కార్యదర్శి కుసుమ తెలిపారు.

ఘనంగా గణేష్ పూజలు

జి.కొండూరు: మండల పరిధిలోని కట్టుబడిపాలెం - కవులూరు రోడ్డులో ఉన్న ఎన్‌సీఎల్ లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీలో పూజలందుకున్న గణనాథుడ్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో స్వామి వారిని ఉంచి కట్టుబడిపాలెంలో భక్తుల దర్శనార్థం మేళతాళాలతో ఘనంగా గ్రామోత్సవం చేశారు. అనంతరం స్వామి వారిని ఘనంగా నిమజ్జనం చేశారు.

● గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చవితి పందిళ్లలో స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

శ్రీలక్ష్మీ గణపతిస్వామికి శాంతికళ్యాణం

మైలవరం టౌన్: మండల పరిధిలోని పలు గ్రామాలలో గణపతి నవరాత్రులు పురస్కరించుకుని ఆదివారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతిస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి శాంతికళ్యాణం నిర్వహించారు. అనంతరం 2వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొందుగలలోని తూర్పు శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2500 మంది భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పుల్లూరు శ్రీనివాసరావు, మందా అచ్చియ్య, శ్రీరామ్, ముత్తయ్య, రాజేష్, మల్లిఖార్జునరావు, దుర్గారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కమ్మటూరులో అన్నదానం

రెడ్డిగూడెం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం మూడోరోజు పూజలు నిర్వహిస్తున్నారు. మండలంలోని కూనపరాజు పర్వ కమ్మటూరు వద్ద ఏర్పాటు చేసిన గణనాదుడు వద్ద, రాఘవాపురంలోని కోత మిషన్ సమీపంలో ఏర్పాటు చేసిన గణనాదుడు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కూనపరాజుపర్వ అన్నదాన కార్యక్రమంలో ఎంపీపీ తోటకూర నారాయణరావు, ఉపసర్పంచ్ కృష్ణప్రసాద్, మండల తెలుగురైతు అధ్యక్షుడు రాయుడు వెంకటేశ్వరరావుతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



మైలవరంలో పూజలు చేస్తున్న మంత్రి ఉమా



కవులూరులో పూజలందుకుంటున్న గణనాథుడు



కూనపరాజుపర్వలో అన్నదానం



పొందుగలలో అన్నదానం

ముదిరాజుల కాలనీలో రహదారులు అధ్వానం

రెడ్డిగూడెం: మండల కేంద్రమైన రెడ్డిగూడెం శివారు ముదిరాజుల కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారవ్వడంతో చినుకు పడితే చిత్తడిగా మారి రహదారిపై రాకపోకలు కొనసాగించేందుకు కాలనీవాసులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కొద్దిపాటి వర్షానికి కూడా బురదమయంగా మారడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం శూన్యమని కాలనీవాసులు వాపోతున్నారు. ఇకనైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలోని రహదారులను అభివృద్ధిపరచాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



ముదిరాజుల కాలనీలో రహదారి

పాఠశాల ఆవరణలో పుట్ట తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నున్న (విజయవాడ రూరల్): విజయవాడ రూరల్ మండలం నున్నలోని మండల పరిషత్ పశ్చిమ పాఠశాలలో పుట్టను ఎట్టకేలకు తొలగించారు. విద్యా సంస్థల్లో విషసర్పాల సంచారం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు సర్పంచ్ కర్రె విజయ్‌కుమార్ స్పందించారు. స్కూల్, అంగన్‌వాడీ సెంటర్ మధ్యలో ఉన్న పుట్టను జేసీబీ సహాయంతో ఆదివారం తొలగించారు. అనంతరం విజయ్‌కుమార్, టీడీపీ నాయకుడు మాదు రామ్ ప్రసాద్, మెయిన్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మాదు కిరణ్‌కుమార్, జన్మభూమి కమిటీ సభ్యుడు తగరం చంటిబాబు పుట్టను చదును చేశారు.

తగ్గిన మిర్చి సాగు

- గత ఏడాదితో పోల్చితే తగ్గిన విస్తీర్ణం
- గిట్టుబాటు ధర రూ.10 వేలు ఉండాలంటున్న రైతులు



మిరప నారు నాటుతున్న కూలీలు

జి.కొండూరు: మండలంలో పలు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా అక్కడక్కడ మిరప తోటల్లి సాగు చేస్తున్నారు. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు ధరాఘాతంతో కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులు సైతం రాక పోగా నష్టాలు చవిచూసారు. దీంతో ఈఏడాది చాలా మంది రైతులు మిర్చి సాగు మానేసి వరి, పత్తి వైపు దృష్టి సారించారు. అయితే కొంత మంది రైతులు మాత్రం మిర్చి సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని కవులూరులో పెద్ద ఎత్తున మిరప సాగు చేసేవారు. ఒక్క కవులూరు గ్రామంలోనే గత ఏడాది సుమారు 1500 ఎకరాలు సాగు చేశారు. అలాంటిది ఈఏడాది ఆగ్రామంలోను సాగు బాగా తగ్గింది. ఆత్కూరు, చెవుటూరు, కవులూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, వెలగలేరు తదితర గ్రామాల్లో ప్రస్తుతం కొద్ది మంది రైతులు మాత్రమే మిరప సాగు చేస్తున్నారు. మొత్తం మీద ఈఏడాది మండలం మొత్తం కలిపి వెయ్యి ఎకరాల్లో మాత్రమే సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

రెండెకరాలు తగ్గించాను



ఏటా సుమారు 10 ఎకరాలు మిర్చి సాగు చేసేవాడ్ని. ఈఏడాది రెండెకరాలు తగ్గించేశాను. రెండేళ్ల క్రితం ధర బాగానే ఉంది. గత ఏడాది బాగా తగ్గింది.దీంతో నష్టాలు వచ్చాయి.ఈ ఏడాది తక్కువ చేస్తున్నా.

ధనేకుల సుబ్బారావు (కవులూరు రైతు)

క్వింటా రూ.10 వేలు ఉండాలి



క్వింటా మిర్చి మద్దతు ధర కనీసం రూ.10 వేలు ఉండాలి. అప్పుడే నష్టాలు ఉండవు. గత ఏడాది కనీసం కోత ఖర్చులు రాలేదు. సాగు బాగా తగ్గించి రెండు ఎకరాలు మాత్రమే వేస్తున్నాను.

- సత్యనారాయణ (కవులూరు రైతు)

సస్యరక్షణ కిట్లు అందిస్తాం



ఈ ఏడాది నుంచి జి.కొండూరు మండలంలో మిర్చి సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.3,500 విలువ చేసే సమగ్ర సస్యరక్షణ కిట్లను అందిస్తాం. ఇందులో రైతుల వాటాగా రూ.400లు ఉంటుంది.

-ప్రియదర్శిని,హెచ్.వో.

నేటి నుంచి మాంసం విక్రయాలు బంద్

జి.కొండూరు: మండల కేంద్రమైన జి.కొండూరులో విషజ్వరాలు ప్రబలుతున్నందున జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ నుంచి మాంసం,చేపలు విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎన్. కుసుమా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీవారు తిరిగి అమ్మకాలు జరుపుకోవచ్చుని చెప్పే వరకు ఎవరూ దుకాణాలు తెరవకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా షాపులు తెరిచి విక్రయాలు జరిపితే వారిపై పంచాయతీరాజ్ చట్టం అనుసరించి సివిల్, క్రిమినల్ కేసులు తీసుకుంటామని ఆమె తెలిపారు.



విద్యార్థుల ఆటపాటలు

మూలపాడులో ఆనంద ఆదివారం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆనంద ఆదివారం కార్యక్రమంను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కొత్త శ్రీనివాసరావు పర్యవేక్షలో విద్యార్థులు ఆటల పాటలతో అలరించారు. విద్యార్థులకు ఆటలు, పాటలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బర్రె శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పాటలు నిర్వహించుకునే ఆహ్లాదకర వాతావారణంనకు తీసుకురావటం సంతోషం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో భక్తులు

సిద్ధిగణపతి ఆలయంలో శాంతి హోమం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శ్రీ సిద్ధిగణపతి ఆలయంలో ఆదివారం శాంతి హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడిపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం శాంతి హోమం నిర్వహించారు. రాష్ట్రంలోని రైతులు సుభీక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండే విధంగా చూడాలని హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదపండితులు రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి నేతృత్వంలో నిర్వహించిన కుంకమ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ పంపిణీ చేసిన తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామంలో పలువురి పెద్దలను సత్కరించి మెమోంటోలు అందజేశారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

గొల్లపూడి : వినాయక చవితి వేడుకల్లో భాగంగా గొల్లపూడిలో ఆదివారం లైబ్రరీ వీధిలో గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో గణపతి హోమం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ హోమంలో పలువురు దంపతులు పాల్గొని గణనాదునికి పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం వినాయక ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి రోడ్డులో దేవినేని మురళీ యూత్ ఆధ్వర్యంలో నాలుగు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోయపేటలో చవితి వేడుకల్లో భాగంగా మహిళలు ఆటపాటల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్‌నగర్ వార్డు సభ్యులు శ్రీను నాయక్ ఆధ్వర్యంలో అన్నదానం పూజా కార్యక్రమాలు జరిగాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : మంత్రి ఉమా



బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి ఉమా

జి.కొండూరు: విషజ్వరంతో మృతి చెందిన నారగాని సాయిసింధుపావని (10) కుటుంబ సభ్యులను మంత్రి దేవినేని ఉమా ఆదివారం పరామర్శించారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న బాలిక తల్లి, చెల్లిని పరామర్శించి వచ్చినట్లు, రూ. లక్ష ఆర్థిక సాయం అందించినట్లు ఆయన బాలిక కుటుంబసభ్యులకు తెలిపారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అయ్యే వైద్య ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జి.కొండూరులో బాలిక తాత ఇంటి ఆవరణలో ఉన్న గేదెలు, ఇంటి పరిసరాలు చూసిన ఆయన ఇలా ఉంటే దోమలు వస్తాయని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉయ్యూరు వెంకట నరసింహారావు, తాడికొండ వెంకట కృష్ణారావు, పటాపంచల నరసింహారావు, పజ్జూరు రవికుమార్, మరీదు నరసింహారావు, కుక్కల శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఆహ్లాదం పంచుతున్న రహదారి

గొల్లపూడి : గొల్లపూడిలోని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యాలయం రోడ్డు చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. జాతీయ రహదారి నుంచి సాయిపురం కాలనీ మీదుగా వెళ్లిన తరువాత కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా పచ్చని పెద్దచెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. రాష్ట్రం నుంచి అనేక మంది ఈ కార్యాలయానికి నిత్యం వస్తూ వెళుతుంటారు. అధికారుల, ఇతరుల కార్లును డ్రైవర్లు ఈ చెట్ల పక్కన పెట్టుకుని సేద తీరుతుంటారు.



రహదారికి ఇరు వైపులా చెట్లు

ఆగిన పింఛను - అవస్థల్లో కుటుంబం



పింఛను కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

జి.కొండూరు: రెక్కాడితే కాని డొక్కాడని స్థితి. గట్టిగా వర్షం పడితే తడిసిపోయే పూరి గుడిసె నివాసం. నూటికి నూరుశాతం వైకల్యం కలిగిన భార్యతో పాక్షిక అంగవైకల్యం ఉన్న ఒకభాగ్యుడు ఇద్దరు పిల్లలతో దయనీయంగా జీవితాన్ని వెళ్లదీస్తున్న వైనమిది. మండల పరిధిలోని ఆత్కూరు గ్రామానికి చెందిన మేలం కోటేశ్వరరావుకు పాక్షికంగా అంగవైకల్యం ఉంది. అతని భార్య జ్యోజిమేరి మూగ చెవుడుతో బాధపడుతుంది. నూటికి నూరు శాతం ఆమెకు అంగవైకల్యం ఉన్నట్లు సరిఫికెట్ ఉంది. గతంలో ఆమెకు రూ.500ల దివాంగ్యుల పించన్ వచ్చేది. వస్తూ, వస్తూ ఆమెకు పింఛన్ ఆగిపోయింది. దీంతో ఆ కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పాక్షిక వైకల్యంతో కోటేశ్వరరావు సరిగ్గా పని చేసుకోలేక పోతున్నాడు. ఇప్పటికే సుమారు ఐదారుసార్లు జన్మభూమి గ్రామ సభల్లో తన భార్యకు పించన్ మంజూరు చేయాలని అర్జీలు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని కోటేశ్వరరావు వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జ్యోజిమేరికి పింఛన్ మంజూరు చేయాలని ఆకుటుంబం కోరుతుంది.



GST లాభం.. లూటీ!

వాహన డీలర్ల భోజ్యానికి.. వినియోగదారులకు లభించే జీఎస్టీ రిలీఫ్ సొమ్ము కాస్తా స్వాహా అవుతోంది. నగరంలోని కొందరు వాహన డీలర్లు ఈ నయా దందాకు తెరలేపారు! జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులు అందుకోగలుగుతున్నారా లేదా అన్నది పక్కాగా తెలుసుకునే ఎన్ఫోర్స్‌మెంట్ లేకపోవటంతో.. ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది.

- జీఎస్టీ ప్రయోజనం.. వాహన డీలర్ల భోజ్యం
- వినియోగదారులకు ప్రయోజనం నాస్తి
- కొందరు వాహన డీలర్ల నయా దందా
- ఫిర్యాదులతో తలలు పట్టుకుంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జీఎస్టీ ప్రయోజనాలపై చాలామందికి అవగాహన లేక మోసపోతున్నారు. జీఎస్టీపై కొద్దో, గొప్పో అవగాహన ఉన్న వారు వాహనాలు పాత ధరకే విక్రయిస్తున్నారని, వాహనాల ధరలు తగ్గటం లేదని రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులతో రవాణా శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీఎస్టీకి సంబంధించి ఎన్ఫోర్స్ చేసే అధికారం తమది కాదని రవాణా శాఖ భావిస్తోంది. జీఎస్టీని అమలు చేసే బాధ్యత ఆ శాఖకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అసలు జీఎస్టీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమే లేకపోవటం వల్ల సమస్య ఏర్పడుతోంది. వాహనదారుల జేబులు లూటీ అవుతుంటే వాహన డీలర్లు మాత్రం కాసులు పిండుకుంటున్నారు. కొంతమంది వాహన డీలర్ల దందాపై ప్రత్యేక కథనం..

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రయోజనాలను కొందరు వాహన డీలర్లు.. వాహనదారులకు అందకుండా చేస్తున్నారు. ఈ ప్రయోజనాలను కూడా కొందరు వాహన డీలర్లే వ్యక్తిగతంగా లబ్ధి పొందుతుండటంతో వినియోగదారులకు అంతగా ప్రయోజనం కలగటం లేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత.. లబ్ధిదారులకు ఎంత ప్రయోజనం కలుగుతుందన్న దానిపై ఆయా సంస్థలు తప్పనిసరిగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసి సూచించాల్సి ఉంటుంది. నగరంలోని వాహన డీలర్లు ఎక్కడా బోర్డులను ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. వాహనదారులకు కంటితుడుపు ప్రయోజనం కల్పించి చేతులు దులుపుకొంటున్నాయి. ఇప్పటివరకు వాహన డీలర్ ఒక వాహనాన్ని విక్రయించే ముందు దాని ధరతో పాటు వివిధ రకాల పన్నులన్నింటినీ కలిపి చూస్తే.. ఎంత అవుతుందో.. జీఎస్టీ అమల్లోకి వచ్చాక దానిని పరిగణనలోకి తీసుకుని ఆ ప్రయోజనాన్ని వాహన కొనుగోలుదారునికి అందించాల్సి ఉంది. కానీ, ఆచరణలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది.

వాహన డీలర్ల దందా..

రూ.లక్ష విలువ ద్విచక్రవాహనం కొనాలంటే.. ఈడీ 12.50 శాతం చొప్పున రూ.12,500, ఎన్‌సీసీడీ 1 శాతం రూ.1000, సెస్ 0.12 శాతం రూ.125 కలిపితే మొత్తం రూ.1,13,625 అవుతుంది. దీనికి సీఎస్‌టీ 2 శాతం రూ.2,272 కలిపితే మొత్తంగా రూ.1,15,897 అవుతుంది. దీనికి 14.50 శాతం వ్యాట్ రూ.16,805 కలిపితే ఓవరాల్‌గా ఆ వాహనం ధర రూ.1,32,702 అవుతుంది. ఇందులో మతలబు ఉంది. వ్యాట్‌తో కలిపి 32.70 శాతం పన్నులు చూస్తున్నాం.

ఇక జీఎస్టీ విషయానికి వద్దాం. ఆ వాహనంపై 28 శాతం జీఎస్టీ విధింపు వల్ల ఆ వాహనం ఖరీదు రూ.1,28,000 అవుతుంది. అంటే జీఎస్టీ వల్ల వాహనదారుడికి వచ్చే ప్రయోజనం రూ.4,700 అన్నమాట. అయితే ఈ ప్రయోజనం అందుతుందా అంటే లేదనే చెప్పాల్సి వస్తోంది. వాస్తవంగా పైన చెప్పుకున్న మతలబు విషయానికి వద్దాం. పైన వసూలు చేస్తున్న పన్ను లెక్కల్లో కొంత గందరగోళం కూడా ఉంది. లక్ష రూపాయల వాహనానికి ఈడీ 12.50 శాతం, ఎన్‌సీసీడీ 1 శాతం, సెస్ 0.125, సీఎస్‌టీ కలిపితే 15.625 శాతం అవుతుంది. దీనికి 14.50 శాతం కలిపితే 30.125 శాతం అవుతుంది. అంటే 2.31 శాతం మేర ఇన్నాళ్లూ కొందరు వాహన డీలర్లు తమ దగ్గరకు వచ్చిన వాహన కొనుగోలుదార్లకు కన్నం పెట్టారు.

జీఎస్టీ రావటం వల్ల వాహనదారుడికి రూ.4,700 మేర ప్రయోజనం కలుగుతుంటే ఆ మొత్తంలో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. వినియోగదారులకు కనీస అవగాహన లేకపోవటం వల్ల ఒక వాహనానికి రూ.3వేలు పైన వాహన డీలరే లబ్ధిపొందుతున్నాడన్నమాట. కొంతమంది డీలర్లు నిజాయితీగా వ్యాపారం చే సేవారు కూడా ఉన్నారు. కానీ సింహభాగం డీలర్లు ఇదే పని చేస్తుండటం గమనార్హం. దీనిపై బాధ్యత ఎవరిది? వాహన కొనుగోలుదారుల నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? అన్నది అంతుచిక్కటం లేదు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏది?

జీఎస్టీ అమలుచేసే ముందు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. ఒక రకంగా భయటపెట్టినంత పని చేసింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే కేంద్ర ప్రభుత్వం మాట మార్చింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. ఎంత మేర ప్రయోజనం కలుగుతుందో తెలియటానికి నాలుగైదు నెలల సమయం పడుతుందని, వినియోగదారునికి ఖచ్చితంగా జీఎస్టీ వల్ల ఎంత ప్రయోజనం కలుగుతుందో ఆ మేరకు ఆ విషయం తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయమని సూచించింది. ఇప్పటి వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఊసే లేదు. జీఎస్టీ ప్రయోజనం ప్రజలకు అందకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకపోవటం వల్ల వినియోగదారులు మోసపోతే ఎవరికి మొరపెట్టుకోవాలన్నదే ప్రశ్నగా ఉంది.

దుర్గగుడి అభివృద్ధి పనులకు.. వాస్తు బ్రేక్..!

- ఆలయానికి దేవస్థానం మాజీ ఆగమ పండితుడు రాక
- ట్రస్ట్‌బోర్డు సభ్యులకు పలు సూచనలు చేసిన వెంకటేశ్వర సోమయాజులు
- 30న జరగాల్సిన ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

దుర్గగుడిలో వాస్తువిరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులకు ట్రస్ట్‌బోర్డు రెడ్‌సిగ్నల్ చూపడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తు సమ్మతంగా ప్రస్తుత నిర్మాణాలను వేరొక చోట నిర్మించేందుకు అభ్యంతరం లేదని ట్రస్ట్‌బోర్డు స్పష్టం చేసింది. భక్తులకు అవసరమయ్యే పనులు తప్ప, మిగతా వేటిని కూడా అనవసర వ్యయం చేసి నిర్మించరాదని కూడా బోర్డు తేల్చి చెప్పింది. రెండునెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు మొదటి సమావేశంలోనే మోతమోగించారు. ముఖ్యంగా కొన్ని నిర్మాణాలను నిలుపుదల చేయాలని, దేవస్థానంలో అమ్మవారి దర్శనం టికెట్‌ను రూ.300 నుంచి రూ.150కు తగ్గించాలని కోరారు. దీనిపై ఈవో స్పందిస్తూ తీర్మానాల రూపంలో వస్తే ఈ విషయాలన్నిటినీ పరిశీలన చేస్తామని చెప్పారు. ఆ తరువాత కథ మలుపులు తిరిగింది. విషయం మంత్రి ఉమామహేశ్వరరావు ద్వారా సీఎం దృష్టికి వెళ్ళింది. రాజధాని ప్రాంతంలో అతి పెద్ద ఆలయం దుర్గగుడిలో వాస్తు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే పాలకులకూ ఇబ్బంది కలుగుతున్న సంకేతం పంపారు. దీంతో అమరావతి నిర్మాణానికి వాస్తు చూసిన పండితుడు రాఘవయ్యను ఇటీవల దుర్గగుడికి తీసుకువచ్చి అన్ని ప్రదేశాలను చూపించగా ఆయన కొన్ని సూచనలు చేశారు. వాటిపై నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈలోపల కమిటీ సభ్యులు ముఖ్య కార్యదర్శిని కలిసారు. ఆయన సలహా మేరకు నలుగురితో కమిటీని నియమించాలని నిర్ణయించారు. కమిటీని కూడా రేపో మాపో ప్రకటించనున్నారు. ఈలోగా ఈనెల 30న ట్రస్ట్‌బోర్డు సమావేశం జరగనున్నట్టు దేవస్థానం అధికారులు ప్రకటించడంతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంసిద్ధులయ్యారు. తాము ఏవైతే సంస్కరణలు, మార్పులు, చేర్పులు చేపట్టాలనుకున్నారో వాటన్నిటినీ కూడా తీర్మానాల రూపంలో పెట్టి తీన్మార్ మోగించాలనుకున్నారు. అయితే 30వ తేదీ సమావేశాన్ని వాయిదా వేసి, వచ్చే నెల రెండునగాని, మూడునగాని సమావేశం ఉంటుందని అనధికారికంగా ప్రకటించారు. ఈలోపల ఆదివారం దేవస్థానానికి ఆగమ సలహాదారుగా సుదీర్ఘకాలం పనిచేసిన 93 సంవత్సరాల వయోవృద్ధుడు వెంకటేశ్వరసోమయాజులును ట్రస్ట్‌బోర్డు ఆలయానికి వీల్‌చైర్‌లో తీసుకువచ్చారు. ఆయనకు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు పద్మశేఖర్, బడేటి ధర్మారావు, శంకరంబాబు, సూర్యలత తదితరులు యాజులతో సమావేశమయ్యారు. ఆయన ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కొన్ని సూచనలు చేశారు. దీంతో మొత్తంగా ఇప్పుడు ఆలయంలో వాస్తుకు విరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులను నిలిపివేయాలని ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు.

వాటర్ ఫాల్స్ నిర్మాణం, చీరల కౌంటర్ వద్ద పెద్ద ద్వారాన్ని తెరవడం, ఈశాన్య నిర్మాణంలో వంటశాల పనులను నిలిపివేయడం, ఆశీర్వచన కార్యక్రమాన్ని యధావిధిగా ఆలయం పక్కన ప్రాకార మండపంలోకి మార్చడం, సీవీ రెడ్డి ఛారిటీస్‌లో షెడ్లకు బదులు పర్మినెంట్ గదులతో విశ్రాంతి భవనాన్ని నిర్మించడం, గొల్లపూడిలో కూడా గోశాలకు బదులు విశ్రాంతి భవనం, ఉండవల్లి స్థలంలో కూడా విశ్రాంతి భవన నిర్మాణం వంటివి చేపట్టడం వంటివాటిపై తీర్మానాలను ప్రవేశపెట్టడానికి ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచనలతో ఆలయంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దేవస్థానంలో వాస్తు విరుద్ధంగా సాగించే నిర్మాణాలను, అనవసర నిర్మాణాలను చేపట్టకుండా నిరోధిస్తామని, అవసరమనుకుంటే వాటిని వేరొకచోట, భక్తులకు అనుగుణంగా వాస్తు సమ్మతంగా నిర్మించడానికి అంగీకరిస్తామని తెలిపారు. ఇప్పటికైతే అన్ని పనులు నిలిపివేసినట్టు బడేటి ధర్మారావు తెలిపారు.



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆగమపండితుడు వెంకటేశ్వరసోమయాజులతో సమావేశమైన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

దేశాభివృద్ధిలో ఏయూ పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

● ఆంధ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధికి అ'పూర్వ' సహకారం అందిద్దాం
● ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు
● ఏఎన్‌యూలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అమరావతి చాప్టర్ సమావేశం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమైనదని ఆంధ్రా వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఏకం చేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి, వికాసానికి దోహదపడేలా సంఘం కృషి చేస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 92 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. దేశానికి ఇద్దరు ఉప రాష్ట్రపతులను అందించిన ఘనత వర్సిటీకి దక్కిందన్నారు. జీఎంఆర్, మహమ్మద్ జానీ వంటి ప్రముఖులను సమాజానికి అందించిందని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది డిసెంబర్ 10న ఆచార్య సీఆర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాన్నామన్నారు.

కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అమరావతి చాప్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ఖ్యాతి గడించిన ఏయూను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను తయారు చేసిన విద్యాసంస్థను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు అన్నం పెట్టిన తల్లి లాంటి విశ్వవిద్యాలయం వృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభయే ప్రామాణికంగా తీసుకుని ప్రోత్సహిస్తూ, సంఘంలో మంచి గుర్తింపు వచ్చేలా వర్సిటీ సహకారం అందించినట్లు తెలిపారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జువాలజీ డిగ్రీ అర్హత గల వారికి ఫార్మసీలో పీహెచ్‌డీ చేయడానికి ఎక్కడ అనుమతి ఇవ్వలేదని, ఏయూ మాత్రం అవకాశం కల్పించిందన్నారు. పారిశ్రామికవేత్త బొమ్మిడాల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యునిగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర సేవలు అందించాలని సూచించారు. విదేశాల్లో కూడా నూతన చాప్టర్‌లు ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ 16న ఢిల్లీలో నూతనంగా చాప్టర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేపాల్, ఆఫ్రికా దేశాలలో చాప్టర్ ప్రారంభించాలన్నారు. ఆంధ్ర వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పూర్వ విద్యార్థుల స్పందన బాగుందన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ఏయూ పూర్వ విద్యార్థి, ఏఎన్‌యూ విశ్రాంత ఉద్యోగి నూతక్కి వెంకటప్పయ్య, ఏయూ పూర్వ విద్యార్థి సంఘానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. సంఘం జాయింట్ సెక్రటరీ రవిశంకర్ జీఎస్టీపై రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆచార్య జంపాల రాజేష్, డాక్టర్ ఏవీ రవికుమార్, డాక్టర్ ఎల్.పాపారావు, డాక్టర్ ఎం.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జీఎస్టీపై రవిశంకర్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ, ఏఎన్‌యూ వీసీలు తదితరులు, నూతన చాప్టర్‌లో సంతకం చేస్తున్న దృశ్యం

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● నాలుగు పళ్ల విభాగంలో విజేత కృష్ణా జిల్లా
● 6 పళ్ల విభాగంలో గుంటూరు జిల్లా

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఒంగోలు జాతి రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండు, నాలుగు, ఆరు పళ్ల విభాగాల్లో పోటీలు ముగియగా ఆదివారం వ్యవసాయ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. రెండు పళ్ల విభాగంలో విజేతలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు బహుమతులను అందజేశారు. మొదటి మూడు బహుమతులను గుంటూరుకు చెందిన అనిల్‌చౌదరి అందజేయగా, మిగిలిన బహుమతుల పారితోషకాన్ని జి.వెంకటేశ్వరరావు, మన్నవ మల్లేశ్వరరావు, కాకాని సురేష్‌బాబు అందజేశారు.

నాలుగు పళ్ల విభాగంలో..

నాలుగు పళ్ల విభాగంలో కృష్ణా జిల్లా ఘంటసాల మండలం, దాలిపర్రు గ్రామానికి చెందిన బొందలపాటి కోటేశ్వరరావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా యాపిలి మండలం, సింగనూరుపల్లె గ్రామానికి చెందిన సదా ఆంజనేయులు గౌడ్‌కు చెందిన ఎడ్ల జత ద్వితీయ, గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన వట్టికుంట భార్గవచౌదరికి చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. కడప జిల్లా రాజుపాలెం మండలం, వాసుదేవాపురం గ్రామానికి చెందిన మారెళ్ల మోక్షారెడ్డికి చెందిన ఎడ్లు నాలుగో, కృష్ణాజిల్లా గన్నవరం మండలం మెట్లపల్లికి చెందిన చిలకపాటి రాజీవ్ ఎడ్ల జత ఐదోస్థానంలో నిలిచాయి.

ఆరుపళ్ల విభాగంలో..

ఆరుపళ్ల విభాగంలో మంగళగిరి మండలం, నవులూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత ప్రథమ, తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రబాబుకి చెందిన ఎడ్లు ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్, వేమూరి మౌర్యచంద్రలకు చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, గొల్లపూడికి చెందిన చితలపూడి రామారావు ఎడ్లజత నాలుగో, నరసరావుపేట మండలం, పెట్లూరివారిపాలేనికి చెందిన మోజాల వెంకట దుర్గారావు ఎడ్ల జత ఐదో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ డక్కుమళ్ల భాగ్యారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శివరామప్రసాద్, నిర్వాహకులు పమిడి అంజియ్య, కాకాని సురేష్ పాల్గొన్నారు.


పోటీపడుతున్న ఎడ్లజత

పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం


విద్యార్థులకు అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీలు

ఏఎన్‌యూ : రాష్ట్రవ్యాప్తంగా ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో ఆదివారం పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ఆంధ్రా, ఏఎన్‌యూ వర్సిటీల వీసీలు ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పీజీ ఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని కో ఆర్డినేటర్ డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ రవికుమార్ తెలిపారు. సోమవారం జీపాట్, గేట్‌లో అర్హత సాధించిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ వుంటుందన్నారు.


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

కార్మికులకు పీఎఫ్ చెల్లించకపోతే చర్యలు

పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

మంగళగిరి టౌన్: యాజమాన్యం ప్రతి కార్మికునికి పీఎఫ్ చెల్లించాల్సిందేనని, అలా చెల్లించని పక్షంలో సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ పీఎఫ్ కమిషనరు వైడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళగిరి చిల్లపల్లి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నారై ఆసుపత్రి, హాయ్‌ల్యాండ్, వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎన్నారై నర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు ఏటుకూరి గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎఫ్ చెల్లించిన సర్వీసు ఆరేళ్లు దాటితే హౌసింగ్, హెల్త్ లోన్లు తీసుకోవచ్చని చెప్పారు. పది సంవత్సరాలు అలా చెల్లిస్తే 58 సంవత్సరాలు దాటిన తరువాత నెలకు రూ.వెయ్యి పెన్షన్ వస్తుందన్నారు. విధుల్లో వున్నప్పుడు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.ఆరున్నర లక్షల ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈపీఎఫ్ యూనియన్ రాష్ట్ర నేత కె.నాగరాజు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఈపీఎఫ్‌పై అవగాహన కలిగి వుండాలన్నారు. పీఎఫ్ చెల్లించిన తరువాత యూనిక్ నెంబరు వస్తుందని, కాంట్రాక్టరు మారినప్పుడల్లా పీఎఫ్ తీసుకోకూడదని, ఆ పీఎఫ్‌ను వేరే అకౌంటులోకి జమ చేసుకోవచ్చని, పీఎఫ్ తీసుకుంటే సర్వీసు తగ్గిపోతుందని తెలియజేశారు. పీఎంఏవై పథకంలో ప్రతి కార్మికునికి ఇల్లు కట్టించుకోవడానికి రూ.రెండున్నర లక్షల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమ సమస్యలను వివరించారు. పీఎఫ్ చెల్లిస్తున్నప్పటికీ తమకు ఫోనులో సందేశాలు రావడంలేదని, యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. యూనియన్ నేత ఏటుకూరి గంగాధర్‌రావు మాట్లాడుతూ యాజమాన్యాలే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన కల్పించే క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎన్నారై నర్సింగ్ యూనియన్ కార్యదర్శి మాధవి, నాయకులు వరలక్ష్మీ, మల్లేశ్వరీ, విజయకుమారి, శాంతకుమారి, రాణి, ఎంపీటీసీ కే శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ జీ శ్రీనివాసరావు, వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గుంటూరు(పాతగుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ఆధ్వర్యంలో ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ ఉద్యోగాల కోసం రాష్ట్ర స్థాయిలో ప్రీమియర్ అకడమీ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీజీజీబీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, జీఎం ఫణికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ నేటి నుంచి(సోమవారం) స్థానిక బ్రాడీపేట 6వ లైనులోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఆర్‌బీ సిడబ్ల్యుఈ-3కి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ పెట్టాల్సిందే!

- సెప్టెంబర్ 1 నుంచి అమలుకు సన్నద్ధమయ్యాం
- ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ వాడకపోతే చర్యలు
- కళాశాల విద్యార్థుల బాధ్యత తీసుకోవాలి
- ప్రభుత్వ శాఖాధిపతులు, ప్రిన్సిపాల్స్‌కు లేఖలు
- మీరా ప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మానవ నష్టం తీర్చలేనిది. హెల్మెట్ నిండు జీవితాలను నిలబెడుతుంది. సెప్టెంబర్ 1 నుంచి జిల్లా, నగర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందే! ఎవరికీ మినహాయింపులు లేవు. ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ వాడి



ఆదర్శంగా నిలవకపోతే చర్యలు తప్పవు! కళాశాల విద్యార్థులు విధిగా హెల్మెట్‌ను వాడాలి. లైసెన్స్‌లు లేకపోతే జైలుకు పోవడమేనన్న భయాన్ని ఇప్పటికే రవాణా శాఖ కలుగ చేసింది. హెల్మెట్ వినియోగానికి సంబంధించి ఎంతోకాలంగా రవాణా శాఖ అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది. గత రెండుసార్లు అమలు చేయటానికి దగ్గరగా వచ్చి కొంత సమయం ఇవ్వాల్సి వచ్చింది. ఈసారి నూటికి నూరు శాతం అమలు చేయటం జరుగుతోంది అని జిల్లా ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) మీరా ప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలో, రవాణా శాఖ సన్నద్ధతపై 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు.

● రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకే...

ప్రజల ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతోనే హెల్మెట్ అమలుకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ మహత్కార్యానికి పోలీసు శాఖ భాగస్వామ్యం కూడా తోడౌతోంది. కిందటి సారి రెండు పర్యాయాలు హెల్మెట్‌ను అమలు చేయాలని చూశాం. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు వచ్చాయి. ఈసారి పోలీసుశాఖ భాగస్వామ్యం ఉంది. కలెక్టర్ లక్ష్మీకాంతం ద్వారా పోలీసు శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడటం జరిగింది. నేను వ్యక్తిగతంగా సీపీ గౌతమ్ సవాంగ్, జాయింట్ సీపీ, డీసీపీ క్రాంతి రాణాలతో కలిసి అనేకమార్లు ఈ విషయమై చర్చించటం జరిగింది. పోలీసు శాఖ నుంచి మంచి స్పందన ఉంది.

● విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా గణనీయంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోడ్డు సేఫ్టీ మీటింగ్‌లలో తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తున్నాం. యువతను లక్ష్యంగా చేసుకుని కళాశాలల్లో విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

● నిబంధనలు పాటించకపోతే జైలుకే

నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే రవాణా శాఖ ఏం చేస్తుందోనన్న భయాన్ని ఇప్పటికే వాహనదారులలో కలిగించాం. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే జైలుకు పంపిస్తున్న ఘనత రవాణా శాఖదే. జిల్లాలో ఇప్పటి వరకు 270 మంది ఈ విధంగా జైలు శిక్షలు అనుభవించటం జరిగింది. జైలుశిక్షల భయంతో తమ పిల్లలకు వాహనాన్ని ఇచ్చే విషయంలో కూడా తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. ఓవర్‌లోడ్ విషయంలో వాహనదారులు కూడా భయపడుతున్నారు. హెల్మెట్ తప్పనిసరి కార్యక్రమాన్ని కూడా మేం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. ఆచరణలో ఆ దిశగా కృషి చేస్తాం.

● కలెక్టర్ ప్రత్యేక కృషి చేస్తున్నారు

రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి జిల్లా కలెక్టర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. రోడ్డు సేఫ్టీ మీటింగ్‌లను నిర్వహిస్తూ అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి కూడా విధిగా హెల్మెట్ ధరించేలా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ లేఖలు రాశారు. అలాగే విద్యాసంస్థల యాజమాన్యాలకు కూడా కలెక్టర్ లేఖలు రాశారు. ఎవరు హెల్మెట్ ధరించకపోయినా సంబంధిత ఉన్నతాధికారులు, యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని



మరీ హెచ్చరించారు.

● రోడ్డు సేఫ్టీ ఆడిటింగ్ చేపడుతున్నాం

జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించటానికి రోడ్డు సేఫ్టీ ఆడిటింగ్ చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఆరు టీములు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయి. మొత్తం 36 మంది సిబ్బంది రోడ్ల మీదనే ఉండి ప్రమాదాలకు గురౌతున్న పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నారు.

● పెరగనున్న టీమ్‌లు

హెల్మెట్‌ను తప్పనిసరి చేయటానికి కిందటిసారి 10 టీమ్‌లను ఏర్పాటు చేయటం జరిగింది. ఈసారి ఇవి పెరిగే అవకాశం ఉంది. రవాణా, పోలీసు అధికారులతో కూడిన టీమ్‌లు ఈ సారి ఏర్పడతాయి. వేర్వేరుగా పనిచేస్తే అంతగా సత్ఫలితాలు ఇవ్వవు. కలిసి చేయటం వల్ల నూటికి నూరు శాతం అమలు చేయవచ్చు.

ఇది నిజమేనా... వివరాలు సేకరించండి!

- 'క్రీడా దందా'పై కలెక్టర్ స్పందన
- గుర్తింపులేని అసోసియేషన్ల వివరాలు సేకరించాలని ఆదేశాలు
- సేకరణలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు
- స్పందించిన పలువురు క్రీడాకారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గుర్తింపులేని క్రీడా అసోసియేషన్ల నిర్వాకంపై కలెక్టర్ లక్ష్మీకాంతం సీరియస్ అయ్యారు. 'క్రీడా దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఏయే అసోసియేషన్లు ఈ తరహాలో క్రీడాకారుల నుంచి డబ్బుల వసూలకు పాల్పడుతున్నాయో వెంటనే వివరాలు సేకరించాలని, ఆరోపణలు నిజమని తేలితే వెంటనే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేశారు. అయితే పలువురు క్రీడాకారుల వాదనలు అందుకు భిన్నంగా ఉన్నాయి. తాము పాల్గొన్నవి గుర్తింపులేని సంఘాలని తెలియజేయాల్సిన శాప్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు తమకు కనీస సమాచారం కూడా అందించలేదని, తమకు ఎలా అవగాహన ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల మచిలీపట్నంలో నిర్వహించిన పోటీల్లో



పాల్గొన్న తమకు ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేదన్న విషయం అధికారులు తెలియజేయలేదని పలువురు క్రీడాకారులు స్పష్టం చేస్తున్నారు. బందరులో జరిగిన టోర్నీకి మంత్రి కొల్లు రవీంద్ర కూడా హాజరవడంతో గుర్తింపు ఉంటుందని ఊహించామని క్రీడాకారులు వాపోతున్నారు.

● పదిహేను రోజుల క్రితమే తెలిస్తే..

'ఈ వార్తను పదిహేను రోజుల కిందే మీరు రాస్తే బాగుండేది కదా! మేం అనవసరంగా ఇంత దూరం వచ్చే వాళ్లం కాదు కదా!' అంటూ కొందరు క్రీడాకారులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. కనీసం శాప్ అధికారులైనా.. ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేదని చెప్తే మా పరిస్థితి మరోలా ఉండేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

● అధికారులే చర్యలు తీసుకోవాలి

గుర్తింపులేని అసోసియేషన్లలో పాల్గొనే క్రీడాకారులకు అధికారులే కనీస సమాచారం అందించి అప్రమత్తం చేయాల్సి ఉంది. లేకుంటే విషయం తెలియని క్రీడాకారులు సమయాన్ని వృథా చేసుకుంటారు. కష్టపడి సాధించిన సర్టిఫికెట్లు కూడా నిరుపయోగం అవుతాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.



ఉపరాష్ట్రపతి వెంకయ్యకు వీడ్కోలు పలుకుతున్న మంత్రులు, గవర్నర్ నరసింహన్

వెంకయ్యనాయుడుకు ఘన వీడ్కోలు

ఎయిర్‌పోర్టు(గన్నవరం): కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని చెన్నై వెళుతున్న ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘనంగా వీడ్కోలు పలికారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించి రోడ్డు మార్గాన ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, నక్కా ఆనంద్‌బాబు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్ కుమార్, డీజీపీ నండూరి సాంబశివరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, ప్రోటోకాల్ కార్యదర్శి ఎన్. శ్రీకాంత్, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, సీపీ గౌతం సవాంగ్, డీసీపీ క్రాంతి రాణా తదితరులు పాల్గొన్నారు.

నంధ్యాలలో టీడీపీ గెలుపు ఖాయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

విజయవాడ: నంధ్యాల ఉప ఎన్నికలో అధిక మెజార్టీతో టీడీపీ గెలుపు ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని కోరుకుంటున్న నంధ్యాల ప్రజలు టీడీపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆహర్నిసలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను కోరుకుంటున్న నంధ్యాల ప్రజలు టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించబోతున్నారని తెలిపారు. అవినీతి కేసుల్లో ఏ1 నిందితుడిగా ఉన్న జగన్ తన రాజకీయ లబ్ధి కోసం ఎందరో అమాయకులను ఆయన కేసులకు బలి చేశారని ఆరోపించారు. నంధ్యాలలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వైసీపీ నేతలు కుట్ర చేసున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు.

సెప్టెంబర్ 2న కొబ్బరి దినోత్సవం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 2 వతేదీన విజయవాడలోని శుభం కల్యాణ మండపంలో జాతీయ స్థాయి సమ్మేళనం నిర్వహించనున్నట్టు కొచ్చిలోని కోకోనట్‌బోర్డు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ రోజు కేంద్ర వ్యవసాయమంత్రి రాధామోహన్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభిస్తారని, వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది కొబ్బరి రైతులు వారి అనుభవాలను కూడా పంచుకుంటారని తెలిపారు. కొబ్బరితో ఆరోగ్య జీవనం అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేయడం కోసం శాస్త్రవేత్తలు సూచనలు చేస్తారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కొబ్బరిపండించే రాష్ట్రాలలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్‌లో హెక్టారుకు 16,808 కాయలు దిగుబడి అవుతుండగా, ఏపీలో హెక్టార్‌కు 13,579 కాయలు దిగుబడి అవుతున్నాయని చెప్పారు. కొబ్బరి ఉత్పత్తులను మార్కెట్ చేయడం కోసం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ అర్గనైజేషన్లు ఏర్పాటు, ఇంకా ఇతరత్రా రుణ సదుపాయాలు, ప్రోత్సాహకాలు వంటి అనేక అంశాలు సదస్సులో చర్చకు వస్తాయని చెప్పారు.

ఆంధ్రా హాస్పటల్స్‌లో పిల్లలకు గుండె ఉచిత ఆపరేషన్‌లు

విజయవాడ, ఆంధ్రజ్యోతి : హీలింగ్ లిటిల్ హార్ట్, యూకే చారిటీ వారి సౌజన్యంతో ఏడుగురితో కూడిన ఇంగ్లాండ్ పిల్లల గుండె జబ్బుల వైద్య బృందం, ఆంధా హాస్పటల్స్, హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్స్, ఆంధ్ర హాస్పటల్స్‌లో సెప్టెంబర్ 9వ తేదీ వరకు పిల్లల గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ పి.వి.రామారావు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రామారావు

తెలిపారు. డీవీ మానర్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వైద్య బృందంలో పిల్లల గుండె జబ్బుల వైద్య నిపుణులు, డాక్టర్ బ్రాంకో మిమిక్ - కార్డియాలజిస్ట్, డాక్టర్ జూలియా, డాక్టర్ జోహా తదితరులు 25 మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలకు కాంప్లికేషన్స్, గుండెలో రంధ్రాలు, ఊపిరితిత్తులలోని రక్తనాళాలలో వత్తిడి ఎక్కువగా ఉండటం, మూడు లేక నాలుగు రకాల గుండె సమస్యలు ఉన్న క్లిష్టమైన జబ్బులతో ఉన్న పిల్లలకు శస్త్ర చికిత్సలు చేయటం జరుగుతుందన్నారు. 2015 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఆరు సార్లు ఆంధ్ర హాస్పటల్స్‌లో 164 మంది పిల్లలకు సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతి రెండు నెలలకొకసారి చిన్న పిల్లల గుండెలకు శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రా హాస్పటల్స్ రాష్ట్ర ఇండియన్ అకాడమి ఆఫ్ పెడియాట్రిక్స్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వైద్యులు ప్రసంగించారు. సదస్సులో రాష్ట్రంలోని పిల్లల డాక్టర్లు, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్టు, కార్డియాలజిస్టులు పోస్టుగ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు. ఇంగ్లాండ్ వైద్యులు డాక్టర్ విక్రమ్ కుడుములు, డాక్టర్ జోహా, డాక్టర్ జూలియా, డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, డాక్టర్ దుర్గారావు, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమాజం కోసం జీవించండి

- స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు
- ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తేనే అభ్యున్నతి
- ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య

(ఆంధ్రజ్యోతి,విజయవాడ/ గన్నవరం/ఉంగుటూరు) : 'మీ కోసం జీవించవద్దు! సమాజం కోసం జీవించండి!! ప్రభుత్వాలే అన్నీ చేయాలని ఇన్నాళ్ళూ ఒక అపోహ ఉండేది. ప్రభుత్వంతో పాటు ప్రజల నుంచి కూడా సహకారం లభించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి దిశగా అడుగులు వేయగలం. సమాజ సేవ, స్వచ్ఛంద సేవ చేయటం అంటే నాకు ఎంతో ఇష్టం. సమాజసేవ చేయటం ద్వారా వచ్చే ఆనందం నిరుపమానం. ఒక్కసారి దానిని ఆస్వాదిస్తే సమాజ సేవలో ఉన్న మాధుర్యమేమిటో మీకు తెలుస్తుంది' అని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ అమరావతి రాజధాని ప్రాంతంలో రెండవ రోజు ఆదివారం తన పర్యటనలో ఆత్కూరులోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపరాష్ట్రపతిగా పదవి అలంకరించిన తర్వాత మొదటిసారిగా తెలుగునేలకు వచ్చి పౌర సన్మానం స్వీకరించటం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు రాజకీయాలకు దగ్గరగా ఉండేవాడినని, ఉప రాష్ట్రపతి పదవికి ఉన్న పరిమితులు, అధికారాలు, ఆంక్షలు నేపథ్యంలో, తాను అన్నింటికీ దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. తనకు ఎంతో ఇష్టమైన స్వర్ణభారత్ ట్రస్టుకు కూడా రాలేనని, అధికారులతో మాట్లాడి ఇష్టమైన ట్రస్టుకు వచ్చానన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రజలు విరివిగా పాల్గొనాలన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు, సాంఘిక అసమానతలు ఉండటం దురదృష్టకరమన్నారు. సరైన విద్య, వైద్య సేవలు కూడా అందటం లేదన్నారు. ప్రజలు ఆకలికి అలమటిస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తే వేగంగా అభ్యున్నతి సాధ్యమౌతుందని తెలిపారు. పూజలు, ప్రార్థనల వల్ల ఎంత పుణ్యం వస్తుందో, సామాజిక సేవ చేస్తే అంత పుణ్యం వస్తుందన్నారు. న్యాయం జరగని వారికి న్యాయం దక్కేలా చేసినా అంతే ప్రతిఫలం లభిస్తుందన్నారు. సొంత లాభం కొంతమానుకుని సమాజ సేవ చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. గవర్నర్ ఈఎల్ఎస్ నరసింహన్ మాట్లాడుతూ స్వర్ణభారతి ట్రస్టు గ్రామీణ ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి ఎంతగా దోహదపడుతుందో తెలుసుకోగలిగానన్నారు.వెంకయ్యనాయుడు రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కావటం చేత గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేయటానికి ఈ ట్రస్టు ద్వారా మేలు చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ట్రస్టు ద్వారా నైపుణ్య శిక్షణ కల్పించటం వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని అన్నారు. మంత్రి కామినేని శ్రీనివాస్, గన్నవరం శాసన సభ్యులు వల్లభనేని వంశీమోహన్, కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

స్వర్ణభారతి ట్రస్టులో కళాశాల విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. విద్యార్థినులు ఎంతో పరిణితితో అడిగిన ప్రశ్నలకు వెంకయ్యనాయుడు చలాకీగా ఛలోక్తులతో సమాధానాలు ఇచ్చారు.



● మీరెప్పుడూ ఎందుకు తెల్లటి దుస్తులనే ధరిస్తారు? - స్వరూప

వెంకయ్య : తెలుపు చాలా స్వచ్ఛమైనది. కలర్‌ఫుల్ వస్త్రాలు వేసుకోవచ్చుగా అని చాలా మంది అడుగుతుంటారు. మంచి డ్రెస్సులు వేసుకుని కలర్‌ఫుల్‌గా ఉండటం నాకు సంతృప్తిగా ఉండదు. నేను తెలుపు మార్చను. తెలుపు వేసుకోవటం నాకు ఇష్టం.



● పర్సనల్ లైఫ్‌ను, పొలిటికల్ లైఫ్‌ను ఎలా మేనేజ్ చేయగలుగుతున్నారు? - సౌజన్య

వెంకయ్య : ప్రజా జీవితంలో ఉన్నప్పుడు పర్సనల్ లైఫ్‌ను త్యాగం చేయక తప్పదు. సొంత లాభం కొంత మానుకుని సేవ చేయాలి. పదవికి వన్నె తేవాలంటే మానసికంగా సిద్ధం కావాలి. ప్రజా సేవే పరమావధిగా మారాలి.



● మీ విజయసూత్రం ఏమిటి? మీరోల్ మోడల్ ఎవరు? - చరిత

వెంకయ్య : హార్డ్‌వర్క్ చేయటమే. కష్టే ఫలి. కష్టపడి పనిచేయటం, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే విజయం మీ వెంట వస్తుంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాకు రోల్ మోడల్. ఆయన తర్వాత నాకు అడ్వానీ, వాజపేయి అంటే స్ఫూర్తి.



● గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి ఎలా దోహదపడాలి? - రేణుక

వెంకయ్య : పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. గరీబీ హఠావో వంటి నినాదాలు ఇచ్చినంత మాత్రాన వీటిని రూపుమాపలేం. గ్రామీణ ప్రాంతాలలో శిక్షణలు, ఉపాధి కల్పించాలి. అన్నింటికీ మించి ప్రభుత్వ వ్యవస్థను మార్చాలి.

వాలీబాల్ విజేత నూజివీడు

- జూనియర్ విభాగంలో తెలంగాణ
- ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు


ప్రథమ స్థానం సాధించిన నూజివీడు జట్టుతో ప్రిన్సిపాల్ ఆంతోని తదితరులు

గుంటూరు(క్రీడలు) : గుంటూరు నల్లపాడులోని లయోల పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రా, తెలంగాణ ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పాఠశాలల వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. సీనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కృష్ణా జిల్లా నూజివీడులోగ ల ఎస్‌డీపీ హైయ్యర్ సెకండరీ స్కూల్, ద్వితీయ స్థానాన్ని రాజమండ్రికి చెందిన ఫ్యూచర్ కిడ్స్ పబ్లిక్ స్కూల్ కైవసం చేసుకున్నాయి. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని హైదరాబాద్ మలక్‌పేటలో గల సెయింట్ జోసఫ్ స్కూల్, ద్వితీయ స్థానాన్ని హైదరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్స్ కైవసం చేసుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ చీఫ్ రిఫరి డానియల్ మాట్లాడుతూ పోటీలలో గెలుపు ఓటములు సహజమేనని, పాల్గొనడం ముఖ్యమని ఆయన అన్నారు. లయోల పాఠశాల ప్రిన్సిపల్ ఆంటోని మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అందించే మెరిట్ సర్టిఫికెట్లు నీట్ పరీక్షల్లో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బారావు, బాపూజీ, ఆంజనేయులు, కోటేశ్వరరావు, షేక్ ఫాతిమా, రమాదేవిలను అభినందించారు. జూనియర్ ఇండియన్ కప్పు విజేత ఎస్.సాయికిషోర్, అర్జున్ అవార్డు గ్రహీత, సింగారావు, లయోల పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అందోని, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంథ్రూస్, లయోలా తెలుగు మీడియం ప్రధానోపాధ్యాయులు ఫాదర్ సునీల్ పాల్గొన్నారు.


పోటీపడుతున్న క్రీడాకారులు

సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్‌లో పతకాలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సుబ్రహ్మణ్యం

గుంటూరు (క్రీడలు): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈ నెల 21 నుంచి జరిగిన 9వ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో గుంటూరులోని ఇండియన్ అకాడమి ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ క్రీడాకారులు పలు సాధించినట్లు కోచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. టీమ్ ఈవెంట్‌లో ఐదు పతకాలు, వ్యక్తిగత ఈవెంట్‌లో ఒక పతకం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుంటూరు అమరావతి రోడ్డులోని ఇండియన్ అకాడమి ఆఫ్ షూటింగ్‌లో క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ పోటీల్లో గెలుపొందిన వారు సెప్టెంబర్ 14 నుంచి 27 వరకు ముంబైలో జరిగే ప్రీ ఓపెన్ నేషనల్ పోటీల్లో పాల్గొంటారని కోచ్, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ముఖేష్ నెలవల్లి వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. పిప్‌సైడ్ సీనియర్ విభాగంలో అభి, వేద కిరణ్, వెంకట అమరేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో అభి, వెంకట్, అమరేష్, హితేష్ నెలవల్లి టీమ్ ఈవెంట్స్‌లో కాంస్యపతకం సాధించారు. పిప్‌సైడ్ మెన్ విభాగంలో అభి, వెంకట్, హితేష్ కాంస్య పతకాలు సాధించగా ఎయిర్ పిస్టల్ సీనియర్ విభాగంలో ముఖేష్, సిహెచ్ గణేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. తమ క్రీడాకారులు 15 పతకాలు సాధించారని పేర్కొన్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం

- సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయవాడ: సీపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో డేరాబాబా సహకారంతో హరియాణాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరా బాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. ఒకవైపు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరో వైపు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

సెల్‌ఫోన్‌తో... పెడ వైపు



అభివృద్ధి పథమా... అథోగతి మార్గమా

యువతను బానిసలు చేస్తున్న ఫోన్ మేనియా

- సోషల్ నెట్‌వర్క్‌లకు ఎడిక్ట్ అవుతున్న ఈ-తరం
- వీడియో గేమ్స్ ప్రభావంతో చితికిపోతున్న బాల్యం
- అరగంట చేతిలో ఫోన్ లేకుంటే పిచ్చెక్కుతున్న వైనం
- అతి వినియోగంతో దారితప్పుతున్న జీవితాలు
- ప్రయోజనం కంటే దుష్పరిణామాలే అధికం
- పక్కనే ఉన్నా మనసు విప్పి మాట్లాడుకోలేని వారెందరో
- పిల్లల తీరుపై తల్లిదండ్రుల ప్రభావం కూడా

- సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగంతో కోరి కష్టాలు
- మారాం చేస్తున్నారని...స్టేటస్ సింబల్‌గా పిల్లలకీ ఫోన్లు
- నష్టాన్ని మాత్రం గుర్తించని వారే అందరూ
- ఇలాగే కొనసాగితే పెనుముప్పే అంటున్న నిపుణులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

బస్సులో వెళ్తున్నంత సేపు సెల్ ఫోన్ చాటింగ్... రోడ్డుపై నడుస్తున్నా ఫోన్‌తోనే వ్యాపకం...చివరికి తరగతి గదిలోనూ ఇదే పని...వీడియోస్, మేసేజెస్ చూడడం. అవకాశం దొరికితే ఫోన్‌లోని కెమెరాకు పని చెప్పడం...కొందరు ఆకతాయిలు అశ్లీల దృశ్యాల చిత్రీకరణకు తెగబడడం...పోర్న్ సైట్లు వీక్షిస్తున్న ప్రబుద్ధులూ కొందరు...వీడియో గేమ్స్‌తోనే జీవితం అనుకునేది మరికొందరు...ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తెచ్చిపెట్టుకున్న 'సమస్యల కుంపటి' ఇది. నాలుగేళ్ల పసిపిల్లల నుంచి పాతికేళ్ల యువతరాన్ని బానిసలను చేస్తున్న సెల్ ఫోన్ ప్రభావం ఇది. సమాచార సాంకేతిక విప్లవంతో మనిషిని ఉన్నత పథంవైపు వేగంగా అడుగులు వేయించాల్సిన సాంకేతిక పరిజ్ఞానం జీవితాలను దారితప్పిస్తున్న సాధనంగా మారిపోవడం విషాదం. అరచేతిలో ప్రపంచం ఇమిడిపోయే సౌలభ్యం వల్ల ప్రపంచాన్ని చదివి ప్రగతి బాట పట్టాల్సిన యువతరం పెడదోవ పట్టి బంగారు భవిష్యత్తును తమకు తానుగానే నాశనం చేసుకుంటున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ మాయాజాలం, దాని ప్రభావం, పరిణామాలపై నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

ఇవీ లెక్కలు

- దేశంలో ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్న వారి సంఖ్య 24 కోట్లు దాటింది. ఈ విషయంలో అమెరికాను అధిగమించేశాం. వీరిలో ఏడు కోట్ల మంది భారతీయులు నిత్యం ఫేస్ బుక్ చూస్తున్నారు. ఎక్కువ మంది రోజుకు కనీసం మూడుసార్లు ఈ సైట్‌ను వీక్షిస్తున్నట్టు సర్వేల్లో తేలింది.
- ట్విట్టర్‌ను 2.3 కోట్ల మంది, యూట్యూబ్‌ను ఆరు కోట్ల మంది వీక్షిస్తున్నారు.
- కళాశాలకు వెళ్లే యువతే కాదు. పదేళ్ల పిల్లల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అంతా సోషల్ మీడియా మేనియాలో చిక్కుకుంటున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడపడం వల్ల డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం వుందని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది.
- తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ వినియోగించే సమయంలో పిల్లలు దగ్గర వుంచుకోవడం వల్ల స్మార్ట్ ఫోన్ ఆపరేట్ చేసే విధానం, ఫోన్‌లోని విషయాలను, సమాచారాన్ని ఏకాగ్రతతో చూడడం, దానిని గుర్తు పెట్టుకోవడం, ఎక్కువగా ఆకర్షితులు కావడం జరుగుతుంది.
- జర్నల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధ్యయనంలో దాదాపు 170 మంది తల్లి దండ్రులను విడివిడిగా కూర్చోబెట్టి పరిశోధన చేయగా, 48 శాతం మంది మూడు అంతకంటే ఎక్కువ సార్లు సెల్ వల్ల డిస్టబ్ అవుతున్నట్టు, 17 శాతం మంది ఎటువంటి ఇబ్బంది లేదని వెల్లడించారు.

ఇలా చేస్తే మేలు

- పరిమితంగా వాడితే సెల్‌ఫోన్ వినియోగం ఎంతో ఉపయుక్తం
- పిల్లలతో వీడియో గేమ్స్ ఆడించాల్సి వస్తే నిర్దిష్ట సమయం పెట్టాలి
- ఉద్రేకం, కక్షపూరిత, క్రూరత్వాన్ని ప్రేరేపించే ఆటల జోలికి వెళ్లకుండా కట్టడి చేయాలి
- రాత్రి సమయాల్లో ఆటలు ఆడకుండా నిరోధించాలి
- యువత చేసే చాటింగ్‌లపై ఓ కన్నేసి ఉంచడం అవసరం
- ఎప్పటికప్పుడు వారి మిత్రులతో మాట్లాడి పిల్లల ప్రవర్తన గురించి తెలుసుకోవాలి.
- అప్పడప్పుడు పిల్లల సెల్ ఫోన్‌లను పరిశీలిస్తుండాలి
- వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే స్నేహితుడిలా అడిగి తెలుసుకోవడం
- ఒంటరిగా సెల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుంటే ఆరాతీయాలి.
- ప్రత్యేకంగా ఆడపిల్లల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తప్పనిసరి

దారితప్పిన లక్ష్యం

'సాంకేతిక విప్లవం మంచి, చెడు రెండింటికీ దోహదపడుతుంది. దాని ఫలితం వినియోగించే వారిపైనే ఆధారపడి ఉంటుంది'...రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా జపాన్‌పై అణుబాంబు దాడి అనంతరం ఆ బాంబుల రూపశిల్పి అయిన శాస్త్రవేత్త ఇలా ఆవేదన వ్యక్తం చేశారట. సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించే తత్వాన్నిబట్టి దాని ప్రభావం సమాజంపై కనిపిస్తుంది. మంచి, చెడు అన్నవి వినియోగించే వ్యక్తిపైనే ఆధారపడి ఉంటాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్‌చాట్, టెలీగ్రామ్... ఇలా మాధ్యమం ఏదైనా వాటి అంతిమ లక్ష్యం అత్యంత వేగంగా సమాచార మార్పిడి మాత్రమే. దూరంగా ఉన్న వారిని చేరువ చేయాలి. దూరమైపోతున్న వారికి దగ్గరకావాలి. కానీ ఇవే మాధ్యమాలు రాత్రిపూట దగ్గరగా ఉండాల్సిన దంపతుల్ని దూరం చేస్తున్నాయి. ఎవరి ప్రపంచంలో వారు బతికేలా చేస్తున్నాయి. పుస్తకాలతో కుస్తీపట్టాల్సిన విద్యార్థులను పట్టాపగ్గాలేని వారిగా తయారు చేస్తున్నాయి. ముచ్చటించుకునే సమయం హరించుకుపోతోంది. ఒత్తిడి పెంచి అనారోగ్యాన్ని తెచ్చి పెడుతోంది.



ఎందుకు బానిసలవుతున్నారు..



సామాజిక మాధ్యమం ఏదైనా యువత బానిసలవడానికి ప్రధాన కారణం లైక్‌లు, కామెంట్లని వేరుగా చెప్పక్కర్లేదు. మనం చేసే ప్రతిపనిని, ఉండే ప్రతి చోటుని పక్కవారితో క్షణాల్లో షేర్ చేసుకోవడం, వాటికి వచ్చే లైకులు, కామెంట్లు చూసి మురిసిపోవడం ఒక వ్యసనంగా మారింది. విద్యార్థుల్లో ఈ ధోరణి మరీ శృతిమించిపోయింది. చివరకు పడక గదిలో భార్యతో గడిపే శృంగార సన్నివేశాలను సహితం గ్రూపులో పెట్టి ఆనందించే ప్రబుద్ధులు తయారయ్యారు. కొన్ని విషయాల్లో వాదనలకు దిగుతూ వైషమ్యాలు పెంచుకుంటున్నారు. లైక్‌లు వస్తాయని పెట్టిన ఫొటోకు ఆశించిన మేరకు కామెంట్లు రాకపోవడం వల్ల ఆందోళనకు, ఒత్తిడికి, నిరాశకు గురవుతున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుండడం గమనార్హం. సున్నిత మనస్కులైన యువత మరింత కుంగిపోతున్నది. తెలియకుండానే ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఈ లక్షణాలన్నీ పూర్తి స్థాయిలో అనుభవిస్తున్న విద్యార్థిని ఇంటర్‌నెట్‌కు దూరంగా కొన్ని గంటలు, రోజులు, నెలలు వుంచాల్సి వస్తే పిచ్చోళ్లుగా మారిపోతున్నారు. ఈ శతాబ్దపు అద్భుతమైన ఆవిష్కరణల్లో ఒకటైన సోషల్ మీడియా కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా నాలుగేళ్ల చిన్నారుల నుంచి పాతికేళ్ల యువకుడి వరకు శ్వాస...ధ్యాసగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

విలువలు కరిగిపోతున్నాయి

కొత్త టెక్నాలజీ, ఫీచర్ల వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలతో గడిపే సమయం తగ్గుతోందని పలు సర్వేల్లో తేలింది. మనుషుల్లో విలువలు కరిగిపోవడానికి సెల్ ఫోన్ కారణమని చెబుతున్నారు. రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధితులకు సాయం అందించి వారిని కాపాడే ప్రయత్నం కంటే ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని పలు సందర్భాల్లో వెల్లడైంది. విలువలు కరిగిపోతున్నాయనేందుకు ఇంతకంటే ఉదాహరణ ఏముంది. స్కూల్ నుంచి వచ్చిన పిల్లాడి హోమ్ వర్కు కంటే, వాడి ఇబ్బందుల కంటే తమ సెల్‌లోవచ్చే మెసేజ్‌లపైనే ఎక్కువ మంది తల్లిదండ్రులు దృష్టి పెడుతున్నారు. గంటకోసారైనా సెల్ లాక్ ఓపెన్ చేసి ఏం మెసేజ్‌లు వచ్చాయో చూడందే రోజు గడవని విద్యార్థులున్నారు. వైఫేతో జీవితాన్ని అనుసంధానించుకున్న వారికీ లోటులేదు. దంపతులు మాట్లాడుకోవాలంటే చాటింగ్ పూర్తవ్వాలి. గతంలో క్షణం తీరిక లేని భర్త ఇప్పుడు అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాతోనే కాలక్షేపం చేస్తాడు. అదే సమయంలో భార్యతో మనసువిప్పి మాట్లాడే తీరుబాటు మాత్రం ఉండదు.





చేతిలో సెల్ ఫోన్... చెవిలో ఇయర్ ఫోన్స్... మాట్లాడుతూ ప్రయాణం... వీక్షిస్తూ విహారం...ఇంటా, బయటా ఎప్పుడూ చూసినా ఇదే వ్యాపకం. అధునాతక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక సెల్ ఫోన్ ఇప్పుడు సామాన్యుని సాధనమైంది. సమాచార మాధ్యమంగా ఉపయోగపడాల్సిన ఫోన్ నాలుగు అడుగులు ముందుకు వెళ్లి మరెన్నో కొత్తపుంతలు సొంతం చేసుకుంది. స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి చేరింది. అంతాబాగున్నా ఎదురవుతున్న దుష్పరిణామాలపైనే నిపుణుల ఆందోళన. ఛాటింగ్...షూటింగ్...లిజనింగ్...వ్యూయింగ్... ఎప్పుడు చూసినా ఇదే వ్యాపకం...మంచి కోసం కంటే చెడువైపు యువత అడుగులు వేస్తుండడమే భయపెడుతోంది. సాంకేతిక అద్భుతం సాధించామని సంతోషించాలా...జీవితాలు దారి తప్పుతున్నాయని భయపడాలా అన్న డైలమా ఇప్పుడు అన్నివర్గాలను వెంటాడుతోంది. ఈ ప్రయాణం 'ఎటు వైపు సాగుతుంది' అన్నదే అందరినీ భయపెడుతున్న అంశం.




అనర్థాలకు లెక్కే లేదు

సెల్‌ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడే వారిని అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మొబైల్ పదేళ్లు వాడితే యుక్తవయస్కుల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని స్వీడన్ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రేడియేషన్ వల్ల మెదడులో కణాలపై తీవ్ర ప్రభావం పడి కణితులు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫోన్‌కు కవర్ లేకుండా జేబులో పెట్టుకోవడం వల్ల రేడియేషన్ వల్ల గుండెపై ప్రభావం పడుతుందంటున్నారు. పునరుత్పత్తి సమస్యలు, స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న ప్రచారం ఉంది. కానీ ఇవన్నీ ఇంకా పరిశోధన దశలోనే వున్నాయని, శాస్త్రీయంగా పూర్తి స్థాయిలో నిరూపితం కాలేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మణికట్టు నుంచి మెదడుకు వెళ్లే నాళం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌ను మితిమీరి వాడితే రక్తపోటు పెరుగుతుందని, నిద్రలేమి సమస్య వస్తుందని, చెవి పోటు పెరుగుతుందని నిపుణులంటున్నారు. తలనొప్పి, కళ్లు తిరగడం, అసౌకర్యం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతారు. కంటి వైద్య నిపుణులు అపోహని కొట్టి పారేస్తున్నా ఎక్కువ సేపు సెల్ చూడడం వల్ల కంటి చూపు మందగిస్తుందన్న ప్రచారం కూడా ఉంది. సెల్‌ఫోన్ రేడియేషన్ నాన్ అనైజింగ్ (అనైజింగ్, నాన్ అనైజింగ్ రెండు రకాలు) కావున రేడియేషన్ ప్రభావం ఉండదని సెల్ కంపెనీలు చెబుతున్నా దీర్ఘకాలం ఎక్కువ సమయం వాడితే ప్రభావం కచ్చితంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



కొత్త పరిచయాలతో ఇబ్బందులు



ఫేస్ బుక్... ముఖపరిచయం లేని వారిని కలిపే సాధనం. కానీ కాంప్లిమెంట్‌లు... కృతజ్ఞతలు... ఆహ్వానాలు...ఇంకా ఎన్నో. ఒకరంటే ఒకరికి తెలియక పోయినా కొన్నాళ్ల చాటింగ్ తర్వాత మూడో కంటికి తెలియకుండా కలుసుకోవడం, మాయమాటలు నమ్మి సర్వం సమర్పించుకోవడం, ఆ తర్వాత మోసపోయామని తెలిసి లబోదిబో మనడం... ఆ తర్వాత ఫిర్యాదులు, కేసులు షరామామూలే. ఎక్కడ మొదలై ఎక్కడ అంతమవుతుందో తెలియని ఈ పరిచయాల వల్ల విద్యార్థులు చాలా విలువైన కెరీర్‌ను నష్టపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ ఏక్టివిటీలపై దృష్టి పెడుతుంటే మరికొందరు కనీసం పట్టించుకోవడం లేదు. మరికొందరికి అంత పరిజ్ఞానం ఉండడం లేదు. తల్లిదండ్రులు కనిపెడుతున్నారని పిల్లలు పసిగడితే వివరాలు తెలియకుండా వారు ఇంకా జాగ్రత్త పడుతున్నారు. చాటింగ్‌లు, హిస్టరీలు ఎప్పటికప్పుడు డిలీట్ చేస్తూ అప్రమత్తంగా వుంటున్నారు. ఆన్‌లైన్ పరిచయాల వల్ల మోసపోతున్న వారిలో ఆడపిల్లలే అధికంగా వుంటున్నారు.

దూరం తరిగింది...పెరిగింది



సెల్‌ఫోన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి దూరం తగ్గింది. కానీ మనుషుల బాంధవ్యాల మధ్య దూరం మాత్రం పెరిగింది. వీడియో కాలింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చాక అమెరికాలో ఉన్న కొడుకుతో మాట్లాడి దగ్గరనే ఉన్న అనుభూతి పొందుతున్నారు తల్లిదండ్రులు. అత్యవసర పత్రాలు, ఇతర ఫైళ్లు ఒక చోటు నుంచి మరో చోటుకు పంపేందుకు గతంలో నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. అత్యవసరమైతే కొన్ని సందర్భాల్లో దాదాపుగా అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఇంట్లో వున్న సెల్ ఫోన్‌లో ఫొటో తీసి అవసరమైన పత్రాలు క్షణాల్లో కావలసిన చోటుకు పంపుకునే వీలు కలిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. ఒక మంచి ప్రయోజనం కోసం రూపొందిన సెల్ ఫోన్ అంతే చేటును చేస్తోంది. ముఖ్యంగా విద్యార్థి దశపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సెల్ మేనియాలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏకాగ్రతను కోల్పోతున్నారు. తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారు.



మయోఫియా వచ్చే అకాశాలు ఎక్కువ



సెల్‌ఫోన్లను తరచూ దగ్గరగా చూడడం వల్ల మయోఫియా వచ్చే అవకాశాలు ఉంటాయి. పిల్లలు ఒక గంటకు మించి ఫోన్ చూడకూడదు. ప్రస్తుతం ఫోన్ల వాడకం ఎక్కువవ్వడం వల్ల మానసికంగా సమాజానికి దూరమవుతున్నారు. ఫోన్‌ను అవసరాలకు అనుగుణంగా ఉపయోగించేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. మెజారిటీ మాత్రం పని ఉన్నా, లేకపోయినా సెల్‌ఫోన్లను తరచుగా వాడుతున్నారు. ఇంతేకాకుండా ఫోన్లు ఎక్కువగా మాట్లాడడం వల్ల చెవులకు ప్రమాదం వాటిల్లే సూచనలు కూడా ఉన్నాయి. ఎక్కువగా ఫోన్లు మాట్లాడేవారు ఇయర్ ఫోన్లు ఉపయోగించడం మంచిది.

● డాక్టర్ చక్రపాణి, కంటి వైద్య నిపుణుడు

'స్మార్ట్'... మనుషుల్లో తగ్గింది



స్మార్ట్ ఫోన్లు వచ్చాక మనుషుల్లో స్మార్ట్‌నెస్ తగ్గింది. భార్యాభర్తల మధ్య అనుమానాలు పెరుగుతున్నాయి. స్నేహితుల మధ్యా ఇదే పరిస్థితి. విపరీతంగా పెరుగుతున్న ఫోన్ల వాడకం మానవ సంబంధాలను పూర్తిగా మార్చేస్తుంది. ఎంత ఎక్కువ సేపు ఫోన్లతో ఉంటే అంత మానసిక సంతృప్తిని పొందే పరిస్థితులు వచ్చాయి. దీనివల్ల ఇంటలెక్చ్యువల్ పవర్ పూర్తిగా తగ్గిపోతోంది. యువతీయువకులు సోషల్ మీడియాలో ఐడెంటిటీ కోసం పాకులాడుతున్నారు.

డాక్టర్ రాధికారెడ్డి, మానసిక వైద్య నిపణురాలు



మంత్రి సునీతకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఉద్యోగులు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు



దుర్గగుడిలో ఆలయ ఉద్యోగికి బంగారు పుష్పాలు అందజేస్తున్న వెంకట రమణ

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సునీత

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను రాష్ట్ర మంత్రి పరిటాల సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో ఆలయ వేదపండితులు మంత్రికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం బహూకరించారు.

పూర్ణాహుతితో ముగిసిన చవితి వేడుకలు

దుర్గగుడిలోని మల్లిఖార్జున మండపంలో ఆదివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయంలో ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కె.సూర్యలత, ఐ.పెంచలయ్య, సిహెచ్.సాంబసుశీల, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు 108 బంగారు పుష్పాల విరాళం

కనకదుర్గమ్మకు కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన గుండా వెంకటరమణ దంపతులు 108 బంగారు పుష్పాలను ఆదివారం ఆలయ ఉద్యోగులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి శేషవస్త్రం, చిత్రం, లడ్డూ ప్రసాదాలు బహూకరించారు.



మొదటి స్థానం పొందిన సీబీఏ (ఏ) జట్టుకు, రెండవ స్థానంలో నిలిచిన ఆంధ్ర లయోల జట్టుకు, మూడవ స్థానంలో నిలిచిన సీబీఏ (సి) జట్టుకు బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

మౌలిక సదుపాయాల కల్పనపై కార్యాచరణ

ఓఎస్‌డీ పి.రామకృష్ణ

లబ్బీపేట స్పోర్ట్స్ : క్రీడా మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ వివిధ ప్రణాళికలు రూపొందించి కార్యాచరణ దిశగా ముందుకు వెళుతుందని ఓఎస్‌డీ పి.రామకృష్ణ అన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఆదిబాబు, అబ్దుల్ నజీర్ మెమోరియల్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహణ ద్వారా మరింత మంది క్రీడాకారుల ప్రతిభ వెలికితీయవచ్చునని, బాస్కెట్ బాల్ వలే అన్ని క్రీడల్లో క్లబ్‌లను ఏర్పరిస్తే ఎక్కువ మంది ప్రతిభ గల క్రీడాకారులు, ఎక్కువ పోటీలను తిలకించవచ్చన్నారు. అనంతరం ఫైనల్స్‌లో విజేతలైన సీబీఏ (ఏ) జట్టుకు బహుమతులను అందజేశారు. రెండవ స్థానంలో ఆంధ్ర లయోల నిలువగా, మూడవ స్థానంలో సీబీఏ (సి) నిలిచింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

1,2 తేదీల్లో పలు క్రీడాంశాల్లో ఎంపికలు

లబ్బీపేట స్పోర్ట్స్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2, తేదీల్లో వివిధ క్రీడాంశాలలో ఎంపికలు జరుగుతాయని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శకుంతలాదేవి తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన హ్యాండ్ బాల్, త్రోబాల్ ఎంపికలు, చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, 2వ తేదీన లాన్ టెన్నిస్‌లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఈ ఎంపికలు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని, ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ స్టడి సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో హాజరుకావాలని ఆమె తెలిపారు.



రైఫిల్ షూటింగ్‌లో ఎంపికైన క్రీడాకారులతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు

రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు పది మంది

గాంధీనగర్‌లోని గోకరాజు గంగరాజు రైఫిల్ షూటింగ్ రేంజ్‌లో ఆదివారం ఎంపికలు జరిగాయి. అండర్ 14, 17 విభాగాల్లో 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అండర్ 14 బాలుర విభాగంలో ఆర్.అచ్యుత్‌సింగ్ (7వ తరగతి, శారద రామకృష్ణ విద్యాలయం), ఎ.హర్షవర్ధన్ (8వ తరగతి, కృష్ణవేణి), ఆర్.మహేష్ (నవోదయ ఇంగ్లీషు మీడియం), అండర్ 14 బాలికల విభాగంలో జీతు (శారద రామకృష్ణ విద్యాలయం)లు ఎంపికయ్యారు. అండర్ 17 బాలుర విభాగం నుంచి ఎన్.ఉమామహేష్ (9వ తరగతి ఎన్ఎస్ఎం), ఎ.చరణ్‌తేజ (9వ తరగతి, కృష్ణవేణి), కె.పి.శ్రీకర్ (9వ తరగతి, ఎన్ఎస్ఎం), బాలికల విభాగం నుంచి ఎస్.కె.చిన్ని (10వ తరగతి, సెయింట్‌ఆన్స్ నూజివీడు), బి.పూజీతకీర్తి (పదవ తరగతి భాష్యం ఇంగ్లీషు మీడియం), జె.స్రవంతి (పదవ తరగతి, నారాయణ స్కూల్, భవానీపురం)లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అనంతపురం, కడపలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

అండర్ 14 క్రికెట్ టీమ్ బాలుర జట్టు ఎంపిక వాయిదా

లబ్బీపేట స్పోర్ట్స్: జిల్లా అండర్ 14 క్రికెట్ టీమ్ బాలుర జట్టు ఎంపికను వాయిదా వేసినట్లు జిల్లా సంఘ సెక్రటరీ ఎ.మల్లారావు తెలిపారు. ఆదివారం నిర్వహించవలసిన ఎంపికలు వర్షం కారణంగా రద్దు చేశామని, సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన జట్టు ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందని, ఎంపికలు 2వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1-09-2003 తరువాత పుట్టినవారై ఉండాలని, పుట్టిన తేదీ, ఇంటి చిరునామా ధ్రువీకరణ పత్రాలు, వైట్‌డ్రస్, క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని తెలిపారు.

సాగరతీరంలో భక్తుల సందడి

కోడూరు: హంసల దీవి సమీపంలోని సాగర సంగమం సముద్రతీరం వద్ద ఆదివారం యాత్రికులు, భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. డాల్ఫిన్ భవనం వద్ద సేదతీరి తిరుగు ప్రయాణంలో హంసల దీవిలో వేణుగోపాల స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!





'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన

జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▶ ....
2. వియోనిగం ▶ ....
3. భాతంసుప్ర ▶ ....
4. చాపంయతి ▶ ....

చుక్కలు కలపండి



సీఎన్‌జీ పైప్‌లైన్ సంస్థకు నోటీసులు

● గన్నవరం - నూజివీడు ప్రధాన రోడ్డు వెంబడి కాంట్రాక్టుసంస్థ ఇష్టారాజ్యం
● మార్జిన్ వెంబడే గోతులు ... పైపులైన్లు
● భారీ ట్రాఫిక్ కారణంగా కుంగిన రహదారి
● స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై విమర్శలు

గన్నవరం: గన్నవరం- నూజివీడు రోడ్డులో సీఎన్‌జీ పైపులైన్ కాంట్రాక్టు సంస్థ నిర్వాకంపై ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు చేపట్టింది. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టినందుకు పైప్‌లైన్ కాంట్రాక్టు సంస్థకు ఆర్‌అండ్‌బీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ వెంబడి పైపులైన్ల పనులు చేపట్టడం వల్ల ప్రధానమైన ఈ రోడ్డు కాస్తా ఎక్కడ పడితే అక్కడ కుంగింది.

గన్నవరం - నూజివీడు మార్గంలో గొల్లనపల్లి గ్రామంలో ఇష్టానుసారం కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టింది. నిర్ణీత దూరం పాటించకుండా మార్జిన్ వెంబడే భారీ గోతులను తవ్వి అందులో పైపులను వేసింది. రోడ్డు మార్జిన్ వెంబడి గోతులు తవ్వి చాలా కాలం పైపులు వేసి పూడ్చకుండా ఉండటం వల్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు కాస్తా కుంగింది. ఏడాది కిందటే ఈ మార్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో నూతనంగా బీటీ వేశారు. బీటీ కూడా చాలా చోట్ల అప్పుడే కొట్టుకుపోయింది. అడ్డగోలుగా పైపులైన్ల పనుల వల్ల రోడ్డు చాలా చోట్లకు కుంగింది. ఇదే పైపులైన్ పనులను బీబీ గూడెం గ్రామ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. మార్జిన్ వెంబడి వేయటాన్ని నిరసించారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక ప్రజల తిరుగుబాటుతో మూడొంతుల మేర చెరువుల మీదుగా పైపులైన్లను మరల్చారు. పెద్దగా ఈ ప్రాంతంలో నష్టం అయితే జరగలేదు.


పైపులైన్‌తో ధ్వంసమైన గన్నవరం-నూజివీడు రోడ్డు

గన్నవరం - నూజివీడు రోడ్డు అత్యంత ప్రధానమైన రహదారి. విజయవాడ బయట నుంచి ట్రాఫిక్ మరల్చాలంటే ఈ రోడ్డే శరణ్యం. దుర్గగుడి ఉత్సవాల సందర్భంలో కూడా నగరంలోకి ట్రాఫిక్ రాకుండా ఈ రోడ్డు వైపు మళ్లిస్తారు. వీటితో సంబంధం లేకుండానే ఈ రోడ్డు అత్యంత ట్రాఫిక్ రద్దీగా మారిపోయింది. జాతీయ పర్మిట్లన్నీ ఇటు నుంచే నూజివీడు వెళుతుంటాయి. దీనికి తోడు గొల్లనపల్లి, తోటపల్లిలోని క్వారీలు, బ్రహ్మయ్యలింగం చెరువు నుంచి వెయ్యికి పైగా లారీలు ఈ రూట్‌లో తిరుగుతుంటాయి. ఇంత భారీ రద్దీగా ఉండే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ వెంబడే పనులు జరుగుతున్నా.. స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులు ఏ ఒక్కరోజు కూడా పర్యవేక్షణ చేసినా దాఖలా లేదు. స్థానికులు అనేక మంది ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్నది లేదు. రోడ్డు అంతా ధ్వంసమయ్యే వరకు చోద్యం చూశారు. ఈ క్రమంలో అర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఫిర్యాదులు రావటంతో సంబంధిత కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు ఆ సంస్థ నుంచి వచ్చే వివరణ ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మహిళా రిజర్వేషన్ చట్టం చేయాలి

సదస్సులో ఐద్వా ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

గన్నవరం: చట్ట సభల్లో మహిళల సమానత్వ సాధనకు పార్లమెంట్‌లో రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే చేయాలని ఐద్వా ప్రధాన కార్యద ర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ సమావేశ మందిరంలో ఐద్వా డివిజన్ కమిటీ, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సంఘం అధ్యక్షురాలు సిహెచ్‌వి లక్ష్మి అధ్యక్షత వహించారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ముఖ్య అతిథిగా హాజరైన రమాదేవి మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో 33శాతం రిజర్వేషన్ కల్పించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారని, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాజ్యసభలో మెజార్టీ వస్తే చట్టం తెస్తామని రాష్ట్రంలో జరిగిన మహిళా సాధికారత సదస్సులో చెప్పారన్నారు. టీడీపీ సాధికారతకు కట్టుబడి ఉన్నామని చెప్పిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేదని చెప్పారు. హామీలు అమలు చేయటంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. సామాజిక కార్యకర్త ఎం.మాధవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు అవుతున్నా నేటికి మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అణగదొక్క బడుతున్నారని తెలిపారు. పాలకులు మాటలు తప్ప చేతలలో ఏమీ చేయటం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శి మల్లంపల్లి జయమ్మ, పిన్నమనేని విజయ, నాయకులు ఎస్.కమల, పి.మణి, వరలక్ష్మీ, నాగలక్ష్మీ, బుజ్జి, శాంతి, అనిత పాల్గొన్నారు.

గరుడ, ఇంద్ర బస్సు రిజర్వేషన్



విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లు ఆర్టీసీ సర్వీసులు

సర్వీసు	సమయం	బస్సు	28	29	30	31
35105	ఉ.04.30	(మియాపూర్,గ)	00	44	45	47
3565	ఉ.05.30	(మియాపూర్,గ)	01	42	47	47
3567	ఉ.06.30	(మియాపూర్,గ+)	00	47	42	41
3581	ఉ.07.30	(బీహెచ్‌ఈఎల్,గ)	03	45	45	45
3657	ఉ.10.30	(మియాపూర్,గ)	31	42	45	42
3858	ఉ.11.30	(ఆర్‌జీఐఎ-గరుడ)	31	34	36	25
3559	మ.13.00	(ఏఎస్‌రావు,గ)	38	39	39	37
3571	మ.13.30	(బీహెచ్‌ఈఎల్)	32	37	47	47
35117	మ.14.15	(ఆర్‌జీఐఏ,గ)	30	39	38	39
3583	మ.14.30	(మియాపూర్,గ+)	36	47	47	46
3886	మ.15.00	(ఆర్‌జీఐఎపి,గ)	22	22	29	30
3573	మ.15.30	(మియాపూర్,గ+)	35	47	47	46
3585	సా.4.30	(మియాపూర్,గ)	41	47	47	43
35133	సా.5.00	(మియాపూర్,గ)	42	45	45	46
35135	సా.05.30	(మియాపూర్,గ)	38	47	47	47
35085	సా.06.30	(మియాపూర్,గ)	38	47	47	47
35189	రా.9.00	(ఆర్‌జీఐ,గ)	05	23	35	39
35155	రా.10.00	(మియాపూర్,గ)	16	22	22	22
35179	రా.10.00	(ఆర్‌జీఐ, ఏపీ,వె)	04	12	10	17
3938	రా.10.00	(మధురవాడ,గ)	28	39	38	38
9377	రా.11.15	(మియాపూర్,గ)	22	37	35	37
3575	రా.10.15	(మియాపూర్,ఏసీ)	29	47	46	44
3599	రా.10.45	(మియాపూర్,గ)	32	46	46	46
3633	రా.10.30	(మియాపూర్,గ+)	27	43	43	46
3579	రా.10.45	(ఏఎస్‌రావు, గ)	28	39	39	39
3838	రా.11.00	(మియాపూర్,గ+)	44	46	46	46
3569	రా.11.15	(మియాపూర్,గ)	04	39	39	39
3545	రా.11.30	(బీహెచ్‌ఈఎల్)	32	45	47	43
3872	సా.5.00	(బెంగళూర్, గ)	02	26	32	34
3874	సా.6.00	(బెంగళూర్, గ)	00	22	36	35
35115	రా.8.30	(వీజేఏ-సీఎస్‌ఐ,గ)	01	35	37	35
3918	రా.9.30	(వీజేఏ-సీఎస్‌ఐ, గ)	01	34	34	35
3876	రా.8.00	(కుప్పం, గ)	06	29	36	37
47140	రా.10.00	(తిరుపతి,ఏసీ)	29	45	45	46
47138	రా.10.30	(తిరుపతి,ఏసీ)	43	36	46	41
35103	రా.10.30	(విశాఖ, ఇంద్ర)	32	38	38	38
6058	రా.9.45	(కడప ఇంద్ర)	32	32	35	37
6727	రా.6.15	(విజయ-ఏటీపీ)	28	29	35	34

వివరాలకు ఫోన్ : 0866- 2523928లో సంప్రదించవచ్చు

అంబేద్కర్‌లో సెమిస్టర్ విధానానికి శ్రీకారం

విజయవాడ సెంట్రల్: విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకునేలా తమ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరం (2017-18) నుంచి సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తోందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.సి. ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని యూనివర్సిటీ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో అధ్యయన కేంద్రానికి చెందిన అకడమిక్ కౌన్సిలర్లకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) గురించి వివరించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు సీబీసీఎస్ కిందనే సబ్జెక్టుల్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గతానికి భిన్నంగా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే బిఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టుల్ని ఎంచుకోవాలని కోరారు. సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థికి సిలబస్ భారం తగ్గుతుందన్నారు. కౌన్సిలర్లు సేవా భావంతో పనిచేయాలని కోరారు. అన్ని డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉందని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్‌లో ఇబ్బందులు

రవాణా అధికారులతో ఏపీ లారీ ఓనర్స్ ప్రతినిధుల చర్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రవాణా వాహనాలను ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్స్‌తో పాటు మొత్తం 14 రకాల సేవలను అందించే క్రమంలో సాంకేతికంగా ఇబ్బందులు రావటంతో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ స్పందించింది. అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు రవాణా శాఖ అధికారులతో ప్రస్తుత ఇబ్బందులపై చర్చించారు. డీటీసీ సూచన మేరకు ఆర్‌టీఓ పురేంద్రతో సంప్రదింపులు చేశారు. ఆన్‌లైన్ సేవలను పొందాలంటే థంబ్ ఇంప్రెషన్ ఇవ్వాల్సి ఉంటుంది. థంబ్‌ను సాఫ్ట్‌వేర్ తీసుకోకపోవటం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆధార్ డేటా అనుసంధానం కాకపోవటం వల్లనే సమస్య ఏర్పడిందని వీటిని సరిచేయాలని కోరారు. ఒక్కసారిగా ఆన్‌లైన్ కాకుండా అలవాటుపడే వరకు అవగాహన కల్పించేందుకు రెండు కౌంటర్లలో ఈ విధానం ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి రవాణా శాఖ అధికారులు అంగీకరించటంతో కథ సుఖాంతమైంది.


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

లబ్బీపేట స్పోర్ట్స్ : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 210 మంది బాలబాలికలు హాజరయ్యారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికల్లో బాలుర విభాగం నుంచి 21 మంది, బాలికల విభాగం నుంచి 20 మంది ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు కర్నూలు జిల్లా పాణ్యంలో జరిగే రాష్ట్ర స్థాయి, 44వ జూనియర్ కబడ్డీ బాలబాలికల చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సెలక్షన్ కమిటీలో పిఈటి జి.రమేష్ (జడ్‌పిహెచ్ స్కూల్, తాడంకి), సి.ఆర్.రెడ్డి, ఇంజనీరింగ్ కాలేజి పీడీ ఎన్.సుల్తానా, విజ్ఞాన్ యూనివర్సిటి పీడీ ఎం.నవ్య, కె.ఎల్.వి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సత్వర దర్శనమే లక్ష్యం

దుర్గగుడి పాలకమండలి సభ్యుడు పద్మశేఖర్

మోపిదేవి: బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా త్వరితగతిన దర్శనం కలిగించటమే లక్ష్యంగా ధర్మకర్తల మండలి కృషి చేస్తుందని ధర్మకర్తల మండలి సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ అన్నారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అర్చక బృందం శేషవస్త్రాలతో ఆయనను సత్కరించి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఆలయంలో ప్రస్తుతం రూ.120 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా చూడాల్సిందిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

అమ్మవారి దర్శనం టిక్కెట్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం ఉన్న రూ.300ల టికెట్‌ను రూ.150లకు తగ్గించాల్సిందిగా త్వరలో జరిగే బోర్డు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. చల్లపల్లి మండల టీడీపీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మోపిదేవి ఇన్‌చార్జి సర్పంచ్ కె.పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు రావి రత్నగిరి, నాయకులు తొట్టెంపూడి పెదబాబు ఆయన వెంట ఉన్నారు.

ఉచిత న్యాయం ఇలా...



ప్రసాదరావు ప్రత్తిపాటి, న్యాయవాది

న్యాయవాదిని పెట్టుకొనే స్థోమతలేని వారు సిటీ సివిల్ కోర్టుల్లోని మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయసాయం పొంద వచ్చని సీనియర్ న్యాయవాది ప్రసాదరావు ప్రత్తిపాటి తెలియ జేస్తున్నారు. ఉచిత న్యాయ సాయం, లోక్ అదాలత్ విధులు, నిర్వహణ, ప్రీ లిటిగేషన్ కేసుల అంశాలపై ఆయన ఇలా చెబుతున్నారు.

- విజయవాడ లీగల్

న్యాయం దృష్టిలో అందరూ సమానులే. సమాన అవకాశాలు కల్పించడానికి, ముఖ్యంగా ఏ పౌరుడూ ఆర్థిక కారణాలు, లేక మరే ఇతర బలహీనతల వల్లో న్యాయం పొందే అవకాశం కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సహాయం అందించాలని ప్రభుత్వం భావించింది. ఫలితంగా 1976లో రాజ్యాంగానికి 39ఎ అధికరణ జతచేసి బీద, బలహీనవర్గాల వారికి ఉచిత న్యాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించారు. అందుకు చట్టాన్ని కూడా రూపొందించారు. అదే న్యాయ సేవల అధికారిక చట్టం. ఆ చట్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలు, నిర్దేశాలను రూపొందించారు. చట్టం, దాని అనుబంధ సూత్రాల ప్రకారం దిగువ తెలిపిన వారు ఉచిత న్యాయం పొందడానికి అర్హులు.

ప్రీ లిటిగేషన్ కేసులు...

ప్రీలిటిగేషన్ కేసులను పీఎల్‌సీలని పిలుస్తారు. ఏడాదికి రూ.లక్ష లోపు ఆదాయమున్న వారు సమస్యలు కాగితంపైరాసి పీఎల్‌సీ కార్యాలయంలో ఇచ్చి న్యాయ సహాయం పొందవచ్చు. ఈ కార్యాలయం మండల న్యాయసేవాధికార భవనంలో వుంది. మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రతి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పీఎల్‌సీలను నిర్వహిస్తారు.

దరఖాస్తు ఎలా ?

ఉచిత న్యాయం కావాల్సిన వారు కేసు పూర్వాపరాలు, కావాల్సిన పరిష్కారం వివరిస్తూ అఫిడవిట్‌ను, సంబంధిత డాక్యుమెంట్లను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు పైన తెలిపిన అర్హతల్లో ఏవి కలిగి వున్నదీ తెలియజేస్తూ తగిన ఆధారాలు పంపిన నిబంధనల మేరకు చర్య తీసుకొంటారు.

దరఖాస్తు చేయాల్సిన చిరునామా...

జిల్లా కోర్టులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, లేక మండల న్యాయసేవాధికార సంస్థ, హైకోర్టులోని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలోగానీ కేసు వివరాలు తెలుపుతూ దరఖాస్తు చేసుకోవాలి.

ఎవరెవరు పొందవచ్చు

1. షెడ్యూల్ కులం, తెగకు చెందిన వారు
2. మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు
3. స్త్రీలు, పిల్లలు
4. మతిస్థిమితం లేనివారు, దివ్యాంగులు
5. సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులు, వంటి వాటిల్లో చిక్కుకున్న వారు
6. పారిశ్రామిక కార్మికులు
7. ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టం 1956లో సెక్షన్ 2(జి)లో తెలిపిన 'నిర్బంధం', 'సంరక్షణ నిర్బంధం'తో సహా లేక బాల నేరస్థుల న్యాయచట్టం, 1986 సెక్షన్ 2 (జె)లో తెలిపిన నిర్బంధం లేక మెంటల్ హెల్త్ చట్టం, 1987 సెక్షన్ 2 (జి)లో తెలిపిన మానసిక వైద్యశాల లేక మానసిక చికిత్సాలయాల్లో తెలిపిన వారు
8. వార్షిక ఆదాయం రూ.లక్షకు మించని వ్యక్తులు

మీడియేషన్ సెంటర్...

సెక్షన్ 89 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ఏ కోర్టులోనైనా సివిల్ కేసు విచారణ ప్రారంభమయ్యే ముందు మీడియేషన్ సెంటర్‌కు కేసును పంపించాలి. దాన్ని 30 రోజుల్లోగా ఆ సెంటర్ సభ్యులు ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కారం చేసి ఆర్డర్‌ను కోర్టుకు పంపిస్తారు. పరిష్కారం కాకపోతే కేసు ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికే పంపిస్తారు. ఈ సెంటర్ ప్రతి జిల్లాకు ఒకటి వుంటుంది. కృష్ణాజిల్లాకు విజయవాడలో వుంది.



మీ కోసం MEE KOSAM

సహాయ విధానాలు...

1. ఉచితంగా న్యాయ సలహా ఇప్పించడం,
2. కేసు పరిశీలించి అవసరమైతే దరఖాస్తుదారుని తరపున న్యాయవాదులను నియమించి కేసులు చేపట్టడం,
3. సాయం పొందిన వారి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన కోర్టు ఖర్చులు భరించడం,
4. ఆ కేసుల్లో జడ్జిమెంట్ నకళ్లు ఉచితంగా ఇవ్వడం.

విజయవాడ సిటీ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ రోజూ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారని ప్రత్తిపాటి చెబుతున్నారు. అన్ని కోర్టుల్లో రాజీ అయిన కేసులను లోక్ అదాలత్‌కు బదలాయిస్తారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఈ అదాలత్ నిర్వహిస్తుంది. ఈ కోర్టుకు న్యాయమూర్తి, ఇద్దరు లోక్ అదాలత్ సభ్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు. వీటిల్లో పరిష్కారమైన కేసులకు అప్పీలు లేదు.



నున్నలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రలో కళా ప్రదర్శనలు

అగ్రిగోల్డ్ బాధితుల గోడు పట్టదా!

● చైతన్య యాత్రలో నాగేశ్వరరావు డిమాండ్

నున్న (విజయవాడ రూరల్) : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, వారికి న్యాయం చేయాలని బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమం తీవ్రతరం చేయనున్నట్లు పేర్కొన్నారు. బాధితుల చైతన్యయాత్ర ఆదివారం రూరల్‌లోని నున్న మీదుగా నూజివీడుకు వెళ్లింది. ఈ సందర్భంగా కళాకారులు పలు ప్రదర్శనలు చేశారు. చైతన్య యాత్ర ద్వారా బాధితులంతా ఒక్కటై ప్రభుత్వానికి నిరసనలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. యాత్రలో మాజీ ఎమ్మెల్సీ జల్లీవిల్సన్, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవే లక్ష్యం

● బ్రాహ్మణసేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు

గాంధీనగర్ : సమాజసేవే లక్ష్యంగా బ్రాహ్మణ సేవా సంఘం పని చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పవరపు బలరామ్ తెలిపారు. హనుమాన్‌పేటలో మారుతీ ప్రసన్న కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన పేద బ్రాహ్మణ వధూవరుల పరిచయ కార్యక్రమంలో ఆచార వ్యవహారాలు సమాజానికి ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు.

వివాహ పరిచయ వేదికకు దాదాపు 500 మంది వధూవరులు విచ్చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎస్.ప్రభాకరరావు, పి.కాశీవిశ్వనాథం, మురళీకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పెరిగిన రైతు ఆత్మహత్యలు

● వ్యవసాయం విదేశాలకు తాకట్టు ● గిట్టుబాటు ధర, రుణ మాఫీలపై కేంద్రం చట్టం తేవాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రొద్దుటూరు (కంకిపాడు) : టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారం కంటే ఆత్మహత్యలు పెరిగాయని, వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాలకు తాకట్టు పెట్టారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. కంకిపాడు మండలం, ప్రొద్దుటూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సంపూర్ణ స్వాతంత్రం కోసం ఉద్యమించిన ఘనత కమ్యూనిస్టులకు తగ్గుతోందన్నారు. రైతు సమస్యలు, ప్రజా సమస్యలు పరిష్కరించాలని స్వాతంత్రం ముందు నుంచి ఉద్యమిస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టులే అన్నారు. కమ్యూనిస్టులు కొంత బలహీన పడినప్పటికీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ప్రజలకు, రైతులు చేసిందేముందని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని విదేశాలకు అధికార పార్టీ తాకట్టు పెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో పండుతున్న చెరకు, పామాయిల్, పత్తి వంటి వాటిని ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోందన్నారు. చంద్రబాబు విధి విధానాల కారణంగా ఓపక్క రైతు ఆత్మహత్యలు, మరోపక్క పరిశ్రమలు మూత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇష్టానుసారం కాకుండా ప్రతి రాష్ట్రాన్ని ఒకే ప్రాతిపదికన రుణ మాఫీ చేసే విధంగా కూడా చట్టం తీసుకురావాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిరుపూర్, కాఖజ్ నగర్ మిల్లులో పెండింగ్‌లో ఉన్న రూ.9.50 కోట్ల బకాయిలను సుబాబుల్ రైతులకు ప్రభుత్వం తక్షణం ఇప్పించే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. గుడివాడ నుంచి నాగాయలంక వరకు వ్యవసాయ భూములను అధికార పార్టీ నేతలు ఆక్వా చెరువులుగా మార్చేశారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో అటు నంద్యాల, ఇటు కాకినాడలో పెద్ద ఎత్తున డబ్బులు పెట్టి ప్రజలను ప్రలోభాలకు అధికార పార్టీ గురిచేస్తోందని ఆరోపిం చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.నరసింహారావు, వి.కృష్ణ, జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాగంటి హరిబాబు, డివిజన్ కార్యదర్శి కోసూరి శివనాగేంద్రం, మండల కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఈడా కోటేశ్వరరావు, తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంపై పాదయాత్ర 17న

రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 17వ తేదీన 156 రైతు సంఘాలతో కలిసి కంచికచర్ల నుంచి విజయవాడ వరకు భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు మధు తెలిపారు. అనంతరం విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

కావాలనే విద్యుత్ కోత

పి.రంగారావు, మండల కార్యదర్శి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రఘు ఏ ప్రాంతంలో సమావేశానికి హాజరైనా ఆ సమావేశాన్ని కావాలనే అధికార పార్టీ భగ్నం చేస్తోందని విమర్శించారు. కంకిపాడు మండల ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సదస్సులో అధికారులు విద్యుత్ అంతరాయానికి పాల్పడ్డారు. సదస్సు ప్రారంభం అవుతుండగా విద్యుత్ సరఫరా కట్ చేశారు. దీంతో సుమారు అరగంటపాటు చిన్నకారు, ఆటోలకు సంబంధించిన బ్యాటరీలతో సదస్సును నిర్వహించారు. సమావేశం ముగిస్తుందనగా సరఫరా పునరుద్ధరించారు. మండల విద్యుత్ శాఖ అధికారి ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో సీపీఎం నేతలు అసహనానికి గురయ్యారు.



జమ్మిచెట్టు సెంటర్ వద్ద ఆర్గానిక్ కూరగాయల అమ్మకాలు

మన ఆహార గొలుసు అదుపు తప్పి రివర్స్‌లో పరిగెడుతోంది. నాడు పెరటిలోనే కుటుంబానికి సరిపోయే కూరగాయలు పండించుకునే వారు. నేడు కర్రీ పాయింట్స్, మార్కెట్‌లో దొరికే కూరగాయలు తెచ్చుకు తింటున్నాం. ఎరువులు, పురుగు మందుల వాడకంతో పండించడం వల్ల వాటినే తిని ప్రాణం మీదకు తెచ్చు కుంటున్నాం. సీజన్ అంటూ లేకుండా కోరుకున్న కూరగాయలు నేడు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. శాస్త్రజ్ఞులు కష్టపడి హైబ్రిడ్ కూరగాయలు తయారు చేశారు. వాటిలో కూడా మంచి పోషకాలున్నాయని చెబుతున్నా, వాటి సాగులో రసాయన ఎరువుల వాడకం మితిమీరుతోంది. 51శాతం ఆహార పదార్థాల్లో పురుగుమందుల అవశేషాలు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. సహజసిద్ధంగా పండించే ఆహారం తినడం వల్ల పూర్వం చక్కని ఆరోగ్యం ఉండేది. అందుకే తిరిగి ఆర్గానిక్ ఆహారంపై ప్రజలు శ్రద్ధ చూపుతున్నారు. భారత కిసాన్ సంఘ్ సంస్థ అనుబంధంగా 'గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల పరస్పర సహాయ సహకార సొసైటీ' ఏర్పాటు చేసింది.

- విజయవాడ అర్బన్

సేంద్రియంపై ఆసక్తి

● అమరావతి ఆర్గానిక్ బ్రాండ్ ఏర్పాటు

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల పరస్పర సహాయ సహకార సొసైటీ, అమరావతి ఆర్గానిక్స్ పేరిట నగరంలో ఐదు ప్రాంతాల్లో సేంద్రియ ఎరువుల ద్వారా పండిన పంటలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో రైతునుంచి వినియోగదారునికి అందేలా ధర నిర్ణయించి రైతుకు, వినియోగదారునికి న్యాయం జరిగేలా పనిచేస్తోంది. కుంచనపల్లి, వడ్లమూడిల నుంచి ఆకు కూరలు, లంక, నూతక్కి, మేదరమెట్ల నుంచి మునగ, మిర్చి, చిలకలూరిపేట నుంచి పొట్లకాయ, గన్నవరం (నారాయణపురం) నుంచి బొప్పాయి, పులివెందుల నుంచి దానిమ్మ, ఒంగోలు, అనంతపురం, గుడివాడ, మచిలీపట్నం, కాజ ప్రాంతాల నుంచి కొర్రలు, మినప, పెసరపప్పులు, కర్నూలు నుంచి రాగులు, కంది, వేరుశెనగపప్పు, నెల్లూరు నుంచి బెండ, మినప, కనిగిరి, మేదర మెట్ల నుంచి బత్తాయి, నువ్వులు వినియోగదారులకు అందిస్తున్నారు. సొసైటీలో సుమారు 70కిపైగా రైతులు, 500 కిపైగా వినియోగదారులున్నారు. రోజుకు ఆరురకాల కూరగాయలు, 400 కేజీల నుంచి అర క్వింటా వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. వారానికి రెండు టన్నుల చొప్పున నెలకు పది టన్నుల కూరగాయలు వినియోగదారులకు అందిస్తున్నారు. వాటివల్ల సేంద్రియ సేద్యం చేసే రైతులకు నెలకు మూడు లక్షల రూపాయల వరకు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో అయోధ్యనగర్, జమ్మిచెట్టు సెంటర్, బీఆర్టీఎస్ రోడ్డు, పాలీక్లినిక్ ఎదురు రోడ్లలో ఈ దుకా ణాలు ఏర్పాటు చేశారు. ఇవి కాక పటమట ఫన్‌టైమ్స్ క్లబ్, గవర్న మెంట్ ఆస్పత్రి వద్ద మరో రెండు ఏర్పాటు చేయనున్నారు. నగరంలో మరికొన్ని సేంద్రియ ఉత్పత్తులమ్మే సంస్థలున్నాయి. రైతుల నుంచి ఏ కూరగాయలైనా రూ.30కు కొనుగోలు చేసి వినియోగదారులకు రూ.40కు అమ్ముతున్నారు. బయట మార్కెట్‌లో కూరగాయలు కేజీ రూ.5లు ఉన్నా, రూ.100 ఉన్నా సొసైటీ మాత్రం ఎప్పుడూ కేజీ రూ.40కే అమ్మేలా నిర్ణయం తీసుకుంది.

సొసైటీలో లభించే ఉత్పత్తులు

రాగులు, కొర్రలు, అవిసెలు, బియ్యం, సజ్జలు, వరిగలు, సామలు, నువ్వులు, గోధుమలు, పెసలు, కంది పప్పు, మినపప్పు అన్ని రకాల కూరగాయలను సీజన్ వారీగా అందిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు. రైతులందరినీ కలిపి సొసైటీగా ఏర్పాటు చేసి అమరావతి ఆర్గానిక్ బ్రాండ్ పేరిట ఆహార పదార్థాలు సమాజానికి అందించే ఉద్దేశంగా సాగుతోంది.

ప్రభుత్వం నుంచి సొసైటీ కావలసినవి

ప్రభుత్వం నుంచి ఫ్రీ డెలివరీకి వాహనాలు, మొబైల్ వ్యాన్లు, కోల్డ్ స్టోరేజీ, టెస్టింగ్ ల్యాబరేటరీలుంటే సేంద్రియ కూరగాయలు, ఉత్పత్తులను మరికొంత మందికి అందుబాటులోకి తెచ్చేందుకు దోహద పడుతుందని సొసైటీ నిర్వాహకుల భావన.



సేంద్రియ ఎరువులతో పండించిన ఆహారధాన్యాలు

నవధాన్యాలు చల్లి కంపోస్ట్ ఎరువుగా మార్చాలి

శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి
అమరావతి ఆర్గానిక్స్ బ్రాండ్



రసాయనిక ఎరువులతో కలుషితమైన భూమి ఒక్కసారిగా సేంద్రియ ఎరువులతో పండాలంటే కష్టమే. భూమిలో నవ ధాన్యాలు చల్లి, ఆ పంటను భూమి సారం కోసం దున్ని కంపోస్ట్ ఎరువుగా మార్చాలి. కృత్రిమ ఎరువుల వాడకంతో పంటకు సహకరించే సూక్ష్మక్రిములన్నీ భూమిలో నశించి ఉంటాయి.

వాటి పునరుత్పత్తికి చేసే ప్రక్రియే ఇది. రైతులు సహకరిస్తే గో ఆధారిత విధానాలపై శిక్షణా శిబిరాలు నిర్వహిస్తాం. రైతులకు ఉత్పత్తులపై అవగాహన కల్పించి సొసైటీ సభ్యులుగా తీసుకుంటాం.

అందరినీ ఆరోగ్యం వైపు మళ్లించాలన్నదే లక్ష్యం

ముత్తవరపు మురళీకృష్ణ,
అధ్యక్షుడు, గో ఆధారిత
పరస్పర సహాయ సహకార సొసైటీ



ప్రజలందరినీ ఆరోగ్యం వైపు మళ్లించాలన్నదే సొసైటీ లక్ష్యం. సొసైటీలో ఎవరైనా సభ్యులుగా ఉండొచ్చు. నగరంలో అయిదు అపార్ట్‌మెంట్‌ల్లో పూలమొక్కలతో పాటు కూరగాయలు పెంచు కోవాలి.

ఆరోగ్యంపై అలసత్వం చేస్తున్నాం

కుమారస్వామి, భారత్ కిసాన్ సంఘ్
జాతీయ కార్యవర్గ సభ్యుడు



కాలంతో పాటు మానవుని జీవన విధానంలో వేగం పెరిగింది. నేడు డబ్బు సంపాదించే క్రమంలో ఆరోగ్యంపై అలసత్వం చేస్తు న్నాం. దీంతో సంపాదించిన మొత్తం ఆస్పత్రులకు ఖర్చు పెట్టేస్తున్నాం. మొత్తంగా అనారోగ్యం. అప్పులు మాత్రమే. చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చూడకు అనే మహాత్ముని నినాదానికి ఇప్పుడు మరో పదం యాడ్ అయింది. అదే 'చెడు తినకు'. ఈ ప్రమాదం నుంచి ప్రజలను దూరం చేయాలంటే ఆర్గానిక్ ఆహారంపై అవగాహన కలిగించాలి.

అంబేద్కర్ పార్కు కనుమరుగు

● కృష్ణలంక జాతీయ రహదారి విస్తరణతో ... ● రూ.లక్షలాది సొమ్ము మట్టిపాలు ● తుప్పుపట్టిన ఆటపరికరాలు



పిచ్చిమొక్కలతో అధ్వానంగా వున్న అంబేద్కర్ పార్కు



ఉపయోగం లేకుండా పోయిన లక్షల ఖరీదైన భవనం





తుప్పుపట్టిన జారుడు బల్ల, ఉపయోగం లేని మ్యాజిక్ మార్గ్

కృష్ణలంక/రాణిగారితోట : కృష్ణలంక జాతీయ రహదారిని ఆనుకొని వున్న అంబేద్కర్ పార్కు కనుమరుగు అవుతోంది. రాఘవయ్య పార్కు నుంచి రోప్ బ్రిడ్జి మీదుగా వస్తే అంబేద్కర్ పార్కులోకి రావచ్చు. ఒకప్పుడు పర్యాటకులను విశేషంగా అలరించిన పార్కు ఇప్పుడు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో పార్కు రూపురేఖలే మారిపోయాయి. పార్కు గోడను కూల్చి అందులోకి మట్టి, కంకర కుప్పలను అధికారులు పడేశారు. దీంతో రాఘవయ్య పార్కు నుంచి అంబేద్కర్ పార్కులోకి ప్రవేశించే రోప్ బ్రిడ్జి సైతం మూసుకుపోయింది. లక్షల వ్యయంతో రూపొందించిన ఈ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. పార్కులోని మ్యాజిక్ మార్గ్, పిల్లల ఆటపరికరాలు తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు కూడా ఈ పార్కు విషయమై దృష్టి సారించకపోవడంతో పార్కును గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరపాలక సంస్థ, హార్టికల్చర్ అధికారుల నిర్లక్ష్య ఫలితం



జి.నర్సింహారావు, కార్పొరేటర్

పార్కు ఇలా తయారుకావడానికి కారణం నగరపాలక సంస్థ, హార్టికల్చర్ విభాగం అధికారుల నిర్లక్ష్యం. విలువైన పరికరాలు పనికిరాకుండా పోతున్నాయని తాను ఎన్నోసార్లు వారి దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా పార్కులో విలువైన వస్తువులు కాపాడుకొంటే మంచిది.





ఏజీ అండ్ ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల భవనం, ప్రధాన రహదారి ఇరువైపులా పెరిగిన చెట్లు

పచ్చదనం పరిశుభ్రతకు ఆదర్శం

● ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల

ఉయ్యూరు : ఆవరణ చుట్టూ పచ్చని చెట్లు, రహదారి ఇరువైపులా పచ్చదనంతో స్వాగతం పలికే పచ్చిక మైదానం. ఆహ్లాదకరవాతావరణంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల పచ్చదనం, పరిశుభ్రతకు ఆనవాలుగా నిలుస్తోంది. చెరకు రైతుల సహకారంతో ఆవిర్భవించిన అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరకు ఉత్పత్తిదారుల సిద్ధార్థా కళాశాల ఎందరో పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యనందించడమేకాక పచ్చదనానికి ప్రతీకగా అల రారుతోంది. సుమారు 25 ఎకరాల సువిశాల ప్రాంగణంలో పచ్చటి దుప్పటి కప్పుకున్నట్టు గోచరిస్తూ, కళాశాల ప్రవేశ ద్వారం లోకి ప్రవేశించగనే పచ్చనిచెట్లు, వాటిపై నివసించే పక్షుల కిలకిల ధ్వనులతో మరో అరకును తలపిస్తోంది. అన్ని రహదారుల ఇరువైపులా పెరిగిన రకరకాల చెట్లు, పూల తోటలేకాక జీవశాస్త్ర పరిశోధనకు అవసరమైన తోటలు చూడచక్కగా ఉంటాయి. మరోపక్క విశాలమైన పచ్చటి గడ్డితో నిండిన ఆటస్థలం. అందులో ఓపక్క వాకింగ్ ట్రాక్, మైదానం చుట్టూ గజమాలలా పెద్ద పెద్ద చెట్లతో క్రీడాకారులకు స్వాగతం పలుకుతాయి. చక్కని విద్యాబోధనతోపాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ యాజమాన్యం ప్రోత్సాహంతో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. వేసవిలో పచ్చని చెట్లతో చల్లని వాతావరణం ఆకర్షితంగా ఉంటుంది.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్



కళాశాలలో విద్యతోపాటు, పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు అందరం సమష్టిగా కృషి చేస్తున్నాం. ఆవరణలో ఉన్న చెట్లకు తోడు విద్యార్థులు మరిన్ని మొక్కలునాటి సంరక్షణ చేపట్టారు. కళాశాలకు వచ్చిన వారు చక్కని అనుభూతి పొందాలన్నది మా లక్ష్యం.

31 లోగా పాన్‌కార్డ్‌కు ఆధార్ లింక్

ఆదాయ పన్నుశాఖ గడువు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆదాయ పన్ను చెల్లింపు దారులతో పాటు, ఇటీవల కొత్తగా రిటర్న్‌లు దాఖలు చేసినవారు ఈనెల 31 లోగా తమ పాన్ నెంబర్లకు ఆధార్ లింక్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది, సుప్రీం కోర్టు ఇటీవల ఆధార్‌పై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆధార్ లింక్ చేయకుండా వుండటానికి వీలులేదని ఆదాయ పన్నుశాఖ ప్రకటిం చింది. ఆదాయ పన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన వారిలో ఇప్పటివరకు సగం మంది మాత్రమే ఆధార్‌తో లింక్ అయినట్లు గుర్తించింది. అయితే మరొకొంత మంది ఆధార్‌లింక్ అయినప్పటికీ రిటర్న్‌లు దాఖలు చేసి రిజిస్టర్ చేయించుకోలేదని కూడా వెల్లడించింది. అయితే దాఖలు అయిన రిటర్న్‌లలో ఇప్పనటివరకు నాలుగో వంతు రిటర్న్‌లను ఇ- వెరి ఫికేషన్‌ను నిర్వహించినట్లు తెలు స్తోంది. ఉదాహరణకు సుమారు లక్ష మంది రిటర్న్‌లు దాఖలు చేస్తే వారిలో 25 వేల రిటర్న్‌లను మాత్రమే ఇ వెరిఫికేషన్ అయ్యాయి. ఇ వెరిఫికేషన్‌లో ఏదైనా తేడాలు వచ్చినట్లయిుతే వాటిని సరి చేసుకోవాలని లేక పోతే నోటీసు వచ్చే అవకాశం ఉంది.

29బి చెల్లదు..

ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లు దాఖలు చేయడానికి గాను ఫారం 29బి ద్వారా ఒక డిక్లరేషన్ ఇచ్చేవారని, ఇప్పుడు అది చెల్లదని కొత్త ఫార్మెట్‌లో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుం దని, దీనిని త్వరలోనే ప్రకటిస్తామని ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రకటించింది. ఇ ఫైలింగ్ చేసే వారికి త్వరలో కొత్త ఫార్మెట్ అందుబాటులోకి వస్తుందని, అప్పటి దాకా వేచి ఉండాలని సూచించింది.

ఈపోస్ ద్వారానే ఎరువుల పంపిణీ

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

పెనమలూరు : కేంద్రం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న ఈపోస్ ద్వారానే రైతులకు ఎరువులు డీలర్లు పంపిణీ చేయాల ని అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. పోరంకి సాయి కల్యాణ మండపంలో జిల్లా ఆదివారం ఎరువులు, పురుగుల మందుల రిటైల్ డీలర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో వలే ఎరువుల దుకాణం వద్దకొచ్చి రైతు ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని అందించే విధానానికి స్వస్తి పలకాలని, రసీదులు ఇక ఉండదన్నారు. భూమి విస్తీర్ణత, సాయిల్ టెస్ట్ ద్వారా ఆ రైతుకు చెందిన భూమికి ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో ఈపోస్ విధానంలో తెలిసిపోతుందన్నారు. రైతు ఆధార్, వేలిముద్ర వల్ల అతనికి చెందిన వ్యవసాయ పద్ధతి, విధివిధానం మొత్తం తెలిసిపోతుందన్నారు. అదే విధంగా జీఎస్టీ తప్పక అమలు చేయవల్సి ఉంటుందన్నారు. సంఘ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సునీత కుమార్, అగ్రికల్చర్ అధికారి శ్రీనివాసరావు, ఆడిటర్ లక్ష్మణరావు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రికవరీకి చర్యలు!

● సీఎంఆర్ రాకపోవడంతో మిల్లుల నిర్వాహకులకు నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సీఎంఆర్ రాకపోవడంతో మిల్లర్ల నుంచి రికవరీకి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కచ్చితమైన విధానం లేకపోవడం వల్ల పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌కు బియ్యం మిల్లుల నుంచి రావాల్సిన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పెండింగ్‌లో ఉంటోంది. 2014-2015 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఐదు రైసు మిల్లర్ల నుంచి సుమారు రెండు వేల క్వింటాళ్లకు పైగా సీఎంఆర్ రావాల్సి ఉండడంతో ఆ మిల్లులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద క్రిమినల్ నోటీసులు పంపినట్లు జిల్లా సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మేనేజర్ వరకుమార్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. త్వరలో వారి నుంచి సీఎంఆర్‌ను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు ఆయన తెలియజేశారు.. నాగాయలంక మండలంలో ఒకటి, గుడ్లవల్లేరులో ఒకటి, గుడివాడలో రెండు మిల్లులు, హనుమాన్ జంక్షన్‌లో ఒక మిల్లులకు క్రిమినల్ నోటీసులు అందాయి.

రికవరీ సాధ్యమేనా..

మిల్లర్ల నుంచి రావాల్సిన రికవరీపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లర్ల నుంచి సీఎంఆర్‌ను రాబట్టాలంటే సరుకును, సరుకు లేదంటే మిల్లును వేలం వేయాలి మిల్లులు ఇతరత్రా రుణాలు చెల్లించాల్సి వున్నా, తనఖా వంటివి ఉన్నా రికవరీ కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బ్యాంక్ గ్యారంటీతో మెరుగు పడిన పరిస్థితి

సీఎంఆర్‌ను రాబట్టడంలో ఎదురవుతున్న పరిస్థితులు, అలాగే మిల్లర్లకు ధాన్యం తోలిన తరువాత వారి చుట్టూ తిరగడం, ఇంకా ఇతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మిల్లర్లను బ్యాంక్ గ్యారంటీ పరిధిలోకి తీసుకువచ్చారు. గతంలో సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లకు గడువు పెట్టినా, ఆ గడువును పొడిగించుకోవడం, అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండేది, వీటి పరిష్కారానికి రెండేళ్ల నుంచి మిలర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకుంటున్నారు. ఎంత ధాన్యాన్ని తీసుకుంటున్నారో, అంత ధాన్యానికి సంబంధించిన విలువకు బ్యాంక్ గ్యారంటీ చూపించిన తరువాత దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లో సంబందిత మిల్లుకు ధాన్యాన్ని తోలుతారు. అది కూడా గ్యారంటీ ఇచ్చిన మొత్తాని కంటే ఎక్కువ మొత్తం ధాన్యం తోలడానికి వీలులేదు. ఒక వేళ అదనంగా తోలినట్లయితే సంబందిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇప్పుడు రబీలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని మిల్లర్లకు తోలారు. దీనికి గాను ఇంకా పది శాతం మేరకు సుమారు 30,189 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రావాల్సి ఉంది. ఇటీవల సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ సర్వర్‌లో సమస్యలు తలెత్తడంలో వసూలు చేయడానికి వీల్లేని పరిస్థితి ఉందని, త్వరలో వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇప్పుడు బ్యాంక్ గ్యారంటీ ఉంది గనుక మిల్లర్లు సీఎంఆర్‌ను ఎగ్గొట్టడానికి వీలులేదని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు మిల్లర్లకు సీఎంఆర్ ఇవ్వటానికి గడువు ఉందని , ఆ తరువాత చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

సీఎంఆర్ అంటే

మిల్లులకు ఇచ్చిన ధాన్యంలో క్వింటాకు 68 కిలోల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌కు అప్పగించాలి. మిల్లుల నుంచి తీసుకునే బియ్యాన్ని కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. దీనికి గాను మిల్లర్లకు కూడా ప్రతిఫలం ఉంటుంది. ఇతర త్రా నిబంధనలు కూడా అమలు చేస్తూ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌కు మిల్లర్లు బియ్యం అప్ప గించాలి. ఇప్పుడు దాదాపు 2000 క్వింటాళ్ల బియ్యం (సీఎంర్) రావాల్సి ఉంది.

రైతులకు మేలు కలగాలి

బలరాం జయంతి సభలో జలగం కుమార స్వామి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి

పటమట : వ్యవసాయ అనుబంధ పంటలు విస్తరించి రైతులకు మేలు కలగాలని రాష్ట్ర కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జలగం కుమార స్వామి అన్నారు. బలరాం (నాగలి) జయంతి సందర్భంగా బారతీయ కిసాన్ సంఘ్, గో ఆధారిత వ్యవసాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బలరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్గానిక్ మందులు వాడకం నివారించి పాత పద్ధతులను అవలంబించి వ్యవసాయ ఉత్పత్తులను పండించాలన్నారు. వ్యవసాయ ఉత్తత్తులకు పేరొందిన ఏపీలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను పండించే రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి శ్రీకృష్ణ, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆశా కిరణ్, నారాయణ ప్రసాద్, ఫన్‌టైమ్స్ కార్యదర్శి వేమూరి సాంబశివరావు, ఉమామహేశ్వరరాజు, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు, భాషకు అవినాభావ సంబంధం : పాల్



మాట్లాడుతున్న సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాల్

పటమట : మనసుకు భాషకు అవినాభావ సంబంధం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యు.పాల్ అన్నారు. త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సైకాలజిస్టులు, ఉపాధ్యాయులకు నాచురల్ ప్రొనౌన్‌షేషన్ లాంగ్వేజ్ (ఎన్ఎల్‌పీ, సహజ భాష)పై ఒకరోజు శిక్షణ జరిగింది. పాల్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, మహిళలు, యువత ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఎన్ఎల్పీ అద్భుతమైన ప్రక్రియయన్నారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వి. రమేష్, ప్రత్యూష సుబ్బారావు ఎం.ఎం. ముఖర్జీ, ఎమ్. రాణి, సోమయాజులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం



పెసర నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి దేవినేని ఉమా

మైలవరం టౌన్: రైతు ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరం మార్కెట్ యార్డులో 400 క్వింటాళ్ళ పెసర నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం వ్యాపారులతో సమావేశం నిర్వహించి దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. .మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు క్వింటా పెసలుకు రూ.5200లు చెల్లించాల్సిందేనన్నారు. ఇందుకోసం ఈనెల 29న సబ్ కలెక్టర్ కార్యాలయంలో జేడీ అగ్రికల్చర్, జేడీ మార్కెటింగ్, డీఎం మార్క్‌ఫెడ్‌లతో సమావేశం నిర్వహిస్తామని తెలియజేశారు. మార్కెట్ యార్డుల్లో కూడా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిందేనని తెలిపారు. మిల్లర్లు, కమిషనర్‌ల బాగోతాలు బయటపెట్టేందుకు విజిలెన్స్ దాడులకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరకు రిటైల్ ధరకు సుమారు రూ.2వేలు తేడా రావడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. తప్పకుండా మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయాల్సిందేనని చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ ధనేకుల సాంబశివరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వెంకటేశ్వరరావు, తాతా పోతురాజు, రాయల లీలాప్రసాద్, మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకృష్ణ, పరికెల నాగేశ్వరరావు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు 30న

పటమట : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న ఉద్యోగాల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి. రమేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిజేశారు. ఏజీఎస్ లో కస్టమర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 28 (సోమవారం) నుంచి 30వ తేదీలోపు తమ పేర్లను నేషనల్ కెరీర్ సర్వీస్ పోస్టల్ www.ncs.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నుంచి తమ మొబైల్‌కు వచ్చిన ఎన్‌సీఎస్ ఐడీ ద్వారా 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

నేత్రదానానికి యువత ముందడుగు



నేత్ర దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ సమరం

బెంజ్‌సర్కిల్: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పటమట తొమ్మిదో డివిజన్‌కు చెందిన యువజన చైతన్య వేదిక నాయకులు మరణాంతరం తమ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. వీరు యువజన వేదిక అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో 10 మందికి పైగా ఆదివారం బెంజ్‌సర్కిల్‌లోని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంకుకు వెళ్ళి నేత్రాలు ఇవ్వడానికి అంగీకరిస్తూ పత్రాలను అందజేశారు. నజీర్ మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరొకరికి జీవితం ఇచ్చినట్టేనన్నారు. అనంతరం వీరికి డాక్టర్ సమరం నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువజన చైతన్య వేదిక నాయకులు మీసాల నాగభూషణం, మీసాల జనార్దన్, యు. సత్యనారాయణ, బంగారు రాజీవ్ గాంధీ, జి. మాణిక్యాలరావు, మల్లికార్జున్, పోలి రాజ తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సినిమా గైడ్

అలంకార్	వివేకం
అన్నపూర్ణ	నేనేరాజు నేనేమంత్రి
అప్సర	జయ జానకి నాయక
శ్రీదుర్గాకళామందిర్	సోగ్గాడు
జయరామ్	విఐపి-2
కళ్యాణచక్రవర్తి	సోగ్గాడే చిన్నినాయనా
కపర్థి	ఫిదా
నవరంగ్	ఆనబెల్/జెంటిల్‌మన్
నీలిమ	అర్జున్‌రెడ్డి
రాజ్	అర్జున్‌రెడ్డి/విఐపి-2
రామ్‌గోపాల్	అర్జున్‌రెడ్డి
రాజకుమారి	ఆనందోబ్రహ్మ
రాఘవేంద్ర	వివేకం
స్వర్ణప్యాలెస్	లై
శకుంతల	అర్జున్‌రెడ్డి
శైలజ	అర్జున్‌రెడ్డి
శ్రీనివాసమహల్	వివేకం
స్వాతి	వివేకం
సౌమ్య	అర్జున్‌రెడ్డి
వెంకటేశ్వరప్యాలెస్	ఆనందోబ్రహ్మ
వెంకటస్వర్ణ ప్యాలెస్	విఐపి-2
యువరాజ్	వివేకం/ఆనందోబ్రహ్మ/నేనేరాజు నేనేమంత్రి

పాయకాపురం

రవీంద్ర సినిమాస్	వివేకం/ విఐపి-2/అర్జున్‌రెడ్డి
స్వర్ణలక్ష్మి	అర్జున్‌రెడ్డి
శ్రీవెంకటేశ్వరడీలక్స్	జయ జానకి నాయక

పటమట

దుర్గామహల్	అర్జున్‌రెడ్డి
రామకృష్ణ	ఆనందోబ్రహ్మ
వినాయక్	వివేకం
విజయలక్ష్మి (కానూరు)	వివేకం

పోరంకి

బాలాజీ సినీవిల్లా	వివేకం/ఆనందోబ్రహ్మ
వెంకటకృష్ణ	అర్జున్‌రెడ్డి
శ్రీనివాస	విఐపి-2/జయ జానకి నాయక

కంకిపాడు

శ్రీవిజయలక్ష్మి	వివేకం
శ్రీచంద్ర	నేనేరాజు నేనేమంత్రి
శ్రీరామచంద్ర	అర్జున్‌రెడ్డి

గన్నవరం

శాంతి	జయ జానకి నాయక
శ్రీవెంకటేశ్వర	వివేకం

ఇబ్రహీంపట్నం

బాలాజీ	జయ జానకి నాయక
శ్రీవెంకటేశ్వరడీలక్స్	అర్జున్‌రెడ్డి
శివకృష్ణ(కొండపల్లి)	వివేకం/ఆనందోబ్రహ్మ

ఊర్వశి ఐనాక్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి
మీరజ్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం
వైస్క్రీన్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ
పీవీఆర్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి, ఆన్‌బెల్, జంటిల్‌మాన్
క్యాపిటల్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి, జంటిల్‌మాన్, ఖైదీబాండ్, జయ జానకి నాయక, ఆన్‌బెల్, ఫిదా, ది డార్క్‌టవర్
ఎల్‌ఈపీఎల్‌ఐనాక్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, ఆన్‌బెల్, నేనేరాజు నేనేమంత్రి, జంటిల్‌మాన్

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూపాయల్లో)

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176
చికెన్ స్కిన్‌లెస్	186

వెన్‌కాబ్ (రూపాయల్లో)

ఫారం ధర	84
రిటైల్ ధర	99
చికెన్ విత్ స్కిన్	139
చికెన్ స్కిన్‌లెస్	163

నెక్ కోడిగుడ్ల ధర

విజయవాడ జోన్ రైతు ధర
రూ. 3.59

బులియన్

బిస్కెట్ (100 గ్రా)	రూ.3,00,000
బిస్కెట్ బంగారం22 క్యారెట్లు(10గ్రా)	రూ.27,750
వెండి (కిలో)	రూ.40,200
వెండి (10 గ్రా)	రూ.402



వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో చీరలు వేలం వేస్తున్న దృశ్యం

చీరల వేలం ఆదాయం రూ.35,450

గుణదల: రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం చీరల వేలం కార్యక్రమం జరిగింది. 250 చీరలను వేలం వేయగా భక్తులు వేలంపాటలో పాడుకున్నారు. చీరలు వేలంలో రూ 35,450వేల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమం దేవాదాయశాఖ అధికారులు, వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ఇన్‌చార్జ్ ఈవో నేతక్కి సాంబశివరావు పర్యవేక్షణలో జరిగింది.

సోమవారం ఉదయం ఆలయంలోని హుండీలను లెక్కించనున్నట్లు ఈవో సాంబశివరావు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తిగల భక్తులు పాల్గొనేందుకు అవకాశం ఉందని చెప్పారు.

సిటీ డైరీ

నిరాహారదీక్ష
విషయం: మసీదులు, ఈద్గాలు తొలగించడాన్ని నిరసిస్తూ మజ్లీసీ-ఇ-ఇత్తిహదుల్ ముస్లిమిన్ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష
సమయం: ఉదయం 9 గంటలకు
వేదిక: ధర్నా చౌక్

ప్రారంభం
విషయం: పీసీబీ డిజైనింగ్‌పై రెండురోజుల సెమినార్ ప్రారంభం
సమయం:ఉదయం 9.30 గంటలకు
వేదిక: ఆంధ్ర లయోలా కాలేజి(ఇంజనీరింగ్)

పోటీలు
విషయం: 5వ సెపక్‌తక్రా పోటీలు
సమయం: ఉదయం 10 గంటలకు
వేదిక: దండమూడి రాజగోపాల్‌రావు ఇండోర్ మున్సిపల్ స్టేడియం

సమావేశం
విషయం: వినియోగదారుల సమావేశం
సమయం:ఉదయం10.30 గంటలకు
వేదిక:బీఎస్‌ఎన్‌ఎల్, చుట్టుగుంట

స్మారక కార్యక్రమం
విషయం: విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్మారక కార్యక్రమం
సమయం:ఉదయం10.30 గంటలకు
వేదిక: సీపీఎం స్టేట్ ఆఫీసు, రాఘవయ్య పార్కు వద్ద

సదస్సు
విషయం: రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ సదస్సు
సమయం:ఉదయం 11 గంటలకు
వేదిక: ప్రెస్‌క్లబ్

ఎగ్జిబిషన్
విషయం: ఐడోనేషన్ ఎగ్జిబిషన్
సమయం:మధ్యాహ్నం 12 గంటలకు
వేదిక: వాసవ్య మహిళా మండలి, బెంజ్‌సర్కిల్

సమావేశం
విషయం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సమావేశం
సమయం:మధ్యాహ్నం 12 గంటలకు
వేదిక: హనుమంతరాయ గ్రంథాలయం

కచేరి
విషయం: సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో గాత్ర సంగీత కచేరీలు
సమయం: సాయంత్రం 6 గంటలకు
వేదిక: సంగీత కళాశాల

సదస్సు
విషయం:బిల్డింగ్ వర్కర్స్ సదస్సు
సమయం:సాయంత్రం 6 గంటలకు
వేదిక: హనుమంతరాయ గ్రంథాలయం

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు విఫలం

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

విజయవాడ సెంట్రల్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయని కారణంగానే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఇంతగా పెరిగిందని మాజీ ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు ఆరోపించారు. వీటిని అమలు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని దగా చేశాయన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మాగాంధీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం ఆడిటోరియంలో 'విభజన హామీలు-ఖాళీల భర్తీ-ఉపాధి, అభివృద్ధికై' సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా ప్రసంగించిన లక్ష్మణరావు మాట్లాడుతూ వెలగపూడిలో టెంపరరీ భవనాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే భర్తీ చేసినవి కేవలం 6500 పోస్టులేనన్నారు. నిరుద్యోగ భృతిని కూడా ప్రభుత్వం ఇవ్వకుండా ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. యువత ఆందోళన బాట పట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. సూర్యారావు తదితరులు ప్రసంగించారు.

మంచినీటి స్వచ్ఛతను పరిశీలించిన ఏడీఆర్‌ఎం

రైల్వేస్టేషన్: స్వచ్ఛ రైల్వే, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఆదివారం రైల్వే స్టేషన్‌లో ఉన్న మంచినీటిని పరిశీలించారు. ఏడీఆర్‌ఎం కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం నుంచి పదో నెంబర్ ప్లాట్ ఫారాలపై ఉన్న మంచినీటి కుళాయిలను పరిశీలించారు. హెల్త్, ఇంజనీర్ విభాగానికి చెందిన అధికారులు వరుణ్‌బాబు, ఆర్.సురేష్, సత్యనారాయణరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ప్రయాణికులకు స్వచ్ఛమైన నీటిని అందించాలని, ఎప్పటికప్పుడు నీటి స్వచ్ఛతను పరిశీలించాలని ఏడీఆర్‌ఎం వేణుగోపాల్ అధికారులకు సూచించారు.

గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ర్యాలీ రేపు

విజయవాడ కల్చరల్: గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీన జెఎంఎస్ యోగభారతి, ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జంగం శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు దుర్గాపురం రోడ్డు నుంచి ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల వరకు ఈ ర్యాలీ సాగుతుందని ఆయన తెలిపారు. అనంతరం 250 మంది విద్యార్థులు 108 సుమతీ శతక పద్యాలు, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పలికించిన తెలుగువేదం నుంచి కొన్ని గేయాలకు నృత్య ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీ ఎంపిక

ప్రెసిడెంట్‌గా టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంజనీర్

బక్రీద్ త్యాగాలకు ప్రతీక

పండుగ విశిష్టతపై పుస్తకావిష్కరణ

ఆటోనగర్: బక్రీద్ పండుగ త్యాగాల ప్రతీక అని ఈ పండుగ ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఫ్తి మొహమద్ ఫారూక్ ఖాసిమ్ అన్నారు. ఆదివారం ఆటోనగర్‌లోని 3వ రోడ్డులో డిస్పోజల్ సెంటర్‌లోని ధారుల్ ఖాజివల్ ఈఫ్తా మసీదులో బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను తెలుపుతూ సయ్యద్ అబ్దుల్ ఖాశిం రచించిన ఖుర్బానికా ఫజాయిల్ ఓ ముసాయిల్ పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఫారూఖ్ మాట్లాడుతూ ఖురాన్ అవతరణ సర్వ మానవాళి ప్రగతి కోసమేనని పేర్కొన్నారు. ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది ముక్తార్ ఆలి మాట్లాడుతూ ముస్లింలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్న ప్రభుత్వాలు వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. తాను రచించిన పుస్తకాలను ఐదు వేలు ముద్రించినట్లు, వాటిని వివిధ మసీదుల ద్వారా ప్రతి ముస్లింకు అందజేయనున్నట్లు తెలిపారు. హుదా బైతుల్ మాల్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఆలీం, ముఫ్తి ఉబైదుర్ రహ్మాన్, ఉలేమాలు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

శ్రమశక్తి ట్రేడ్ యూనియన్, ఐఎఫ్‌టీయు నేతల భరోసా

గాంధీనగర్ : గ్యాస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు శ్రమశక్తి ట్రేడ్ యూనియన్ కొండంత అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి దుర్గారావు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రామారావు భరోసా ఇచ్చారు. శ్రమశక్తి ట్రేడ్ యూనియన్ 14వ మహాసభ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. కార్మికుల కోసం కొరగంజి శేఖర్‌బాబు స్మారకంగా అక్షయపాత్ర భోజన పథకాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు కొరగంజి జనగ్మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ సుబ్బారావు, గిరిజ శంకర్ వరప్రసాద్, గద్దె హరిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.



పున్నమి ఘాట్‌లో ఫాస్ట్‌బీట్ పాటలకు నృత్యం చేస్తున్న చిన్నారులు, నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దేవినేని ఉమా, డ్రమ్స్ వాయిస్తున్న చిన్నారులు

పులకించిన పున్నమి

● ఆనంద ఆదివారంలో ఆటపాటల జోరు ● రహదారి భద్రత, నేత్రదానంపై అవగాహన ● పాల్గొన్న మంత్రి దేవినేని, కార్పొరేటర్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్/ భవానీపురం : తొలి సంధ్య వేళ పున్నమి ఘాట్ పులకించింది. ఆటపాటలతో ఆనంద ఆదివారం హుషారుగా సాగింది. ఫాస్ట్‌బీట్ పాటలకు పిల్లలు ఎగిరి గంతేశారు. జానపదాలతో అమ్మాయిలు గుండె ఘల్లుమనిపించారు. రహదారి భద్రత, నేత్రదానంపై స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాయి. ప్రతివారం నిర్వహించే ఆనంద ఆదివారాన్ని ఈసారి పున్నమి ఘాట్‌లో నిర్వహించారు. పతంజలి సంస్థ ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాల ప్రదర్శన చేసింది. వెస్ట్రన్, ఫాస్ట్‌బీట్ పాటలకు యువత డ్యాన్స్‌తో అదర గొట్టారు. సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన తీన్‌మార్ ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఉల్లాసంగా ఫుట్‌బాల్, క్రికెట్, బ్యాడ్మింటన్‌ల్లో చిన్నారులు మునిగి తేలారు. విద్యార్థినులు చేసిన రింగ్ డ్యాన్స్ 'రింగ్ రింగా రింగ్ రింగా' అనిపించింది. వీడు స్వచ్ఛంద సంస్థ రహదారి భద్రతకు సంబంధించిన అంశాలను వివరించింది. వాసవీ ఫౌండేషన్ అధ్యక్షురాలు దారా కరుణశ్రీ నేత్రదానంపై అవగాహన కల్పించారు. నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఫ్లోర్‌లీడర్ జి.హరిబాబు, కార్పొరేటర్లు ఎస్కే. అబీబ్, వై.రామయ్య, నగర పాలక సంస్థ అగ్నిమాపక అధికారి భాస్కరరావు హాజరయ్యారు.

ఘాట్‌కు పర్యాటక శోభ తెస్తాం : మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

పున్నమి ఘాట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అన్ని ప్రణాళికలు రూపొందించాం. దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఇకనుంచి ప్రతి ఆదివారం ఇక్కడ ఈవెంట్లు నిర్వహిస్తాం. విజయవాడలో ప్రారంభమైన ఆనంద ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతోంది. పిల్లలు, పెద్దలు, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

గణపతి బొప్పా మోరియా

● కృష్ణమ్మ ఒడిలోకి గణనాథులు ● మొదలైన నిమజ్జనాలు ● కృష్ణవేణి ఘాట్‌లో ఏర్పాట్లు పూర్తి ● నగరంలో 350 విగ్రహాల నిమజ్జనం ● ప్రత్యేక బృందాల ఏర్పాటు ● ఊరేగింపులపై పోలీసు నిఘా



ఆంధ్రజ్యోతి, విజయవాడ : గృహాలు, గల్లీల్లో కొలువైన గణనాథుడు కృష్ణమ్మ ఒడికి బయలుదేరాడు. మూడో రోజు కావడంతో ఆదివారం నుంచి నగరంలో నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన విగ్రహాలు ఉదయం నుంచి నిమజ్జనానికి వెళ్లాయి. నగరంలో మొత్తం 3500 విగ్రహాలు రిజిస్టర్ అయ్యాయి. వాటిలో 350 విగ్రహాలు కృష్ణవేణి ఘాట్‌లో నిమజ్జనం చేశారు. గణపతి బొప్పా మోరియా అంటూ బాలలు, యువత, మహిళలు రంగులు పూసుకుని ఊరేగింపుల్లో కేరింతలు కొట్టారు. కృష్ణవేణి ఘాట్‌లోనే కాక రైవస్ కాలువలో కూడా నిమజ్జనాలు కొనసాగాయి. అధికారులు మాత్రం కృష్ణవేణి ఘాట్‌ను మాత్రమే నిమజ్జన కేంద్రంగా ప్రకటించారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. రాత్రి వరకు నిమజ్జనం కొనసాగే అవకాశం ఉండడంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టుల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని నెలకొల్పారు. వాటితో పాటు కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశారు. నిమజ్జన ఊరేగింపులపై పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. అయిదో రోజు నుంచి నిమజ్జనాలు మరింత ఊపందుకోనున్నాయి.



గణనాథునికి హారతులిస్తున్న మహిళ

కృష్ణవేణిఘాట్‌కు నిమజ్జనానికి బయలు దేరిన గణనాథులు





దివ్యాంగ కళాకారుల భరతనాట్యం, కళాకారులను సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, విజయభాస్కర్ తదితరులు

అదరహో...

ప్రేక్షకులను కట్టిపడేసిన దివ్యాంగుల భరత నాట్యం

విజయవాడ కల్చరల్ : మువ్వలెలా ఉంటాయో చూడలేని వారి పదముల సందడికి మువ్వలే మురిసిపోయాయి. నాట్యానికి సిద్ధమైన వారి ఆహార్యం ఎలా ఉంటుందో కనలేని వారి నవరసాభినయానికి పై ఉన్న ఆభరణాలు పులకించాయి. అద్వితీయమైన నాట్యకేళి హోరుతో అద్భుతం... అపూర్వం. అమేయం దివ్యాంగుల భరతనాట్య విన్యాసం. ప్రేక్షకులను ఆశ్చర్య చకితులను చేసింది. సత్యనారాయణపురం ప్రభుత్వ సంగీత కళాశాలలో వారం వారం నిర్వహించే వారాంతరపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బెంగళూరుకు చెందిన 'ఆర్టిక్లేట్ ఎబిలిటీ' సంస్థ దివ్యాంగులు (అంధ కళాకారులు) ఆరుగురితో కూడిన బృందం రెండు గంటలపాటు చేసిన భరతనాట్య ప్రదర్శన చూసిన ప్రేక్షకులు కరతాళధ్వనులతో హర్షం ప్రకటించడం విశేషం. కళాకారులు బూసేగౌడ్, గురుప్రసాద్, సతీష్‌రావు, శివస్వామి తడబాటు లేకుండా నర్తించారు. ఈ సందర్భంగా ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులైనప్పటికీ వారి కళాప్రతిభ నిరుపమానమన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకులను ఆయన ప్రశంసించారు. సంచాలకుడు డి.విజయభాస్కర్ కళాకారుల బృందం గురువు నాగరాజు చెప్పిన దివ్యాంగుల జీవితం వెనుక ఉన్న కుటుంబ గాథలు తెలుగులోకి అనువదించారు. కార్యక్రమంలో ఈమని శివనాగిరెడ్డి, గోళ్ల నారాయణరావు, గుమ్మా సాంబశివరావు పాల్గొని కళాకారులను సత్కరించారు.

వైభవంగా జైన్‌ల శోభాయాత్ర



పాతబస్తీలో యాత్రలో పాల్గొన్న జైనులు, పక్కన శోభాయాత్ర

వన్‌టౌన్ : పర్యూషన్ పండుగ సందర్భంగా పాతబస్తీలో శ్రీసంభవనాథ్ రాజేంద్ర సూరిజైన్ శ్వేతాంబర్ ట్రస్ట్, శ్రీసంభవనాథ్ ముక్తీపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం జైన్‌ల శోభాయాత్ర వైభవంగా జరిగింది. పూలబావి వీధిలోని జైన్ ఆలయం లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి తమ ఇష్ట దైవాలను ప్రార్థిస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరేగింపు, ర్యాలీ నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కేటీ రోడ్డు, హిందూ హైస్కూల్ ఎదురు రోడ్డు నుంచి మార్వాడి గుడి వీధిలోని గుడికి చేరుకుంది. కార్యక్రమంలో జైన్ మత పెద్ద లు, ఆలయ పాలక వర్గ ఉపాధ్యక్షుడు అమీర్‌చంద్‌జైన్, అధ్యక్ష కార్యదర్శులు భవర్‌లాల్ సంఘ్వీ, మిఠాలాల్ రాథోడ్ యువజన నేతలు మనోజ్ కొఠారీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలో పుట్ట తొలగింపు

నున్న (విజయవాడ రూరల్) : నున్నలోని మండల పరిషత్ పశ్చిమ పాఠశాలలో పుట్టను ఎట్టకేలకు తొలగించారు. విద్యాసంస్థలలో విష సర్పాల సంచారం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు సర్పంచ్ కర్రె విజయ్‌కుమార్ స్పందించారు. స్కూల్, అంగన్‌వాడీ సెంటర్ మధ్యలో ఉన్న పుట్టను జేసీబీ సహాయంతో ఆదివారం తొలగించారు. అనంతరం విజయ్‌కుమార్, టీడీపీ గ్రామ కార్యనిర్వాహక కార్యదర్శి మాదు రామ్ ప్రసాద్, మెయిన్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మాదు కిరణ్‌కుమార్, జన్మభూమి కమిటీ సభ్యుడు తగరం చంటిబాబు తదితరులు శ్రమదానంతో పుట్ట తొలగించిన ప్రదేశాన్ని చదును చేశారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) మార్గరెట్‌కు తెలియజేశారు.

వీరు ఓకే అంటేనే.. సబ్సిడీ రుణాలు

● జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణ

● అర్హత పొందినా... సంతకాలు పెట్టించుకోవడం తలనొప్పిగా మారిన వైనం

విజయవాడ రూరల్ : వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు అర్హత పొందిన నిరుద్యోగ లబ్ధిదారులకు ఒక పరీక్ష పూర్తయిందనుకుంటే, అసలైన అగ్నిపరీక్ష ఇపుడే ప్రారంభమైంది. పలు కార్పొరేషన్‌ల అధికారులు, బ్యాంకర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్వ్యూలలో రుణాలకు అర్హత పొందిన అభ్యర్థులు ఇపుడు జన్మభూమి కమిటీ సభ్యుల సంతకాలు పెట్టించుకోవటం పెద్ద తలనొప్పిగా మారనుంది. మండలస్థాయి అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు, జన్మభూమి కమిటీ సభ్యుల సమ్మతి ఉంటేనే బ్యాంకర్లు రుణాలను మంజూరు చేస్తారు. విజయవాడువాడ రూరల్ మండలంలో 3,343 మంది పలు కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 2,870 మంది హాజరయ్యారు. అయితే జిల్లా ఉన్నతాధికారులు మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా 409 యూనిట్లకు రూ.9.28 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇదిలావుండగా, ఇంటర్వ్యూలకు హాజరైన వారి జాబితాను మండలంలోని 14 గ్రామ పంచాయతీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ గ్రామస్థాయి జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారే రుణాలకు అర్హత పొందుతారు. ఇదే లబ్ధిదారులకు పెద్ద అశనిపాతంలా తయారైంది. అర్హతలేని వారి పేర్లను జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసే అవకాశాలు కూడా ఉన్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

గత ఏడాది కూడా ఇదేరీతిలో సగానికిపైగా నిరుద్యోగ యువత రుణాలు పొందలేదని పలువురు వాపోతున్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన సమయంలో జన్మభూమి కమిటీ సభ్యులను అందుబాటులో ఉంచితే తమకీ ఇబ్బందులు ఉండేవికావని అంటున్నారు. ఇదిలావుండగా, జన్మభూమి కమిటీ సభ్యులు ఓకే అన్నా, బ్యాంకర్లు రుణాలు ఇస్తారో, లేదోనన్న ఆందోళన కూడా లబ్ధిదారులలో ఉంది.

రుణాల మంజూరు ఇలా...

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 164 మంది యూనిట్లకు రూ.1.96 కోట్లు, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 25కి రూ.40.35 లక్షలు, బీసీ కార్పొరేషన్ నుంచి 69 యూనిట్‌లకు రూ.1.38 కోట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 100 యూనిట్‌లకు రూ.2 కోట్లు, ముస్లిం మైనారిటీ నుంచి 34కి రూ.98.25 లక్షలు, క్రిస్టియన్ మైనారిటీ నుంచి 17 మందికి రూ.56 లక్షల రుణాలను మంజూరు చేయనున్నారు.



ఆనంద ఆదివారంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



షటిల్ ఆడుతున్న ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు



డాన్స్‌లు చేస్తున్న బాలలు

ఆటపాటలతో ఆనంద ఆదివారం

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లిలో ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్స్‌లు చేసి అలరించారు. ఆటపాటలతో అందరూ ఉత్సాహంలో మునిగి తేలారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ జేవీబీ కుమార్‌లు షటిల్ ఆడి సందడి చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు మరీదు లక్ష్మీదుర్గ, సర్పంచ్ కె.శివనాగరాజకుమారి, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో బీజీ మార్గరెట్‌లు త్రో బాల్, రింగ్ టెన్నిస్ ఆడారు. గ్రామంలో పిన్నలు, పెద్దలు పాల్గొని ఆనందించారు. అలసిపోయిన శరీరానికి ప్రశాంతత అవసరమని బసవరావు అన్నారు. ఈవోపిఆర్డీ వీఎస్ జాన్సన్, ఏపివో వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు నెరుసు శ్రీనివాసరావు, పామర్తి సునీత, పంచాయతీ కార్యదర్శి, రావి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు ఏవీజే ప్రసునాంబ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి వెళుతున్న యువకులు



అధ్వానంగా పెరికీడు కాలువ నిమజ్జనం రేవు



లడ్డూ పాట అనంతరం జెట్టి ఏడుకొండలుకు లడ్డూ అందిస్తున్న చవితి ఉత్సవ కమిటీ

నిమజ్జనం ఏర్పాట్లలో నిర్లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వినాయకచవితి సందర్భంగా పెరికీడుగ్రామంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. మండలంలో సుమారు 50 విగ్రహాలకు పైగా ఏర్పాటుచేయగా, హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో 30 విగ్రహాలు ఏర్పాటు చేశారు. నూజివీడురూరల్ మండలం, పెదపాడుమండలం తదితర ప్రాంతాలనుంచి మరో 70విగ్రహాల వరకు పెరికీడు కాలువలో ప్రతి ఏడాది నిమజ్జనం చేస్తారు. అదేరీతిలో ఈ ఏడాది కూడా నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్‌శాఖ సంయుక్తంగా నిమజ్జనం ఏర్పాట్లు పర్యవేక్షించాల్సి ఉండగా, పంచాయతీ శాఖమాత్రం రెండులైట్లు పెట్టి వదిలేశారు.

ఆదివారం నాటికి వినాయకచవితి ఉత్సవాలు మూడోరోజుకు చేరటంతో 30శాతం వరకు నిమజ్జనానికి విగ్రహాలు తరలుతున్నాయి. ఏలూరుకాలువలో నీటి ఒరవడి అధికంగా ఉన్నందున నిమజ్జనానికి వెళ్ళిన వారికి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో స్తంభాలు పాతి తాడుఏర్పాటుచేస్తే నిమజ్జనానికి వెళ్ళే యువకులకు ఆసరాగా ఉంటుందని స్థానికులు వివరించారు. కాగా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పెరికీడులో వినాయకుడి లడ్డూవేలం

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా పెరికీడులో గ్రామకమిటీ ఏర్పాటుచేసిన చవితిపందిట్లో లడ్డూను ఆదివారం వేలం నిర్వహించారు. జెట్టి చలపతిరావు రూ.6,700లకు పాడుకున్నారు. కార్యక్రమంలో నక్కాబాబు, నక్కా పాండు రంగారావు, పుట్టి కోటేశ్వరరావు, జెట్టి ఏడుకొండలు, మెరుగుమాల వేణు, రాగిపిండి లక్ష్మారెడ్డి, పుట్టివీర్రాజు, పల్లపోతు సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో ఉత్సాహంగా నిమజ్జనం



గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో వినాయక విగ్రహాలకు భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. స్థానిక గౌడపేటలో పిల్లలు ఏర్పాటు చేసిన బాల గణపతి ఊరేగింపు ఆదివారం ఉత్సాహంగా సాగింది. గౌడసంఘ అధ్యక్షులు పడమట సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పడమట రంగారావు(పిఆర్) పాల్గొన్నారు. తొమ్మిది కేజీల లడ్డు పాట పెట్టగా పామర్తి చిన వెంకటేశ్వరరావు నాలుగు వేలకు, నాలుగు కేజీల లడ్డూను చిమట శ్రీనివాసరావు 2 వేలకు దక్కించుకున్నారు



ఆత్కూరులో వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు

మేళతాళాలతో నిమజ్జనాలు

ఆత్కూరు(ఉంగుటూరు): వినాయక చవితి సందర్భంగా మూడో రోజు వివిధ గ్రామాల్లోని చవితి పందిళ్లలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆత్కూరు పీఏసీఎస్ బ్యాంక్ సమీపంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి పూజా కార్యక్రమంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి టి.సుజన్, ఆంజినేయులు, భరత్ అన్నదానం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తరిగొప్పుల, పుట్టగుంట, నందమూరు, నాగవరప్పాడు, మానికొండ -2, చాగంటిపాడు, తేలప్రోలు, పొట్టిపాడు గ్రామాల్లో గణనాధులను మేళతాళాలతో నిమజ్జనం నిర్వహించారు.



మదర్ థెరెసా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ బసవరావు

మదర్ థెరెసా జీవితం ఆదర్శం కావాలి

గన్నవరం: మదర్ థెరెసా జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. స్థానిక మదర్‌థెరెసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం థెరెసా 107వ జయంతి ఘనంగా నిర్వహించారు. సభకు ట్రస్ట్ ఛైర్మన్ పీవీఎస్సార్ కృష్ణ అధ్యక్షత వహించగా, బసవరావు మాట్లాడారు. హెచ్‌ఐవీ రోగులకు అవగాహన, రక్తదానం, అనాథ శవాలకు అంతక్రియలు వంటి కార్యక్రమాలు చేయటం ముదావహమన్నారు. ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ మాట్లాడుతూ మదర్‌థెరెసా సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి 75మంది వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలం ప్రవీణ్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షులు పడమట సురేష్, టౌన్ అధ్యక్షులు పొలడుగు నాని, నె ప్రూ, హరి, కాసులు, పాల్గొన్నారు.



నూతన కమిటీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీ

మత్స్యకారులు ఆర్థిక స్వావలంబన సాధించాలి

గన్నవరం: మత్స్యకార సహకార సంఘాలు చెరువులను అభివృద్ధి చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ అన్నారు. ఆదివారం మండలంలోని గన్నవరం, చిక్కవరం, అజ్జంపూడి, మెట్లపల్లి గ్రామాల మత్స్యకార సంఘాల నూతన కమిటీలను అభినందించారు. వంశీ మాట్లాడుతూ సంఘం అభివృద్ధితో పాటు పార్టీని బలోపేతం చేయాలన్నారు. చెరువులను పట్టిసీమ నీటితో నింపుకోవాలని సూచించారు. మత్స్య సొసైటీలకు ప్రభుత్వం అందించే రాయితీ రుణాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ, వైస్ ఎంపీపీ గొంది పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కుండీ

వీరపనేనిగూడెం(గన్నవరం): వీరపనేనిగూడెం నుంచి మెట్లపల్లి వెళ్లే రహదారి అంచున నీటి వాలు కోసం ఏర్పాటు చేసిన కుండి ప్రమాదకరంగా ఉంది. నీటిని పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా చేసేందుకు మధ్యలో వాల్ కోసం వరలతో కుండీని ఏర్పాటు చేశారు. దీనిపై మూత ధ్వంసం కావటంతో అధికారులు మళ్లీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోలేదు. దీంతో రోడ్డు మార్జిన్‌లోనే ఈ కుండి ఉండటంతో ప్రమాదాలకు నెలవుగా ఉంది. అధికారులు పరిశీలించి కుండీపై మూతను ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.





సీఎం సహాయ నిధి చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే వంశీ

వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాధిత మహిళకు రూ.1,60,000 సీఎం సహాయనిధిచెక్కును గన్నవరం ఎమ్మెల్యే వంశీమోహన్ అందించారు. శనివారం సాయంత్రం బాపులపాడుమండలం కానుమోలు గ్రామంలో బాధిత కుటుంబానికి రూ.1,60,000 సీఎం సహాయనిధిపత్రాలను అందించారు. హనుమాన్‌నగర్‌కు చెందిన రంగిశెట్టిసురేష్ కుమార్తె రంగిశెట్టి స్వప్నకు గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సహాయం నిమిత్తం గన్నవరం ఎమ్మెల్యేని ఆశ్రయించారు. స్పందించిన వంశీమోహన్ రూ.1,60,000 నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన శివయ్య, రాష్ట్రరైతుసంఘం నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ కాటుమాల థెరిస్సా, కాటుమాల గిరివరప్రసాద్, మజ్జిగ నాగరాజు, తట్టి అర్జున్‌రావు, చిన్నే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలవాలి


హనుమాన్‌జంక్షన్: పేదరికంతో ఉన్నత విద్యా భ్యాసం చేయలేక మధ్యలోనే చదువు ఆపేస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించి సహకరించాలని బాపులపాడు సహకార సంఘం అధ్యక్షుడు కొల్లి వెంకట్రావు కోరారు. బాపులపాడుకు చెందిన గూడవల్లి వెంకట సాయి మేఘన ఆర్థిక ఇబ్బందులతో కళాశాలలో ఫీజుకట్టడానికి ఇబ్బందిపడుతున్న విషయం తెలుసుకున్న వెంకట్రావు ఆమెకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నుబోయిన శివయ్య, వరిగంజి కిషోర్, పెయ్యల నాని, కట్టా వాసు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బాపులపాడు సొసైటీ అధ్యక్షుడు కొల్లి వెంకట్రావు

చినకంచిలో గణపతికి లక్ష గరికపూజ

నున్న (విజయవాడ రూరల్) : నున్నలో వేంచేసి ఉన్న చినకంచి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం గణపతికి లక్ష దూర్వాయుగ్మ (గరిక) పూజ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీగంగానమ్మకు ఆభరణాల బహుకరణ

నున్న (విజయవాడ రూరల్) : నున్న గ్రామ పంచాయతీ పరిధిలో బోడపాడులో వేంచేసి ఉన్న శ్రీగంగానమ్మ అమ్మవార్లకు బీజేపీ నున్న శాఖ అధ్యక్షుడు గోవిందు రవి ఆదివారం ఆభరణాలు బహుకరించారు. గ్రామంలో గంగానమ్మ దేవస్థానాన్ని ఇటీవల అభివృద్ధి పర్చారు. అందులో భాగంగానే రూ. 35 వేల విలువ చేసే వెండి ఆభరణాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీగంగానమ్మ దేవస్థానం కమిటి సభ్యులు పాల్గొన్నారు.



శ్రీగంగానమ్మ అమ్మవారికి ఆభరణాలు అలంకరిస్తున్న గోవిందు రవి కమిటి సభ్యులు

వీరికి కూరగాయాలు... దళారులకు వరాలు

● కన్నీరు పెట్టిస్తున్న ఉల్లిపాయలు ● రూ.50కి చేరిన టమోటా ● ఒక్కసారిగా పెరిగిన పచ్చిమిర్చి





హనుమాన్‌జంక్షన్: కూరగాయల ధరలు రైతుకు దుఃఖాన్ని.. వినియోగదారుడికి భారాన్ని కలిగిస్తున్నాయి. ఒకపక్క దళారులు, మరోపక్క వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు. ఏడాది పొడవునా ప్రజలను కూర'గాయాలు' వెంటాడుతూనే వచ్చాయి. తగ్గినసాగు, ప్రతికూల వాతావరణం దిగుబడులపై ప్రభావం చూపగా మార్కెట్ మాయాజాలం దీనికి తోడైంది. శీతలగిడ్డంగుల వ్యవస్థను ప్రభుత్వం అభివృద్ధి చేయక పోవడంతో పంట నిల్వచేసుకునే సామర్థం లేకుండా పోతోంది. రెండునెలల క్రితం టమోటా పంటకు గిట్టుబాటు ధర లభ్యంకావడం లేదంటూ రైతులు గగ్గోలు పెట్టారు. దిగుబడి తగ్గిపోవడంతో గతనెల్లో కిలో రూ.100లకు చేరుకున్న టమోటా ధర ప్రస్తుతం రూ.50కి చేరుకుంది.

ఇక ఉల్లిపాయల ధర ప్రజలకంట కన్నీరు పెట్టిస్తోంది. గత నెల్లో రూ.18లుఉన్న కిలో ఉల్లిపాయధర నేడు రూ.45 నుంచి రూ.55 వరకు పలుకుతోంది. పచ్చిమిర్చి అనూహ్యంగా ఒక్కరోజులోనే కిలోకు రూ.25లు పెరిగింది. బుధవారం కిలో రూ.16లు పలికిన పచ్చిమిర్చి ధర ఆదివారం రూ.40లకు చేరుకుంది. బెండ, క్యాబేజి ధరలు కూడా సామాన్యుడికి భారంగానే ఉన్నాయి.

ప్రభుత్వవిధానాల ప్రభావంతో కూరగాయల సాగు విస్తీర్ణం నానాటికి పడిపోతోంది. సామాన్య ప్రజలు, రోజువారి కూలీల పరిస్థితి దారుణంగా మారింది. ప్రతివస్తువుకు బడ్జెట్ వేసుకునే బడుగుజీవి కూరగాయలకు వందల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. కూరగాయలు, నిత్యావసర సరుకులు, చికెన్‌ధరలు సామాన్యుల నడ్డి విరిచేస్తున్నాయి. వేసవిలో నీటిసౌలభ్యం లేకపోవడంతో పంటల దిగుబడి తగ్గడం సహజం. కాని ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి. కూరగాయల పంటలు చేతికివస్తున్నాయి. అయినా ధరలు మాత్రం కొండెక్కాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

బాలగణపతి నిమజ్జనంలో అంతా బాలలే

హనుమాన్‌జంక్షన్: వినాయకచవితి సందర్భంగా బాలవినాయకుడ్ని నెలకొల్పి పూజలు నిర్వహించిన చిన్నారులు ఏలూరు కాలువలో నిమజ్జన ఊరేగింపుతో ప్రజలను ఆకట్టుకుంది. స్థానిక సాయికల్యాణి మోటార్స్ అధినేత మూల్పూరి సురేంద్రకుమార్ కుమారుడు శోభన్‌కుమార్ బాలగణపతిని నిమజ్జనం చేయటానికి ఏర్పాటుచేసిన ఊరేగింపులో అంతాచిన్నారులే ఉండటం విశేషం. ఈ సందర్భంగా తీన్‌మార్‌డప్పులతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు కొనసాగింది.



బాలగణపతి నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న చిన్నారులు

జోరుగా వినాయకుని విగ్రహాల నిమజ్జనం

ఆదివారం 3వరోజు కావడంతో జంక్షన్‌లోని పలుచోట్లఏర్పాటుచేసిన వినాయకవిగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి పెరికీడులోని ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. ఒక్క ఆదివారమే దాదాపు 10కి పైగా వినాయకుడి విగ్రహాలను ఏలూరుకాలువలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

అధిక విస్తరణలో వరిసాగు

వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

● ఇంటర్వ్యూ



(హనుమాన్‌జంక్షన్)

మండలంలో వరిసాగు, సేంద్రియ ఎరువుల వాడకం, పట్టిసీమ నీటి వినియోగం తదితర విషయాలపై 'ఆంధ్రజ్యోతి' అడిగిన పలు ప్రశ్నలకు వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు.

? బాపులపాడు మండలంలో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం ఎలా ఉంది?

! సాధారణవిస్తీర్ణం కంటే ఎక్కువ వరిసాగవుతోంది. 6384 హెక్టార్లను సాధారణ విస్తీర్ణంగా భావించగా ఇప్పటికే 7013 హెక్టార్‌లలో వరినాట్లు పూర్తయ్యాయి. కాకులపాడు, రంగయ్య అప్పారావుపేట గ్రామాల్లో మరో 100 హెక్టార్ల వరకు వరినాట్లు పడే అవకాశం ఉంది.

? ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం పెరగడానికి కారణాలు ఏమిటి?

! గడిచిన మూడేళ్లుగా సరైనవర్షపాతం లేకపోవడం వల్ల ఏలూరుకాలువ కింద వరిపంట సాధారణ స్థాయిలో కూడా పడలేదు. ఈ ఏడాది జూన్‌లోనే పట్టిసీమనీరు విడుదలచేయటం, వర్షాలు కూడా ఆశాజనకంగా కురవడం వల్ల వరిసాగువిస్తీర్ణం పెరిగింది.

? ఈ ప్రాంతంలో ఏ రకం వరి విత్తనాలు వాడితే రైతుకు లాభదాయకంగా ఉంటుంది?

! 1061, ఎంపీయూ 7029, బీటీయూ 5204, కొత్తవంగడం ఎంపీయూ 1121 వాడితే రైతుకుమంచి దిగుబడులు వస్తాయి.

? మండలంలో సేంద్రియ ఎరువుల వినియోగం ఎలాఉంది?

! మండలంలోని 11గ్రామాల్లో రైతులు సేంద్రియ ఎరువులు అధికంగా వాడుతున్నారు. కంపోస్ట్, పచ్చిరొట్ట, పెంటపోగు తదితర సేంద్రియ ఎరువులు వినియోగించటం వల్ల భూమిసారవంతంగా మారుతోంది.

? రైతుపథం కింద ఎన్ని ట్రాక్టర్లు మంజూరు అయ్యాయి?

! రైతుపథం కింద మండలానికి 12 ట్రాక్టర్లు మంజూరు అయ్యాయి. వీటికిగాను 16మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మరో 12 ట్రాక్టర్లు మంజూరయ్యే అవకాశం ఉంది.

అగ్రిగోల్డ్ బాధితులను పరిహారం అందించండి

హనుమాన్‌జంక్షన్: రాష్ట్రవ్యాప్తంగా 20లక్షలకు పైగా ఖాతాదారులున్న అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం పట్టించుకుని వారికి యుద్ధప్రాతిపదికన నష్టపరిహారం అందించాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు వణుకూరి సూర్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రప్రభుత్వానికి ఆయన ఒకలేఖను రాస్తూ అగ్రిగోల్డ్ నిర్వాహకులు చేసిన మోసం కారణంగా లక్షలాదిమంది ప్రజలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎంతోమంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వారి కుటుంబాల వారికి రూ.6లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులకు 120రోజుల్లో సొమ్ము తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం మార్చి నెలలో చెప్పిన మాటలను ఆచరణలో చూపించలేక పోయిందన్నారు. 20వేలలోపు డిపాజిట్‌దారులకు వెయ్యికోట్లను అడ్వాన్స్‌గా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం సత్వరమే వేలంవేసి బాధితులకు అందచేయాలన్నారు.

యువకుడిపై కూల్‌డ్రింక్ సీసాతో దాడి

యనమలకుదురు (పెనమలూరు): యువకుడిపై వ్యక్తి దాడి చేసిన సంఘటన యనమలకుదురులో శనివారం రాత్రి జరిగింది.

పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పాలేపల్లి సూర్య ఇంటర్ చదివి ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం ఓ దుకాణం వద్ద కూల్‌డ్రింక్ తాగుతుం డగా బైక్‌పై వచ్చిన వ్యక్తి మా అమ్మాయిని ఏడిపిస్తున్నావంటా? అని ఘర్షణపడి చేతిలో ఉన్న డ్రింక్ సీసాతో తలపై కొట్టాడు. గాయపడిన సూర్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యదర్శులు కరవు.. పాలన బరువు

• సమస్యలతో ప్రజల ఇక్కట్లు • నిలిచిపోతున్న అభివృద్ధి పనులు • పట్టించుకోని జిల్లా అధికారులు

పెనమలూరు: మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు కొంత కాలంగా శాశ్వత కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. పూర్తి సమయం కార్యదర్శులు పంచాయతీల్లో అందు బాటులో లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పు కోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. వణుకూరు, పోడవరం పం చాయతీలకు ఏడాది నుంచి ఇన్‌చార్జిల పాలన సాగు తోంది. ఖాళీ అయిన చోట శాశ్వత కార్యదర్శులను నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. వణుకూరులో దాదాపు 30 వేల జనాభా ఉండ టంతో నిత్యం పారిశుధ్య సమస్యలు ఎదురవుతున్నా యి. పంచాయతీ నుంచి ఎన్నో సర్టిఫికెట్లు ప్రజలకు అందాల్సి ఉంటుంది.

గ్రామంలో అభివృద్ధి పనులకు కార్యదర్శి ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. సర్వసభ్య సమావేశాల్లో సభ్యులచే తీర్మానాలు చేయించి గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. పోడవరం పంచాయతీ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రెండు గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులే విధులు చేపడుతున్నారు. పోరంకి, తాడి గడప గ్రామాల కార్యదర్శులు ఆ రెండు గ్రామాలకు ఇన్‌చార్జిలుగా కొనసాగుతూ వారానికి ఒకసారి ఆయా గ్రామాలకు వెళ్లి వస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అదే మంటే తాము విధులు నిర్వహిస్తున్న గ్రామాలు మేజర్ పంచాయతీలని, నిత్యం అక్కడ పని ఒత్తిడి ఉంటుందని ఇన్‌చార్జి కార్యదర్శులు చెబుతున్నారని గ్రామస్థులు తెలుపుతు న్నారు. మండలంలో దాదాపు అన్ని పంచాయతీలు మేజర్ కాగా ప్రజల సమస్యలు కూడా అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారు లు స్పందించి శాశ్వత కార్యదర్శులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూలోనూ ఇదే పరిస్థితి

పెనమలూరు: నియోజకవర్గంలో పెద్ద మండ లమైన పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో సమస్యల పరి ష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో 1.80 లక్షల జనాభాకు పది గ్రామాల్లో 22 మంది వీఆర్వోలు పనిచేయాల్సి ఉంది. గ్రామ పరిపాలనా అధి కార వ్యవస్థ అమల్లోకి వచ్చిన తరువాత జనాభా ప్రాతిపదికన ఆయా గ్రామాలకు వీఆర్వోలను కేటాయించారు. మేజర్ గ్రామాలకు నలుగురు లేక ఐదుగురు వీఆర్వోలను నియమించారు. ఇదిలా ఉండగా పెనమలూరు, పెదపులిపాక, కానూరు, పోడవరంలో ఒక్కొక్కటి చొ ప్పున నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడాదిగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో ప్రజలు వీఆర్వోల కోసం వెళ్లి నిరాశకు గురవుతు న్నారు. పక్కనున్న వీఆర్వోల వద్దకు వెళితే తమ పరి ధి కాదు, మీ ప్రాంత వీఆర్వో వచ్చిన తరువాత పని చేయించుకోమంటూ చెబుతున్నారు. దీంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. రేషన్ కార్డు లు, ఇంటి నిర్మాణాలు, పాస్ పుస్తకాలు, వివిధ పనులకు స్థానిక వీఆర్వో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వీఆర్వోల కొరత ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు లేరు.

ఒకరు జీతం ఇక్కడ తీసుకుంటూ పనిమాత్రం సబ్ కలెక్టర్ కార్యాలయం లో చేస్తున్నారు. మరొకరు పదోన్నతిపై వెళ్లడంతో తాత్కాలికంగా ఉయ్యూరుకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను డిప్యూటేషన్‌పై పంపారు. ఇక సీనియర్ అసిస్టెంట్ లేనే లేరు. నెల లు గడుస్తున్నా ఈ పోస్టు భర్తీ కాకపోవడంతో సమ స్యలు పరిష్కారం నోచుకోవడం లేదు. రెవెన్యూ సిబ్బంది కొరతతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవు తున్నారు. అటెండర్ పని కూడా కార్యాలయం ఉద్యోగే చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సిబ్బం ది విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి పెనమలూరులో రెవెన్యూ సిబ్బంది కొర తను తీర్చాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


దుస్తులు, డప్పులు పంపిణీ చేస్తున్న గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్

తీన్మార్ టీమ్‌కు దుస్తుల పంపిణీ

ఉప్పులూరు (కంకిపాడు): గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయటం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు అన్నే ధనరామకోటేశ్వర రావు సొంత నిధులతో ఉప్పులూరు తీన్మార్ బృందానికి అవసర మైన దుస్తులు, తీన్మార్ డప్పులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ టీడీపీ బలంగా ఉండటానికి ప్రధాన కారణం నిత్యం చేపడు తున్న సేవా కార్యక్రమాలేనన్నారు. టీడీపీ నాయకులు కొండవీటి శివయ్య, పడవల మధుసూదనరావు, కొణతం సుబ్రహ్మణ్యం, చలసాని రాధాకృష్ణమూర్తి, లాం చంద్రరావు, బ్రహ్మాజీ తదిత రులు పాల్గొన్నారు.



గులాబీలు పంపిణీ చేస్తున్న పవన్ కళ్యాణ్ అభిమానులు

పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదు

కంకిపాడు: ప్రముఖ సినీ నటుడు, జనసేన పార్టీ అధ్య క్షుడు పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదని పవన్ కళ్యాణ్ ఫ్యాన్ అసోసియేషన్, జనసేన నాయకుడు ముప్పా గోపాలకృష్ణ, యలిశెట్టి సుబ్బారావు హెచ్చరించారు. పవన్ కళ్యా ణ్‌పై కత్తి మహేష్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గంగానమ్మ గుడినుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆదివారం నిర సన ప్రదర్శన చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో గులా బీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను కించపరిచే విధంగా అనామకుడు కత్తి మహే ష్ మాట్లాడటం సరికాదన్నారు. అభిమానులను రెచ్చగొట్టేందు కు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమం లో ముప్పా వెంకటేష్, సుధీర్, మ్యారి, హరీష్, అజయ్, పులి బాబి, రంజిత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలు అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఆదర్శప్రాయురాలు మదర్ థెరెసా

తెన్నేరు (కంకిపాడు): సేవా మూర్తి మదర్ థెరెసాను నేటి తరం రాజకీయ నాయకులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని మదర్ థెరెసా గ్రామీణ వృద్ధుల సేవా సమితి ప్రతినిధులు అ న్నారు. తెన్నేరులోని ఆ సమితి ఆధ్వర్యంలో థెరెసా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమా లను మరింత విస్తృతంగా చేయాలని సూచించారు. సమితి ప్రతినిధులు జుజ్జువరపు జార్జి, లాం రామకోటయ్య, కలపాల వజ్రాలు, కొడాలి యలమంద, దేవదానం, వడ్డాది వెంకటేశ్వర రావు, తాటితోటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నైతికత ఎక్కడుంది?

ఉప్పులూరు (కంకిపాడు): ప్రతిపక్ష పార్టీ వైసీపీకి ఓటు ఎందుకు వేయాలని ప్రజలే ప్రశ్నిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ప్రజలు టీడీపీకి ఓటు వేస్తారని, ప్రతిపక్ష నేత జగన్‌కు నైతికత ఎక్కడుందని ప్రశ్నించారు. సీఎంను విమర్శించేందుకు, దుర్భా షలాడేందుకు నంద్యాల, కాకినాడ ఎన్నికలను జగన్ ఉపయోగించుకుం టున్నారని ఆరోపించారు. అటు నంద్యాల, ఇటు కాకినాడ ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేయటం ఖాయమన్నారు.

సీఎం కృషి వల్ల టీడీపీకి మేలు

కానూరు (పెనమలూరు రూరల్): రాష్ట్రాభివృద్ధికి సీఎం చం ద్రబాబు చేస్తున్న కృషి వల్ల టీడీపీకి ఎంతో మేలు చేకూరుతుందని దు ర్గగుడి కమిటీ సభ్యుడు వెలగపూడి శంకర బాబు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడనున్న నేపథ్యంలో అశోక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీకి 15 నుంచి 20 వేల మెజార్టీ వస్తుం దన్నారు. అనేక మంది చేపట్టిన సర్వే ఫలితాలు కూడా టీడీపీకే మెజార్టీ వస్తుందని ఇప్పటికే స్పష్టం చేశాయని తెలిపారు. కాకినాడ ఉప ఎన్నిక ల్లో కూడా భారీ మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు షేక్ బుజ్జి, నాయకులు షేక్ షకీలా పాల్గొన్నారు.

నంద్యాల ఫలితాలపై పందేల జోరు

ఉయ్యూరు: నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలపై ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో జోరుగా పందేలు సాగాయి. టీడీపీ విజయం సాధిస్తుందని ఒకటికి రెండు రెట్లు ఇస్తామంటూ పెద్ద పందేలు కాస్తున్నారు. బుకీలు సాయంతో లక్షల్లో పందేలు జరిగినట్లు సమాచారం. గత రెండు రోజు ల నుంచి పందేల జోరు ఎక్కువవడంతో కాయ్ రాజా కాయ్ అంటూ పందేల రాయుళ్లు, బుకీలు ఆ పనిలో బిజీగా ఉన్నట్లు తెలిసింది.

బాలికను వేధిస్తున్న ఇద్దరిపై కేసు

యనమలకుదురు (పెనమలూరు): బాలికను వేధిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. యనమలకుదురుకు చెంది న బాలిక (14) స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన శ్రీను కుమారులిద్దరు నిత్యం దారికాచి అసభ్య కరమైన పదజాలంతో ఈవ్‌టీజింగ్ చేస్తున్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఈడుపుగల్లులో అన్నసంతర్పణను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవినేని రాజా, వెల్పూరులో వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న సర్పంచ్ చెన్నుబోయిన జయరామ్

ఘనంగా గణేశ్ నిమజ్జనాలు


ఉయ్యూరులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు

కంకిపాడు: వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్ర హాల ఊరేగింపులు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక పులి రా మారావు నగర్, జమ్మి చెట్టు సెంటర్‌లో, ఈ డుపుగల్లు శివాల యం వద్ద, ఉప్పులూరు ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఉప్పులూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వినాయకుడి విగ్ర హాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈడుపుగల్లు ఆనంద్ విహార్‌లో ఏర్పాటు చేసి న అన్న సంతర్పణను ఎంపీపీ దేవినేని రాజా ప్రారంభించారు. ఆనంద్ విహార్ ప్రతినిధులు టి.ఎస్.వి.ప్రభా కర్, బి.రజనీ కుమార్, ఎం.ప్రసాదరావు, సాం బయ్య, హరిబాబు, రామారావు, రావి సురేష్‌కు మార్ తదితరులు పాల్గొన్నారు. వెల్పూరు ఎస్సీ కాలనీలో వినాయకుడి ఊరేగింపు ఘనం గా నిర్వహించారు. సర్పంచ్ చెన్నుబోయిన జయరామ్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: పట్టణంలో గణేష్ నిమజ్జనం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణం లోని దుర్గా ఎస్టేట్, ఇతర ప్రాంతాల్లో వినాయ కచవితి సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చే సిన విగ్రహాలను మేళతాళాలు, డప్పు వాయి ద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి పుల్లేరులో ని మజ్జనం చేశారు. విగ్రహాల ఊరేగింపుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగా నవ రాత్రులు జరిపే వినాయక మండపాల్లో జరిగి న పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఫ్లెక్సీల ఏర్పాటు

ఉయ్యూరు: పట్టణంలో ఫ్లెక్సీలు యథేచ్ఛగా వేలాడుతున్నా నగర పంచాయతీ అధికారులు చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పోస్టర్ రహిత పట్టణాలుగా ఉంచాలని, ఇందుకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని జీవో జారీ చేశారు. పలువురు వ్యాపారవేత్తలు, వ్యక్తులు ప్రారంభోత్సవాలు, ఫంక్షన్‌లకు ఫ్లెక్సీలు కడుతున్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వర్షాలు, ఈదురుగాలులకు రోడ్డుపై వెళ్లే వారిపై పడటమేకాక పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి.



దోమ కుట్టిందో

మంచమెక్కాల్సిందే!

• శ్రీనగర్ కాలనీలో పొంగుతున్న మురుగు కాల్వలు
• పేరుకుపోయిన చెత్తకుప్పలు • అనారోగ్యం పాలవుతున్న స్థానికులు



శ్రీనగర్ కాలనీలో మురుగు తెట్టపై దోమలు

ఉయ్యూరు: పొంగిపొర్లుతున్న మురుగు కాల్వలు, పేరుకుపోయిన చెత్త కుప్పలు, అధ్వాన పారిశుధ్యంతో నగర పంచాయతీ పరిధిలోని 7వ వార్డు శ్రీనగర్ కాలనీలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. తోట్లవల్లూరు రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే రహదారితోపాటు పరిసరాల్లో మురుగుపోయే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తున్నాయి. కాల్వల్లో నిలిచిపోతున్న మురుగు నీటిలో దోమలు పెరిగి వైరల్ మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో స్థానికులు బాధపడుతున్నారు. కాలనీలో మురుగు కాల్వల పరిస్థితి, పారిశుధ్యంపై నగర పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, పిల్లలు, పెద్దలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన మలేరియా జ్వరంతో ఎం.ప్రసాదరాజు విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, బాలిక మాధుర్య నాలుగు రోజులుగా స్థానికంగా చికిత్స పొందుతుంది.

సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు. మురుగు కాల్వల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



కాలనీలో పేరుకుపోయిన చెత్త



జ్వరంతో బాధపడుతున్న బాలిక మాధుర్య

శాశ్వత పరిష్కారం చూపాలి



మురుగునీరు పోయే మార్గం లేక రోడ్లపై పారుతుంది. దోమకాటుకు గురై పిల్లలు, పెద్దలు రోగాల పాలవుతున్నాం. సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

- టి.వేణుగోపాలరాజు

పెద్ద డ్రెయిన్‌కు కలపాలి



సమస్య పరిష్కారానికి తోట్లవల్లూరు రోడ్డు వెంబడి డ్రెయిన్‌కు కాలనీలో డ్రెయిన్‌లు కలపాలి. వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచి పోవడం వల్ల అసౌకర్యానికి గురవుతున్నాం. కాలనీలో జ్వరాలతో పలు వురు చికిత్సపొందుతున్నారు.

- ఎ.సర్వేశ్వరరావు

వెంటనే చర్యలు తీసుకోవాలి



కాలనీలో మురుగు కాల్వలు, చెత్త సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి. కాలనీలో పరిస్థితి గురించి కమీషనర్‌కు తెలియజేసినా ఫలితం లేదు.

- డి.ఎస్.రాజు



డ్యాన్స్ చేస్తున్న జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

ఆనంద ఆదివారానికి స్పందన కరవు

ఉయ్యూరు: ఆనంద ఆదివారంలో సినిమా పాటలకు పిల్లలతో డ్యాన్స్‌లు వేయించడానికే పరిమితామా? అన్న సందేహం వ్యక్తమవుతోంది. వారం రోజులు పనుల్లో బిజీగా ఉన్న వారు ఆదివారం ఆటపాటలతో ఆనందంగా గడపాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం హ్యాపీ సండే (ఆనంద ఆదివారం) నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. కార్యక్రమానికి నగర పంచాయతీ తప్ప ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో వారానికి ఒక స్కూల్ విద్యార్థులతో నాలుగు పాటలకు డ్యాన్స్‌లు వేయించి అయ్యిందనిపిస్తున్నారు. సెంటర్‌లో ఓ స్టేజి వేసి డ్యాన్స్‌లు తప్ప, ఆటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల జోలికి పోవడం లేదు.



దుస్తులు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షురాలు భువనేశ్వరిదేవి

దుస్తులు, వంటసామగ్రి పంపిణీ

ఉయ్యూరు: పట్టణ మహిళా స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వంద మంది పేదలకు ఆదివారం దుస్తులు, వంట సామగ్రి, బియ్యం పంపిణీ చేశారు. సొసైటీ చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతల నుంచి సేకరించిన వస్తువులు, దుస్తులు ఇతర సామగ్రిని పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు పంపిణీ చేసినట్లు అధ్యక్షురాలు పడమట భువనేశ్వరీదేవి తెలిపారు. అలాగే తల్లిపాల విశిష్టత, పోషకాహారం, అవయవ దానం, మహిళామిత్ర వంటి వాటిపై అవగాహన కలిగిస్తున్నామన్నారు. సొసైటీ సభ్యులు శ్రీలత, పరమేశ్వరి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

31న కలెక్టర్ ముందుకు కంకిపాడు సర్పంచ్

కంకిపాడు: కంకిపాడు పంచాయతీలో జరిగిన అవినీతిపై సర్పంచ్ వజ్రకు మారి ఈ నెల 31న విజయవాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో హాజరు కానున్నారు. ఈ మేరకు సర్పంచ్‌కు నోటీసులు అందినట్లు తెలిసింది. దీంతో పంచాయతీలో జరిగిన అవినీతిపై విచారణ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారంటూ ఉప సర్పంచ్ పులి కామేశ్వరరావు జిల్లా పంచాయతీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి డీఎల్పీవోని విచారణకు ఆదేశించారు. పంచాయతీలో సుమారు రూ.15,71,889 దుర్వినియోగమయ్యాయని తేల్చారు. అందులో రూ.5,72,882 సర్పంచ్ దుర్వినియోగం చేశారని, వాటిని తిరిగి చెల్లించాలని 2016 జూలైలో ఆమెకు నోటీసులు జారీ చేశారు. అయితే సర్పంచ్ జిల్లా పంచాయతీ రాజ్ అధికారులకు సంజాయిషీ ఇచ్చారు. దీనిపై తిరిగి విచారించాలని కలెక్టర్ మచిలీపట్నం పంచాయతీ రాజ్ అధికారిని ఆదేశించారు. దీంతో ఆయన రికార్డులను తిరిగి పరిశీలించి రూ.10,00,378 అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఇందులో సర్పంచ్ రూ.5,00,189 దుర్వినియోగం చేసినట్లు తేల్చారు. కాగా జూన్ 15న కలెక్టర్ ముందు సర్పంచ్‌ను హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే పరిపాలనా కారణాల వల్ల విచారణ వాయిదా పడింది. ఈ నెల 31న తిరిగి కలెక్టర్ ముందు సర్పంచ్ హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.



టిఫిన్ బండి అందజేస్తున్న మంచినేని పరమేష్

టిఫిన్ బండి అందజేత

పెనమలూరు: మంచినేని వెంకటరత్నం చారిటీస్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పేద వ్యాపారి ఉపాధికి టిఫిన్ బండిని ఆదివారం ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ ఛైర్మన్ మంచినేని పరమేష్ మాట్లాడుతూ పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ట్రస్టు పనిచేస్తుందన్నారు. పెనమలూరుకు చెందిన వనమాల రాము పేదరికంతో ఉండటంతో అతని ఉపాధికి రూ.19 వేల విలువైన టిఫిన్ బండి అందించినట్లు చెప్పారు. ట్రస్ట్ కార్యదర్శి రమేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

కానూరు (పెనమలూరు రూరల్): కానూరు ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గొయ్యి ప్రమాదకరంగా మారింది. పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే ప్రారంభంలో ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడింది. తొలుత చిన్న గొయ్యి ఏర్పడగా ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో క్రమేపి గొయ్యి పెద్దదిగా మారింది. వర్షం కురిసినపుడల్లా అందులో నీళ్లు నిలుస్తున్నాయి. స్థానికేతరులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నపుడు దానిని గమనించక పోవడంతో అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్ అండ్ బీకి చెందిన ఈ రహదారిని ఇటీవలే నిర్మించారు. ఏడాది కూడా కాకుండానే గోతులమయమవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పీవీపీ సిద్ధార్థ కళాశాలకు వెళ్లే మార్గం ప్రారంభంలో ఏర్పడ్డ గొయ్యి



ఎమ్మెల్యే డైరీ

ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ సోమవారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.



ఎమ్మెల్సీ డైరీ

ఎమ్మెల్సీ వెంకన్న సోమవారం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

క్లిక్.. పోస్ట్ (Click.. Post)

వన్‌టౌన్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, భవానీపురం, కబేళా, పాలప్రాజెక్టు, కొత్తపేట, చిట్టినగర్, పాతరాజరాజేశ్వరిపేట, కేదారేశ్వరపేట తదితర ప్రాంతాల్లో సమస్యలు మీ దృష్టికి వచ్చిన వెంటనే ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి.

వాట్సాప్ నెంబర్ 9700255566 -చిట్టినగర్

గోతుల బాధ.. మురుగు కంపు



అప్పలస్వామి వీధిలో అధ్వానంగా రోడ్లు

చిట్టినగర్ : ఓ వైపు గోతుల రోడ్లు.. మరోవైపు మురుగు కంపు.. సాయంత్రమైతే దోమల బాధ ఇలాంటి సమస్యలతో 40వ డివిజన్‌లోని మహంతీపురం, వించిపేటవాసులు ఆందోళన చెందుతున్నారు. షాహీ మసీదు ప్రాంతంలో అప్పలస్వామి వీధిలో, పంజాసెంటర్ కింగ్ ప్లాజా ఎదురు వీధుల్లో కుంగిన రోడ్లు, సులేమాన్‌వీధి, ముసాఫిర్‌ఖానా వీధిలో పాడైన డ్రెయిన్లతో స్థానికులు అవస్థ పడుతున్నారు. సుమారు 20, 30 ఏళ్ల క్రితం వీటిని నిర్మించారు. చాలాకాలం కావడంతో ఇవి పాడయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా చెత్త వ్యర్థాలు అడ్డుపడినా కాల్వలు స్తంభిస్తున్నాయి. రోడ్లు పల్లంగా ఉండటంతోపాటు, ఇటీవల రహదార్లను తవ్వి మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయడంతో పలుచోట్ల గోతులు పడ్డాయి. అధికారులు స్పందించి వీటిని బాగు చేయించాల్సి ఉంది.



సులేమాన్ వీధిలో ధ్వంసమైన కాల్వలు





ముసాఫిర్‌ఖానా వీధిలో కుంగిన రోడ్డు.. (ఇన్‌సెట్‌లో) మహంతీపురంలో అధ్వానంగా డ్రెయినేజీ

కౌన్సిల్లో పెట్టా.. అనుమతిరాగానే పనులు మొదలు

డ్రెయిన్లు, రోడ్ల మరమ్మతులపై కౌన్సిల్లో పెట్టా. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతాం. ఇప్పటికే డివిజన్‌లో కోట్లాది రూపాయలతో పనులు చేయించా. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయిస్తా.

- షేక్ ఆసిఫ్, కార్పొరేటర్, 40వ డివిజన్

శరణు గణేశా..

- చవితి పందిళ్లలో వినాయకుడి ప్రత్యేక పూజలు
- భక్తుల సందడి.. పలుచోట్ల అన్నదానాలు..
- బాలగణపతికి అభిషేకాలు



కేటీ రోడ్డులో వినాయకుడికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగమణి



లలితానగర్‌లో లడ్డూ వేలం పాట

చిట్టినగర్/వన్‌టౌన్ : చవితి ఉత్సవాల్లో మూడో రోజు ఆదివారం కొత్తపేట, చిట్టినగర్ పరిసరాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేటీరోడ్డు వీరాంజనేయ మార్కెట్ ప్రాంతంలో ఈశ్వర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ నాగోతి నాగమణి, గౌతమ్ హైస్కూల్ డైరెక్టర్ ఎన్.సూర్యారావు తదితరులు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సోమవారం నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ నిర్వాహకుడు సురేష్ తెలిపారు.

● మహాగణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన టైలర్‌పేట జయరామ్‌వీధిలో జరుగుతున్న వేడుకల్లో నిర్వాహకులు చింతలపూడి పవన్‌కుమార్, ఎం.సురేష్, దినేష్, రాజశేఖర్, నాగిరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రైల్వే అసోసియేసిషన్ ఆధ్వర్యాన వించిపేటలో జరిగిన వేడుకల్లో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ షేక్‌ఆసిఫ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నేతలు మోహనరావు, నాగేశ్వరరావు, ధనుజయ భానుబాబు, తదితరులు పాల్గొన్నారు.



రైల్వే క్వార్టర్స్‌లో..

● వినాయక నిమజ్జన ఊరేగింపులు ఆదివారం కోలాహలంగా జరిగాయి. కొత్తపేట ఇల్లిపిల్లి నరసింహారావు వీధిలో మోక్ష రామ్‌జి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం యువత సందడి, కోలాటం, డప్పు విన్యాసాల మధ్య జై గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేసుకుంటూ నిమజ్జన ఊరేగింపులో చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వాండ్రాసి నానాజి, శ్రీకాంత్, ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునపేటలో అన్నదానం

పలుచోట్ల అన్నదానాలు

పాతబస్తీ, భవానీపురం తదితర ప్రాంతాల్లో ఆదివారం చవితి పందిళ్లలో అన్నదానాలు జరిగాయి. చవితి వేడుకల్లో మూడో రోజు ఆదివారం వినాయక విగ్రహాలను సీతమ్మ పాదాల సమీపంలోని ఘాట్‌లో నిమజ్జనం చేశారు. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ఆ మార్కెట్ ఐక్యత కమిటీ ఆధ్వర్యాన సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ నేతలు మైలవరపు కృష్ణ, ప్రకాశరావు, ప్రసాద్, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునపేటలో విఘ్నేశ్వర నాగేంద్ర సేవాసమితి ఆధ్వర్యాన జరిగిన అన్నదానంలో 25వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భవానీపురం బాజి బాబా మందిరం రోడ్డులో విఘ్నేశ్వరస్వామి సమితి ఆధ్వర్యాన జరుగుతున్న వేడుకల్లో అన్నదానం చేశారు. భవానీపురం లలితానగర్, టెలిఫోన్ కాలనీలో విఘ్నేశ్వరసేవా సమితి ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. అనంతరం జరిగిన లడ్డూ వేలం పాటలో దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ. 1,00,020కి పాడుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వై.రామయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం ఉండాలి

కబేళా : కబేళా శ్రీనిధి కాలనీలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం శ్రీగణపతి సేవాసమితి అధ్యక్షుడు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. టీడీపీ 29వ డివిజన్ అధ్యక్షుడు మైలవరపు కృష్ణ అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు రవిచంద్ర, శ్రీను, రాధా, టీడీపీ నేతలు డి.చక్రవర్తి, వీర్రారెడ్డి, జి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



బాజిబాబా మందిరంలో వినాయకుడి విగ్రహం

బాలగణపతికి కృష్ణాజలాలు, పండ్ల రసాలతో అభిషేకం

వన్‌టౌన్ : పూజారి వారి వీధిలోని బాలగణపతికి ఆదివారం మహిళలు కృష్ణాజలాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. బాలగణపతి మహిళా మండలి ఆధ్వర్యాన 108 మంది మహిళలు కృష్ణానది నుంచి 108 కలశాలతో కృష్ణా జలాలను మేళ, తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అభిషేకాలు చేశారు. మందిరం కోశాధికారి ఎం.వేణుగోపాలరావు దంపతులు పంచామృతాలు, ద్రాక్ష, దానిమ్మ, బత్తాయి వంటి 37 రకాల పండ్ల రసాలు, విభూది, చందనంతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయించారు. అనంతరం లక్ష బిల్వార్చన జరిగింది. నవరాత్రుల్లో భాగంగా స్వామివారి నిజపాదదర్శనం ఇచ్చారు. సాయంత్రం సినీ భక్తి పాటల కచేరి, హాస్యవల్లరి, టాలెంట్ షో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఎం.వేణుగోపాలరావు, టి.వసంతరావు, కె.వెంకటేశ్వరరావు, మహిళా మండలి సభ్యులు ఎ.శ్రీదేవి, ఎం.లక్ష్మీపార్వతి, జి.ప్రసన్న, సభ్యులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
5
విజయవాడ పశ్చిమ
సోమవారం 28 ఆగస్టు 2017

ఆహ్లాదం పంచుతున్న రహదారి

గొల్లపూడి : గొల్లపూడిలోని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యాలయం రోడ్డు చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. జాతీయ రహదారి నుంచి సాయిపురం కాలనీ మీదుగా వెళ్లిన తరువాత కార్యా లయం వరకు రోడ్డుకు ఇరువైపులా పచ్చని పెద్దచెట్లతో ఎంతో హాయిగా ఉంది. అనేక మంది ఈ కార్యాలయానికి నిత్యం వస్తూ వెళుతుంటారు. డ్రైవర్లు ఈ చెట్ల పక్కన వాహనాలు పెట్టుకుని సేద తీరుతుంటారు.


రహదారికి ఇరు వైపులా చెట్లు

ఈ రోడ్డు ఇంతే..!

- రథం సెంటర్ వద్ద రోడ్డు అధ్వానం
- వాహన,పాదచారులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- గాయాలపాలవుతున్న యువకులు

వన్‌టౌన్ : పాతబస్తీ కెనాల్ రోడ్డులోని రథం సెంటర్ వద్ద రోడ్డు గోతులమయంగా మారింది. ఈ సమస్యపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు, పాదచారులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఈ రోడ్డులో ప్రతిరోజు వివిధ శాఖల అధికారులు వాహనాల్లో రాకపోకల సాగిస్తున్నా ఏ ఒక్క శాఖాధికారి సమస్యపై స్పందించకపోవడం బాధాకరం. అధికారుల తీరుపై స్థానికులు, పలువురు వాహన దార్లు మండిపడుతున్నారు.

రథం సెంటర్ వద్ద అభివృద్ధి పనుల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులు రోడ్డును తవ్వేసి, పనులు పూర్తయిన తరువాత సక్రమంగా పూడ్చటానికి తగిన చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంతమంతా గోతుల మయంగా మారింది. కొద్దిపాటి వర్షానికి గోతుల్లో వర్షంనీరు నిల్వ ఉండటం వలన వాహనాల రాకపోకలతో మరింత పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. వాటిపై నుంచి రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు ఎక్కడ అదుపుతప్పి కిందపడి పోతామోనని భయపడుతున్నారు. కొందరు యువకులు గోతుల్లో వాహనాలపై వెళుతూ అదుపు తప్పి కిందపడి గాయాలు అయిన సంఘటనలు అనేకం. వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేటర్ సంబంధిత శాఖాధికారులకు పలు దఫాలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు, స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.


రథం సెంటర్ వద్ద రహదారి గోతులమయం

వీధి కుక్కల స్వైర విహారం

కబేళా: స్థానిక హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉండటంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భవానీపురం 28వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తు ద్విచక్ర వాహనచోదకుల వెంట పడుతున్నాయి. దీంతో వాహనదారులు కింద పడి గాయాలు పాలవుతున్నారు. రాత్రి సమయాల్లో పాదచారులను వెంబడిస్తూ మీద పడుతున్నాయి. చిన్నారులు స్కూలుకు వెళ్లి వస్తుండగా వీధి కుక్కలు మీదపడి కరుస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రహదారిపైన కుక్కలు

పొంచిఉన్న ప్రమాదం..!

కబేళా: స్థానిక కబేళా మెయిన్ రోడ్డులో మ్యాన్‌హోల్ మూత శిథిలమై పోవటంతో రంధ్రం బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనచోదకులకు మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డులో ఇలాంటి పరిస్థితి నెలకొన్నా పట్టించుకునేవారు లేరని స్థానికులు వాపోతున్నారు. ఈ మ్యాన్‌హోల్ మూత శిథిలమై పది రోజులు గడుస్తున్నా ఇంత వరకు సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆ ప్రాంతవాసులు తెలుపుతున్నారు. వాహనచోదకులకు మ్యాన్‌హోల్ ఉందని తెలియక పోతే దానిలో పడి ప్రమాదాలు బారిన పడే పరిస్థితి నెలకొంది.


ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మద్యం దుకాణం తొలగించాలి

- మద్యం వ్యతిరేక పోరాట కమిటీ నాయకుల డిమాండ్

విద్యాధరపురం : ఇళ్లు, స్కూళ్ల మధ్య ఉన్న స్వాతి మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలపై భవానీపురం పోలీసులు, అధికారుల సమక్షంలో దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని మద్యం వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కాంబ్వే రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాతి మద్యం దుకాణాన్ని తొలగించాలని మద్యం వ్యతి రేక పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం దుకాణం ఎదురుగా నిరసన దీక్ష నిర్వహించారు. కమిటీ నాయకులు, కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, కె.శ్రీదేవి, పారవల్లి మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా సంబంధిత స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు కుమ్మక్కై నివాసాలు, స్కూళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. స్థానిక పోలీసులు మద్యం దుకాణం నిర్వాహకులకు అండగా ఉంటూ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఈ సమస్యపై ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడుతున్న స్థానికులు, స్కూళ్ల యజమానులపై మద్యం దుకాణ నిర్వాహకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మద్యం దుకాణాన్ని తొలగించాలని నిరసన దీక్ష చేపడుతున్న మహిళలపై మద్యం సిబ్బంది దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వాటికి భయపడబోమని స్పష్టం చేశారు. మద్యం దుకాణం వద్ద ధర్నా నిర్వహించిన తమపై కేసు నమోదు చేసిన భవానీపురం పోలీసులు, సిబ్బంది తమపై దౌర్జన్యానికి పాల్పడి, బెదిరించినందుకు ఎందుకు కేసు నమోదు చేయరని వారు ప్రశ్నించారు. మహిళలకు రక్షణ కల్పించవలసిన పోలీసులే, మద్యం దుకాణం సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడుతుంటే చోద్యం చూశారని వారు ఆరోపించారు.



మద్యం వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, సభ్యుల నిరసన

మహిళలతో ఘర్షణ..

స్వాతి మద్యం దుకాణం ఎదురుగా మద్య వ్యతిరేక పోరాట కమిటీ నిరసన దీక్ష చేపట్టారు. అయితే ఆ దుకాణంలో పని చేస్తున్న ముగ్గురు దీక్ష చేస్తున్న పారవల్లి, మరొక మహిళ వద్దకు వెళ్లి మీరు స్థానికులు కాదు అంటూ, వారితో ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వావాదం జరిగింది. ఆ ప్రాంతంలో ఉన్న విద్యాధరపురం సెక్టార్ ఎస్సై శ్రీనివాసరావు, గొల్లపూడి సెక్టార్ ఎస్సై శ్రీనివాసరావు తమ సిబ్బందితో మద్యం దుకాణం సిబ్బందిని అక్కడి నుంచి పంపించి వేశారు.


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

చిట్టినగర్: టైలర్‌పేటలో తాగునీటి సమస్యను పరిష్కరించి, పగిలిన వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆదివారం టైలర్‌పేట రామాలయం వీధిలో మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ పశ్చిమ సిటీ కార్యదర్శి కె.భార్గవ్ మాట్లాడుతూ 24వతేదీన నగరపాలక సంస్థ సైడ్ డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపడుతుండగా వాటర్ పైపు లైన్ ధ్వంసమైందన్నారు. దీంతో శ్రీనివాసరావువీధి, తిరుమలరావు వీధి, పెనుమాక దేవదాస్‌వీధిలో తాగునీటి సరఫరా నిలిచి పోయిందన్నారు. నాలుగు రోజులుగా ఆయా ప్రాంతంలో ప్రజలు తాగు నీటి కోసం పడిరానిపాట్లు పడుతున్నారన్నారు. అధికారులు మాత్రం తూతూ మంత్రంగా పైపులకు మరమ్మతులు నిర్వహించి వదిలేశారని, వెంటనే అధికారులు స్పందించి ఆయా ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ పశ్చిమ కార్యదర్శి కె.మోజన్, నాయకులు బాలదుర్గారావు, ఏడుకొండుల, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.


మహాలక్ష్మి అమ్మవారి గుడి ఎదురుగా

చప్టాల ధ్వంసంతో ప్రమాదాలు..!

చిట్టినగర్: కేటీరోడ్డులో రాకపోలు సాగించాలంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న వాటర్ పైపులైన్‌కు సంబంధించిన ఎయిర్ వాల్స్‌పై ఏర్పాటు చేసిన చప్టాలు ధ్వంసం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా చిట్టినగర్ అమ్మవారి గుడి ఎదుట కేటీరోడ్డులో ఎయిర్ వాల్వ్‌పై ధ్వంసమైన చప్టా ప్రాంతంలో నిత్యం పదుల సంఖ్యలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుమారు 20 రోజుల క్రితం ఆయా ప్రాంతంలో ఎయిర్ వాల్వ్ కుంగిపోకుండా లక్షలాది రూపాయలతో మరమ్మతులు నిర్వహించారు. అయినా పట్టుమని నెల గడవక ముందు ఎయిర్ వాల్వ్‌పై ఏర్పాటు చేసిన చప్టాలు ధ్వంసం కావడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని వాహనచోదకులు కోరుతున్నారు.


ఎయిర్ వాల్వ్ ముందు ధ్వంసమైన చప్టా



ఎమ్మెల్యే డైరీ

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సోమవారం నగరంలో ఉండరు. కాకినాడ మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారు.



ఎమ్మెల్సీ డైరీ

ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఆయన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

సీఐ నియామకం ఎప్పుడో..!

- అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్
- కృష్ణంరాజుపై సస్పెన్షన్ వేటు వేసి నేటితో నెల
- ఇన్‌చార్జ్ సీఐతోనే.. సమస్యాత్మక స్టేషన్



అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్

అజిత్‌సింగ్‌నగర్ : సమస్యాత్మక స్టేషన్ ఐన అజిత్‌సింగ్‌నగర్ పీఎస్‌కు సీఐ నియామకంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గత నెల 27న నగర బహిష్కరణలో ఉన్న కరడుగట్టిన రౌడీషీటర్ కట్టా వేణుగోపాల్ అలియాస్ ఖల్‌నాయక్, అతని కుమారులు నడిరోడ్డుపై, పట్టపగలు జి.వెంకటేశ్వర్లును దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. బహిష్కరణలో ఉన్న రౌడీషీటర్ స్టేషన్ పరిధిలోనే మకాం వేసి, ఇంతటి దారుణాన్ని చేయడం ముమ్మాటికి నిఘా వైఫల్యమేనని గుర్తించిన సీపీ గౌతమ్‌సవాంగ్ సీఐ సీహెచ్వీ కృష్ణంరాజును మరుసటి రోజే సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి స్టేషన్‌కు ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణపురం సీఐ ఎం.సత్యనారాయణ ఉన్నారు. ఈ పీఎస్ కూడా కీలకం కావడంతో పాటు ధర్నా చౌక్ ఆ స్టేషన్ పరిధిలోనే ఉండటంతో సీఐకు అక్కడే సమయం సరిపోతోంది. దీనికి తోడు వి.వి.ఐ.పి. బందోబస్తుకు తరచూ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. న్యూఆర్‌ఆర్‌పేట ఘటనతో పోలీస్ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ప్రజాదర్బార్‌తో దగ్గరయ్యే యత్నం

సీఐ కృష్ణంరాజుపై సస్పెన్షన్ వేటు వేసిన సీపీ 'పేట'లో శాంతిభద్రతల పరిరక్షణలో పెద్దపీట వేశారనే చెప్పొచ్చు. జేసీపీ రమణకుమార్ న్యూరాజరాజేశ్వరిపేటలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజలతో మమేకమయ్యారు. స్థానికుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నారు.

సింగ్‌నగర్‌పై తగ్గిన నిఘా

అజిత్‌సింగ్‌నగర్‌కు కిలోమీటర్ దూరంలో ఉన్న న్యూరాజరాజేశ్వరిపేటలో స్టేషన్ ఉంది. నెల నుంచి సీఐ లేకపోవడంతో ఉన్న ముగ్గురు ఎస్సైలు పేటపైనే దృష్టి కేంద్రీకరించడంతో అజిత్‌సింగ్‌నగర్ పరిసరాల్లో నిఘా వైఫల్యం కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో ఈ నెల 21న సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడి బీరువాలోని సుమారు 40 కాసుల బంగారు నగలు అపహరించుకుపోయారు. యార్డురోడ్డులో అసంపూర్తిగా ఉన్న జీప్లస్‌త్రీ గృహాలతో పాటు రైల్వేట్రాక్ వెంట రోడ్డు గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారింది. పేటపై డేగకన్ను పెట్టిన పోలీసులు అజిత్‌సింగ్‌నగర్‌ను పూర్తిగా గాలికొదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్సైలు మినహా సీనియర్ సిబ్బంది ఉన్నా వారికి భద్రత కంటే కాసులపైనే మక్కువ ఎక్కువగా ఉండటంతో నిఘాపై దృష్టి పెట్టడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ గారు సీఐను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం రద్దీనే



మధురానగర్ పప్పుల మిల్లు రైల్వే గేట్ వద్ద రద్దీ

మధురానగర్ : మధురానగర్‌లో రైల్వేగేట్ పడితే తంటానే. ఈ ప్రాంతంలో జనాభా పెరుగుతోంది. దీనికి తగ్గట్లు ట్రాఫిక్ ఇక్కట్లు అధికమవుతున్నాయి. మధురానగర్‌కు రాకపోకలు సాగించాలంటే ప్రధానంగా రెండు రైల్వే గేట్లు దాటుకుని వెళ్లాలి. ఒకటి మధురానగర్ రైల్వే స్టేషన్ వద్ద, మరోటి మాచవరం గేటు వద్ద బీఆర్టీఎస్ రోడ్డుకు ఉత్తరం వైపు రైవస్ కాల్వను దాటిన తర్వాత పప్పుల మిల్లు రోడ్డులో ఒకటి. ఉదయం, సాయంత్రం వేళల్లో గేటు పడితే కనీసం నాలుగు నిమిషాలు నరకమే. గేటు తీసిన తర్వాత మరో పదినిమిషాలకు పైగా విపరీతమైన రద్దీ. అప్పుడు అడ్డదిడ్డంగా వచ్చే వాహనాల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటిలో మొదటి

- మధురానగర్ రైల్వేగేట్ వద్ద రోడ్డు వెడల్పు చేయడమే మార్గం

వచ్చే గేట్ వద్ద సమస్యను పరిష్కరించడానికి ఆర్‌యూబీ నిర్మిస్తామని ఎమ్మెల్యే బొండా ఉమా, కార్పొరేటర్ రవికుమార్ తరచుగా చెబుతున్నారు. ఇందుకు రూ.15 కోట్లతో డి.పి.ఆర్ పంపినట్లు చెబుతున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సమస్య ఇప్పుడు పప్పుల మిల్లు ఏరియాలో ఉన్న రైల్వే గేటు వద్ద వచ్చింది. ఇక్కడ రోడ్డు చాలా ఇరుగ్గా ఉంటుంది. పైగా శివాలయం వైపు నుంచి, కొత్త వంతెన వైపు నుంచి వచ్చే వాహనాలు రెండు ఒకేసారి గేటు దాటి మధురానగర్‌కు రావడానికి బారులు తీరుతున్నాయి. దీంతో మధురానగర్ నుంచి బయటకు వెళ్లే వాహనాలకు దారి ఉండటం లేదు. ఈ సమస్యపై స్థానిక నేతలు దృష్టి పెట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. గేటుకు ఒక వైపు ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డును వెడల్పు చేయాలని మరోవైపు రహదారిని విభజిస్తూ బారికేడ్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అయినా.. వీరు మారలేదు.



రాజీవ్‌నగర్ కరకట్టపై ఆక్రమణలు

పాయకాపురం : అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోని అధికారుల తీరు మారకపోడంతో.. రాజీవ్‌నగర్ కరకట్టపై ఆక్రమణలు మళ్లీ పుట్టుకొస్తున్నాయి. బడ్డీకొట్లు, ప్రార్థనా మందిరాల పేరుతో కబ్జాదారులు కరకట్టపై పాగావేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో వారికి అడ్డే ఉండటం లేదు. గతంలో కరకట్టపై వందలాది మంది ఆక్రమించి పాకలు వేసిన విషయం తెలిసిందే. వీటిని తొలగించడం అధికారులకు తలకుమించిన భారమైంది. చివరకు ఆక్రమణదారులకు కోట్ల రూపాయలతో ఇళ్లు కట్టించి కేటాయించాల్సి వచ్చింది. అయినా అనుభవాలనుంచి అధికారులు పాఠాలు నేర్చుకోవడంలేదు. మళ్లీ కరకట్ట ఆక్రమణదారుల చెరలోకి వెళ్లేలా కనిపిస్తోంది. తక్షణం అధికారులు స్పందించి మొదట్లోనే ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరోగ్యకేంద్రం సమీపంలో అపరిశుభ్రత



యార్డు రోడ్డులో ఆరోగ్యకేంద్రం వద్ద చెత్త

అజిత్‌సింగ్‌నగర్ : స్వచ్ఛతకు పెద్దపీట వేయాలంటున్న వీఎంసీ అధికారులు ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రం పరిసరాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. 54, 55 డివిజన్లకు సరిహద్దుగా ఉన్న భగత్‌సింగ్‌పార్కు సమీపంలోని యార్డురోడ్డులో చెత్తవ్యర్థాలను వేస్తుండటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుకు సమీపంలోనే డంపింగ్‌యార్డు ఉన్నా పారిశుధ్య కార్మికులు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను రోడ్డు వెంట వేస్తుండటంతో వాటిలో కుక్కలు చేరి, చిందరవందర చేస్తున్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రానికి వెళ్లే గర్భిణులు, బాలింతలు.. దుర్వాసనకు ముక్కు మూసుకోవాల్సిందే. అధికారులు స్పందించి ఆరోగ్యకేందరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

మూడున్నరేళ్లైనా మొండిగోడలేనా..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు బాబూరావు



వాంబేకాలనీ రోడ్డులో జీప్లస్‌త్రీ గృహాలను పరిశీలిస్తున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్ : టీడీపీ అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లయినా జీప్లస్‌త్రీ గృహాలు మొండిగోడలకే పరిమితం కావడం దారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు మండిపడ్డారు. ఇళ్ల సమస్య పరిష్కారానికి సెప్టెంబర్‌లో సీపీఎం ఆధ్వర్యాన పోరుబాట నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అజిత్‌సింగ్‌నగర్ యార్డు రోడ్డు, వాంబేకాలనీ రోడ్డులో ఆదివారం అసంపూర్తిగా ఉన్న జీప్లస్‌త్రీ గృహాలను బాబూరావు ఆధ్వర్యాన సీపీఎం బృందం పరిశీలించింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇళ్లు లేని పేదలకు పక్కా ఇంటిని మంజూరు చేస్తామన్న సీఎం.. నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. ఇళ్ల కోసం ఆన్‌లైన్ల ద్వారా వేలాది కుటుంబాలు దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నా, ఇళ్ల నిర్మాణంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బాబూరావు వెంట సీపీఎం నేతలు డి.విష్ణువర్ధన్, కరోతి దుర్గారావు, బి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి పిలుపునిచ్చారు. న్యూఆర్‌ఆర్‌పేట ప్రధాన రోడ్డులో ఆదివారం స్థానికులతో కలసి వనం-మనం కార్యక్రమం నిర్వహించిన కార్పొరేటర్ మొక్కలను నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, తదితరులు పాల్గొన్నారు. - అజిత్‌సింగ్‌నగర్

గుర్రపు డెక్క తొలగింపు పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాయకాపురం : పాయకాపురం కండ్రికకాలనీ సమీపంలోని ఔట్‌ఫాల్ డ్రెయిన్‌లో మలేరియా, శానిటరీ సిబ్బంది ఆదివారం గుర్రపుడెక్కను తొలగించారు. కాలువ గుర్రపుడెక్కతో నిండి దోమలు వ్యాపిస్తున్నాయని, మురుగునీటి పారుదలకు ఇబ్బందవుతోందని 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మలేరియా విభాగం అధికారులు ఆదివారం కండ్రికకాలనీ వద్ద నూజివీడు రహదారి పక్కన గుర్రపుడెక్కను తొలగించారు.



గాంధీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్



ప్రారంభానికి సిద్ధం

గాంధీనగర్‌లో అలంకార్ సెంటర్ వద్ద రైవస్ కాలువ పక్కన నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. మరో పది రోజుల్లో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ సబ్‌స్టేషన్‌ను రూ. 4.65 కోట్లతో నిర్మిస్తున్నారు. దీనికి గ్యాస్ ఇన్సులేటెడ్ బ్రేకర్స్‌ను అమర్చుతున్నారు. ప్రస్తుతం గాంధీనగర్, దుర్గాపురంలోని సబ్‌స్టేషన్లకు తగినంత విద్యుత్ సామర్థ్యం లేక తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయి. వేసవిలో అయితే ఈ సమస్య మరింత అధికంగా ఉండేది. ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే విద్యుత్ సమస్యలు ఉండవని, నిర్వహణను పూర్తిగా కంప్యూటరైజ్డ్‌గా చేయడంతో ఏ ప్రాంతంలో విద్యుత్ సమస్య ఉందనే విషయాన్ని క్షణాల్లో తెలుసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

-గాంధీనగర్

ఇక్కడ షెల్టర్లు.. అక్కడ ప్రయాణికులు



జీఎస్‌రాజు వాటర్ ట్యాంక్ వద్ద..

సత్యనారాయణపురం : ప్రయాణికులు ఉన్న చోట బస్‌షెల్టర్లు లేవు. షెల్టర్లు ఉన్న చోట బస్సులు ఆగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జీఎస్‌రాజు రోడ్డులో వాటర్‌ట్యాంక్ వద్ద బస్టాప్ నిరుపయోగంగా ఉంది. ఎందుకంటే వీటికి సమీపంలోని మీసాలరాజారావు జంక్షన్ వద్ద బస్‌లు ఆగుతున్నాయి. జంక్షన్ కావడంతో ప్రయాణికులందరూ అక్కడే ఉంటున్నారు. కానీ షెల్టర్ లేదు. వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ బిచ్చగాళ్లకు , కబుర్లు చెప్పుకొనేవారికి ఉపయోగపడుతోంది. ప్రయాణికులు ఉన్న చోట షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతతో ఇబ్బందులు

పాయకాపురం : పాయకాపురం ప్రాంతంలో అప్రకటిత విద్యుత్ కోతతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాష్‌నగర్, ఉడాకాలనీ, ఎల్‌బీఎస్‌నగర్‌లో రోజూ ఏదోఒక సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. వెంటవెంటనే ఒకటికి రెండుసార్లు విద్యుత్ సరఫరా వచ్చిపోతుండటంతో గృహోపకరణాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏకదంతాయ నమోనమః



విజయదుర్గానగర్‌లో జరిగిన అన్నదానంలో డిప్యూటీ మేయర్ రమణారావు



సింగ్‌నగర్ రైతుబజార్‌లో ..



కుంకుమార్చన

అజిత్‌సింగ్‌నగర్ : సింగ్‌నగర్ పరిసరాల్లో వినాయకచవితి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. సింగ్‌నగర్ రైతుబజార్‌లో రైతులు ఏర్పాటు చేసిన పందిరిలో ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అన్నసంతర్పణ, నిమజ్జన ఊరేగింపు జరపనున్నట్లు ఈఓ శ్రీనివాసరావు చెప్పారు. సింగ్‌నగర్‌లో వరలక్ష్మి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యాన జరుగుతున్న వేడుకల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి సుజాత ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దివి ఉమా తదితరులు పాల్గొన్నారు..



ప్రకాష్‌నగర్‌లో అన్నదానం

● దేవినగర్, విజయదుర్గానగర్ మధ్యకట్ట ప్రాంతాల్లో జరుగుతున్న గణేష్ ఉత్సవాల్లో ఆదివారం అన్నసంతర్పణలు జరిగాయి. డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

● అయోధ్యనగర్ వినాయకుడిగుడి వద్ద కంటుముజ్జి శివ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. వైసీపీ నేత తోట శ్రీను పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాసరి దుర్గారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

● **పాయకాపురం :** ప్రకాష్‌నగర్ ప్రాంతంలో వినాయక చవితి ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం చేశారు. వైసీపీ నాయకులు మోదుగుల గణేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 500మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.ప్రభు, డి.గోపీ, కళ్యాణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **సత్యనారాయణపురం :** పురుషోత్తం వారి వీధిలో వినాయక చవితి వేడుకల సందర్భంగా ఆదివారం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పురుషోత్తం వీధి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో సాయంత్రం వినాయక విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిఖిల్, సాయి, తేజ, పండు తదితరులు పాల్గొన్నారు.



పురుషోత్తం వీధిలో..

ఇంకా మట్టిరోడ్డుగానే...!



నూజివీడు రహదారిని ఆనుకున్న రోడ్డు

పాయకాపురం : నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్(కండ్రికకాలనీ) లోని నూజివీడు రహదారిని ఆనుకుని ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో నూజివీడు రహదారిని ఆనుకుని అవుట్‌ఫాల్‌డ్రెయిన్ పక్కన రోడ్డు ఉంది. దీన్ని ఆనుకుని అనేక ప్రభుత్వ స్థలాలు ఉండటంతో ఇటీవల అధికారులు ఆ స్థలాల్లో కల్యాణమండపం, ఆరోగ్యకేంద్రం, పార్కులను నిర్మించారు. ఆ నిర్మాణాలు జరిగిన చోటే రోడ్డును అభివృద్ధి చేసి మిగిలిన ప్రాంతంలో వదిలేశారు. దీంతో ఈ రోడ్డు స్థానికులకు ఉపయోగంలేకుండా పోయింది.



రోడ్డు పక్కన జనావాసాల వద్ద..

పూర్తిగా అభివృద్ధి చేయాలి

కిలోమీటరు పొడవు ఉన్న రహదారి అధికారుల నిర్లక్ష్యంతో ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. ఇటీవల ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేసినా ఇక్కడికి వెళ్లడానికి సరైన రోడ్డులేదని, ఇంక పార్కు ఉండి ఉపయోగం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కాలువ పూడ్చారు.. వ్యాపారాలు చేస్తున్నారు..

సత్యనారాయణపురం : బీఆర్టీఎస్ రోడ్డు వెంట ఉన్న కాల్వను పూడ్చేశారు. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీతన్నపేట జంక్షన్‌నుంచి ఫుడ్ జంక్షన్ వరకూ బీఆర్టీఎస్‌రోడ్డుకు ఇరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి డ్రెయిన్ నిర్మించారు. వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో నర్రావారి వీధి వద్ద నుంచి ఫుడ్ జంక్షన్ వరకూ నిర్మించిన కాల్వను పూడ్చి వేశారు. అక్కడ చదును చేసి వాహనాలు నిలుపుతున్నారు. వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బీఆర్టీఎస్ రోడ్డులో కాలువపై చిరు వ్యాపారాలు



ఎమ్మెల్యే డైరీ

గద్దెరామ్మోహన్ సోమవారం సీఎం ఇంటి వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే కాకినాడ ఎన్నికలపై జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. కార్యాలయంలో అందుబాటులో ఉండరు.



ఎమ్మెల్సీ డైరీ

ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సోమవారం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు

'చెత్త' రోడ్లు

● రోడ్లపై పేరుకు పోతున్న చెత్త కుప్పలు, వ్యర్థాలు
● దుర్గంధం భరించలేకపోతున్నామంటున్న స్థానికులు

పటమట : రోడ్ల మీద చెత్త దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు లేరని స్థానికులు వాపోతున్నారు. ఫన్‌టైమ్ క్లబ్ సమీపంలో, చుట్టుగుంట గద్దె బాబురావు వీధుల్లో సేకరించిన చెత్తను డంపర్‌బిన్‌ల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బంది రోడ్ల మీద వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫన్ టైమ్స్ క్లబ్ సమీపంలో చెత్త, వ్యర్థాలు గుట్టల కొద్దీ దర్శన మిస్తున్నాయి. వీటి సేకరణకు కార్పొరేషన్ సిబ్బంది రాకపోవడంతో రోజుల తరబడి ఇక్కడే వుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో గుట్టల కొద్దీ పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెట్టడం వల్ల పక్కనే చెట్టు నిలువునా మాడి పోయిందని వారు వాపోతున్నారు.



ఫన్‌టైమ్స్ రోడ్డులో పేరుకు పోయిన చెత్త, వ్యర్థాలు

గద్దెబాబూరావు వీధిలో

మాచవరం : చుట్టుగుంట గద్దె బాబురావు వీధిలో చెత్త వ్యర్థాలను వదిలివేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. కార్పొరేషన్ సిబ్బంది సేకరించిన చెత్త, వ్యర్థాలను డంపర్ బిన్లలో వేయకుండా రోడ్డుపై వదిలేస్తున్నారు. వెంటనే తొలగించకుండా ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని, అటువైపుగా నడవలేకపోతున్నామని, వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కొండల్లా పేరుకుంటున్న చెత్త దిబ్బలు

మొగల్రాజపురం: ఎనిమిది, పద్దెనిమిది డివిజన్ల పరిధిలోని సిద్ధార్థనగర్ పక్కనే ఉన్న బ్యాంకు కాలనీ1,2 వీధుల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కాలనీలో ఇటీవల గ్యాస్ కంపెనీ వారు పైపు లైను వేస్తున్నారు. ఒక పక్క రోడ్లు తవ్వడం, పూడ్చడం, మరో వైపు కాలనీల రోడ్డు మలుపుల్లో చెత్త కుప్పలతో పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. వర్షానికి చెత్త తడిసి భరించలేని వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బంది రోడ్లు ఊడ్చి వెళ్లిపోతున్నారనీ, చెత్త సేకరించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్త తొలగించాల్సిందిగా కోరుతున్నారు.





మొగల్రాజపురం సిద్ధార్థనగర్ పక్కనే ఉన్న బ్యాంకు కాలనీ రోడ్ల మీద చెత్త దిబ్బలు



గద్దె బాబూరావు వీధిలో ..

ప్రమాద సూచికలేవి?



హెచ్చరిక బోర్డు పెట్టకుండా యూజీడీ కోసం తవ్విన గొయ్యి

పటమట : కార్పొరేషన్ సిబ్బంది యూజీడీ కనెక్షన్ ఇవ్వడానికని, పైపు లైన్లు వేయడానికని పెద్ద పెద్ద గోతులు తవ్వి వదిలేస్తున్నారు గొయ్యి వున్నదని తెలియజేస్తూ ప్రమాద సూచిక ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పదో డివిజన్ లోని సర్వే లేబొరేటరీ రోడ్డులో చౌదరిపేట వద్ద ఓ అపార్టుమెంటుకు యూజీడీ కనెక్షన్ ఇవ్వడం కోసం కార్పొరేషన్ సిబ్బంది ఆదివారం పెద్ద గొయ్యి తీశారు. ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. నిత్యం ఈ మార్గంలో వేలాది మంది రాకపోకలను సాగిస్తుంటారు. రాత్రివేళలో అందులో పడితే ప్రమాదాలకు లోనవుతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'పుప్పాల' భౌతికకాయం వద్ద గద్దె రామ్మోహన్, అవినాష్ నివాళి



సూర్యాప్రకాశరావుకు నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

కృష్ణలంక : లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి భర్త పుప్పాల విష్ణు సూర్యప్రకాశరావు (పెద్దబ్బాయి) మృతదేహాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టీడీపీ నాయకులు దేవినేని అవినాష్‌లు సందర్శించి నివాళులర్పించారు. కృష్ణలంక 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి భర్త సూర్యప్రకాశరావు (పెద్దబ్బాయి) అమెరికాలో కుమార్తె దగ్గరకు వెళ్లి అనారోగ్యంతో ఈ నెల 18వ తేదీ మరణించారు. మృతి చెందిన తరువాత వారం రోజుల తరువాత మృతదేహాన్ని కృష్ణలంకలోని ఆయన సొంత ఇంటికి శనివారం తీసుకువచ్చారు. తెలుగుదేశం నేతలతో పాటు, ఆటోనగర్‌లోని వివిధ లారీ అసోసియేషన్ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

అన్ని రోజులూ మంచివే

డాక్టర్ సమరం

పటమట : అన్ని రోజులూ మంచివేనని ముహూర్తాలను నమ్మకోవడం మనిషిలోని వివేకాన్ని తాకట్టు పెట్టడమేనని ప్రముఖ వైద్యుడు జి.. సమరం అన్నారు. బెంజ్ సర్కిల్‌లోని నాస్తిక కేంద్రం లో ముహూర్తాల్లో శాస్త్రీయత ఎంత? అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సమరం మాట్లాడుతూ ముహూర్తాల నమ్మకాన్ని విడనాడితే తప్ప ప్రగతి సాధించలేమని అన్నారు. అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులకైనా సూర్యుడు, భూమి, చంద్రుడు, వాటి కదలికలు, స్థితిగతులపై శాస్త్రీయ అవగాహన ఉన్నట్లయితే అమావాస్య, పౌర్ణమి ఎలా కలుగుతుందో చెప్పగలరన్నారు. నిర్జీవ గ్రహాలకు హింస, విధ్వంసం, పగ, వంటి మానవ గుణాలను ఆపాదించడం అవివేకానికి చిహ్నమన్నారు. రాశుల్లో గ్రహాల స్థానం బట్టి మంచి చెడు సమయాలను నిర్ధారించడం అవివేకమని ఆయన వివరించారు. దుర్ముహూర్తాల్లో మరణాలు జనన, మరణాలు జరిగితే వాటికి శాంతి చేయడం మనిషి అవివేకానికి చిహ్నమని సమరం వ్యాఖ్యానించారు. ఏదైనా పనిలో విజయం సాధించాలంటే కృషి, పట్టుదల ఆధారపడి ఉంటుందని,తిథి, వార, నక్షత్రాల మీద ఆధారపడదన్నారు. సదస్సులో నాస్తిక కేంద్రం అధ్యక్షుడు హరి సుబ్రహ్మణ్యం, మారు, రశ్మి, కీర్తి, విజయం, నియంత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సమరం

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

గుణదల: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ అయినట్లు పటమట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఆటోనగర్ ఎలక్ట్రికల్ కాలనీలో నివాసం ఉంటున్న కమల(60) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఎదురుగా మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని ఏడు కాసుల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యారు. వృద్ధురాలు కమల అరిచినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలు పటమట పోలీసులకు సమాచారం అందించింది. పటమట ఎస్సై సత్యన్నారాయణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పూర్వాపరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడు కాసుల బంగారు చైన్ చోరీ అయినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట పోలీసులు తెలిపారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

బెంజ్‌సర్కిల్ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పై ఫాస్వల్ ఆధ్వర్యంలో బెంజ్‌సర్కిల్‌లోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు .ముఖ్య అతిథి ఆడిటర్ సీఎపి సుబ్బారాయుడు మాట్లాడుతూ. జీఎస్టీ పరిధిలోకి వచ్చేవారు జీఎస్టీ కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఫాస్వల్ అధ్యక్షుడు ఎమ్. లింగేశ్వరరావు, మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య, శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, గుమ్మా సాంబశివరావు, ఎం.వి రామారావు, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖైనీ విక్రయిస్తున్న కేసులో ముగ్గురి అరెస్టు

గుణదల : నిషేధిత ఖైనీ ప్యాకెట్లు మార్కెట్లో విక్రయిస్తున్న ముగుర్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరు ఓ ముఠాగా ఏర్పడి ఖైనీ ప్యాకెట్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఏసీపీ పి.మురళీధర్, సీఐ ఆర్.సురేష్ రెడ్డిలు సిబ్బందితో దాడిచేసి ఖైనీ ప్యాకెట్లను మార్కెట్లోని దుకాణాలకు ఆటోలో తరలిస్తున్న ప్రసాద్, జాలయ్య, వెంకట్రావ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6లక్షల విలువ చేసే ఖైనీ ప్యాకెట్లతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారణ నిమిత్తం మాచవరం పోలీసులకు అప్పగించారు. మాచవరం పోలీసుల ఆదివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు.

జయము నిచ్చు గణేశా..



వినాయకుడి ఊరేగింపును ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ

వేడుకగా నిమజ్జనోత్సవం

నాగార్జున నగర్ కాలనీ, శ్రీరామచంద్ర నగర్ కాలనీల్లో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు జరిగాయి.

స్వామి వారిని మేళ తాళాలు, తీన్‌మార్ డప్పులతో ఎన్టీఆర్ కాలనీ, వెటర్నరీ కాలనీ పుర వీధులలో ఊరేగించారు. ఈ వేడుకలు కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగాయి.



శ్రీరామచంద్రకాలనీలో

పటమట : పటమట ప్రాంతంలోని వినాయక విగ్రహాలను ఆదివారం ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. ఉత్సవాలను 10వ డివిజన్ అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల ఊరేగింపును జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు పొట్లూరి సాయిబాబు, అరీఫ్, చక్రి, శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

రెండో డివిజన్‌లో

భారతీనగర్ : రెండో డివిజన్ పరిధిలో కరెన్సీనగర్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీ,



సభ్యుడు సత్యనారాయణ, వర్మీ ప్లాంటు సలహాదారు సుబ్బారావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

● **భారతీనగర్** : భారతీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పారిశ్రామికవేత్త కోగంటి సత్యం స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చవితి వేడుకల్లో కోగంటి సత్యం



గాయత్రి నగర్ శ్రావణ టవర్ అపార్ట్‌మెంట్‌లో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

రెండు వేలమందికి అన్నదానం

పటమట : ఎలక్ట్రిసిటీ కాలనీలో ఆదివారం కాలనీ గౌరవ అధ్యక్షుడు నల్లూరి కాశీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కాలనీ అధ్యక్షుడు జి. చలపతిరావు, స్వామి వారి కమిటీ చైర్మన్ తిలక్,



అన్నదానం చేస్తున్న మహిళలు

కల్వర్టా.. రాళ్ల గుట్టా ?



రాళ్లగుట్టగా మారిన కల్వర్టు

మొగల్రాజపురం : కార్పొరేషన్ అధికారులకు సమస్య కనిపించినా కనిపించనట్టు నిద్ర నటిస్తున్నారనడానికి సంకేతం మొగల్రాజపురంలోని ఆదాయ పన్నుశాఖ కార్యాలయం వద్ద ఉన్న కల్వర్టే సాక్ష్యం. వర్షం వచ్చినపుడు రోడ్డు మునిగి కల్వర్టులు కనిపించకపోవడం, కాల్వలో చెత్త మొత్తం వచ్చి కల్వర్టు దగ్గర ఆగిపోతుండటంతో నెల రోజుల క్రితం ఈ కల్వర్టును ఎత్తు లేపారు. ఎత్తు లేపారు కాని ఉత్తర దక్షిణ రోడ్డును కలిపేలా కల్వర్టుకు తారుతో జాయింట్ కలపాల్సి ఉండగా కంకరు డస్టు వేసి చేతులు దులుపుకున్నారు .ఇది వేసిన తరువాత వర్షాలు పడటంతో కంకరులో ఉన్న డస్టు కొట్టకు పోయింది. రాళ్లు బయట పడ్డాయి. వాహనల తాకిడికి ఈ రాళ్లు రోడ్డుమీదకు వచ్చేశాయి. దీంతో కల్వర్టును దాటే ద్విచక్ర వాహనాల టైర్లు స్లిప్ అయి కింద పడుతున్నాయి. వాహనదారులు గాయపడుతున్నారు. ఇదే విషయాన్ని పత్రికలలో కథనాలుగా ప్రచురిస్తున్నా అధికారులు మౌన ముద్ర పాటిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరచి కల్వర్టు వద్ద రాళ్లను తొలగించి రోడ్డుకు కలపాలని కోరుతున్నారు.

పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదు

కంకిపాడు: ప్రముఖ సినీ నటుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదని పవన్ కళ్యాణ్ ఫ్యాన్ అసోసియేషన్, జనసేన నాయకుడు ముప్పా గోపాలకృష్ణ, యలిశెట్టి సుబ్బారావు హెచ్చరించారు. పవన్ కళ్యాణ్‌పై కత్తి మహేష్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గంగానమ్మ గుడినుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో గులాబీలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ను కించపరిచే విధంగా అనామకుడు కత్తి మహేష్ మాట్లాడటం సరికాదన్నారు. ముప్పా వెంకటేష్, సుధీర్, మ్యారి, హరీష్, అజయ్, పులి బాబి, రంజిత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్ లీక్

మారుతీనగర్ వీరయ్య వీధి, కోకోకోలా కంపెనీ వీధుల్లోని మ్యాన్‌హోల్స్ లీకై నిత్యం మురుగు నీరు పొంగిపొర్లుతోంది. కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోల్‌లో పూడిక తీయాల్సిందిగా సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ లీకై నివాసాల్లోకి నీరు చేరకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. - మాచవరం



మారుతీనగర్ కోకో కోలా కంపెనీ రోడ్డులో పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్



వీరయ్య వీధిలో

రహదారిపై రాళ్లు

ప్రమాదాలబారిన వాహనదారులు



భారతీనగర్ (క్రీస్తురాజుపురం) : హడావిడిగా రోడ్లు మరమ్మతులు చేసి వాటిని సరిగా చదును చేయకపోవడంతో రాళ్లు పైకి వస్తున్నాయి. మూడో డివిజన్ పరిధిలో క్రీస్తురాజుపురం రోడ్డులోని విజయనగర్‌కాలనీ వద్ద పడ్డ గోతులకు మరమ్మతులు చేశారు. వాటిని సరిగా చదును చేయకపోవడంతో వాహనాల ఒత్తిడికి రాళ్లు బయటకు వచ్చాయి. వీటి వల్ల వాహనాలు జారడంతో ఎక్కడ ప్రమాదాలకు గురి అవుతాయోనని వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణ రోడ్లు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.